ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ

# తెలుగు వాక్యం


రచయిత

శ్రీ చేకూరి రామారావు



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాద్,

హైదరాబాదు

ప్రథమ ముద్రణ
1975

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
హైదరాబాదు

మూల్యము రూ. 3-00

ముద్రణ : శివాజీ ప్రెస్, సికింద్రాబాదు.

# ముందుమాట

ఎన్నో ఏళ్ళుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వసమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధు లందరిని ఒకచోట సమీకరించవలెనని పెద్ద లందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలం నుండి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదుకోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడేవారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వ యుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలనాయుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్ళడం జరిగింది. అట్లా వెళ్ళిన తెలుగువారు తమ భాషా సంస్కృతి సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికి, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహద కారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగుజాతిని సమైక్యం చేయగలవనీ, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవనీ విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన, తెలుగు ఉగాది రోజున, ప్రారంభమై ఒక వారం రోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కోవంటి అంతర్జాతీయ సంస్థలనుంచి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు.

ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజ భూతమవుతుంది. తెలుగువారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజుల పాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను విశదం చేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదం చేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయిత లందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకువచ్చిన అకాడమీ అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగువారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయు లందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

**జలగం వెంగళరావు**
**అధ్యక్షులు**
ప్రపంచ తెలుగు మహాసభలు

# పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రవర్ధమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగుదేశపు నలుచెరగుల పరిచితము చేయు సంకల్పముతో 1975 వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింపజేయుటయేగాక, ప్రపంచములోని వివిధ దేశాలలో నివసించు చున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధులందరును ఒకచోట సమావేశమగు వసతిని కల్పించుటకై 1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభ హైదరాబాదున జరుగు నటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వానసంఘము ఏర్పాటయినది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగం వెంగళరావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు, విద్యాశాఖామంత్రి మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు దాని కార్యనిర్వాహకాధ్యక్షులు, ఆర్థికమంత్రి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్య క్రమాల సమన్వయసంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగుజాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగ ఆంధ్ర భాషా, సాహిత్య, కళా, చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికములునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వాహణకై 44 మంది సభ్యులుకల ఒక విద్వత్సంఘమును, శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్సంఘము ఆ లఘు గ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆయారంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగ యెన్నుకొనినది. ఈ విధముగ సిద్ధమైన గ్రంథములలో భాషా, సాహిత్య, చారిత్రక విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింప

వలసినదిగ ప్రపంచ తెలుగుమహాసభా కార్యనిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు అకాడమీని కోరిరి. మహాసభా సఫలత కొరకై కృషిచేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించినది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో ఈ **తెలుగు వాక్యం** అను గ్రంథమును, రచించినవారు చేకూరి రామారావుగారు ఆంధ్ర పాఠకలోకమునకు సుపరిచితులు. వారికి మేము కృతజ్ఞతాబద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ, చక్కగ ముద్రించిన శివాజీ ప్రెస్ వారికి మా కృతజ్ఞత.

**దేవులపల్లి రామానుజరావు**
*కార్యదర్శి*
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

హైదరాబాదు
31-3-1975

# ముందుకు పోయే ముందు

ఆధునిక భాషాశాస్త్ర పద్ధతుల్లో తెలుగు భాషమీద పరిశోధన ప్రారంభమై ఎంతోకాలం కాలేదు. అందులో వాక్య నిర్మాణ పరిశీలన మరీ ఇటీవలిది.

తెలుగు వాక్యాన్ని నేను అర్థం చేసుకోటానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఇప్పటికి ఇది ఒక మజిలీ. దాదాపు పదేళ్లనుంచి తెలుగు వాక్యం గురించి నేను చేస్తున్న పరిశీలనను నా జాతి జనులతో పంచుకోవాలని చేసిన ప్రయత్నం ఇది ఇందులో ఎక్కువ భాగం — ముఖ్యంగా సంశ్లిష్ట వాక్యాలనుంచి — నా ఆలోచనల ప్రతిబింబాలే. ఇందులో కొన్ని అభిప్రాయాలు అక్కడక్కడా వ్యాసాల రూపంలో అచ్చయినా ఈ పుస్తకంలోకి వచ్చేటప్పటికి కొన్ని మార్పులు జరిగినై. అవీ, ఏ చేదర్థకాలను గురించి, అనుకృతిని గురించి ఈ పుస్తకంలోనే తొలిసారిగా చెప్పిన అభిప్రాయాలు చాలా ఉన్నై. ఆ అధ్యాయాల్లో చేసిన కొన్ని ప్రతిపాదనలు తెలుగు భాషా పరిమితిని దాటి ఇతర భాషలకు కూడ వర్తించగలవన్న ఆశ లేకపోలేదు. ఏ శాస్త్రం ప్రతిపాదనైనా నిల్చేది అంతకన్నా మేలైన ప్రతిపాదన వచ్చేటంతవరకే. అట్లాంటి కొత్త ప్రతిపాదలను ప్రేరేపించటమే ఈ పుస్తకానికి ప్రధాన లక్ష్యం.

విషయ ప్రతిపాదన పదునుగా ఉండాలంటే సాంకేతిక పదజాలం తప్పనిసరి అవుతుంది. అది మితిమీరితే విషయం దురవగాహమై పాఠకులకు చికాకు కలిగిస్తుంది. ఇందులో అట్లాంటి పదజాలాన్ని చాలా పరిమితం చెయ్యటానికి విశేషంగా ప్రయత్నించాను.

భాషను గురించి తెలుసుకోగోరే జిజ్ఞాసువులకు ఈ పాటికే పరిచయం అయి ఉంటయ్యన్న ఉద్దేశంతో గుప్తనిర్మాణం, వ్యక్తనిర్మాణం; గర్భివాక్యం, గర్భ వాక్యంవంటి కొన్ని మాటలను అక్కడక్కడా వాడాను. సూత్రాల క్రమవర్తనను ఒకటి రెండు చోట్ల ప్రస్తావించాను. ఈ మాత్రం సాంకేతికతను పాఠకులు భరించ

గలరనుకుంటాను అధిక వివరణ కావల్సివస్తుందనీ, అచ్చువెయ్యటంలో చిక్కులు వస్తయ్యనీ, ఇట్లాంటి పరిశీలనకు అవసరమైన చెట్టు బొమ్మల్ని (Phrase markers) వెయ్యలేదు.

ఈ పుస్తకంలో వ్యాకరణ సమ్మతమైన వాక్యాలను వ్యాకరణ విరుద్ధమైన వాక్యాలతో పోల్చిచూపటంద్వారా వివరించటానికి ప్రయత్నించాను. వ్యాకరణం అంటే వ్యవహర్తలను ఇట్లా మాట్లాడమని గాని, రచయితలను ఇట్లా రాయమని గాని శాసించే లిఖిత సూత్రాల పుస్తకం అనే అర్థంలో వాడటం లేదు. భాషా వ్యవహారంలో వ్యవహర్తలు పాటించే నియమావళి అనే అర్థంలో వాడుతున్నాను. ఈ నియమాలు వ్యవహర్తల మనస్సులో అజ్ఞాతంగా ఉంటై వాటిని జాగ్రత్తగా గ్రహించి వ్యక్తరూపం ఇయ్యటమే భాషాపరిశోధకులు చేసేపని.

వ్యాకరణ సమ్మతిని నిర్ణయించటానికి పనిముట్లు ఉండవు. భాషా పరిశీలన ద్వారా పరిశోధకుడు ఏర్పర్చుకున్న అంతర్దృష్టి తప్ప వేరే ఆధారంలేదు. అదీగాక వ్యాకరణ సమ్మతి వ్యవహర్తల, ప్రాంతాలనుబట్టి, అలవాట్లనుబట్టి, నమ్మకాలను బట్టి ఉండవచ్చు. అందువల్ల ఈ పుస్తకంలో కొన్ని వాక్యాల వ్యాకరణసమ్మతి, అసమ్మతులను గురించి నేను చేసిన నిర్ణయాలతో కొందరు పాఠకులు ఏకీభవించక పోవచ్చు. అంతేగాక ఉదాహృత వాక్యాలకు సందర్భాలు కేవలం ఊహ్యాలే గనుక సమ్మతి, అసమ్మతులలో వ్యత్యాసం రావటం సహజం. అందుకోసం సాధ్యమైనంత సహజంగా ఉండే ఉదాహరణలను ఎన్నుకోటానికి చాలాచోట్ల ప్రయత్నించాను.

పూర్తిగా వ్యాకరణ విరుద్ధమనితోచిన వాక్యాలకు, అక్కడ ఉద్దిష్టమైన అర్థాన్ని ఇయ్యలేని వాక్యాలకు, పువ్వు గుర్తుంచాను. వ్యాకరణ సమ్మతి సందేహమని తోచిన వాక్యాలముందు ప్రశ్నార్థక చిహ్నం ఉంచాను. ఒక సంఖ్యముందు పువ్వు గుర్తుంటే అందులో ఉదాహరించిన వాక్యాలన్నీ వ్యాకరణ విరుద్ధాలనీ (లేక ఉద్దిష్టార్థబోధకాసమర్థాలు), a, b, c, d అనే అక్షరాలముందుంటే కేవలం ఆ వాక్యాలు మాత్రమే వ్యాకరణ విరుద్ధాలనీ ఉద్దేశించాను. ఈ పద్ధతి ప్రశ్నార్థక చిహ్నం విషయంలోకూడా పాటించబడింది.

ఇందులో ముఖ్యంగా పరిశీలించింది ఆధునికభాషలో వ్యవహరించటానికి వీలున్న వాక్యాలను. ఈ పరిశీలన ఆధునిక రచనాభాషకుకూడా వర్తిస్తుంది. వాక్య

నిర్మాణంలో ప్రాచీననాధునికభాషలమధ్య భేదం స్వల్పం. అందువల్ల ఈ సూత్రీకరణలలో చాలావరకు ప్రాచీనభాషకుకూడా వర్తిస్తై. అది సూచించటానికి అందుబాటులో ఉన్న ప్రాచీనాధునిక రచనల్లోనుంచి కొన్ని ప్రయోగాల్ని అక్కడక్కడ ఉదాహరించాను. కొన్ని సూత్రీకరణలు ఇతర ద్రావిడ భాషలకు కూడా వర్తించవచ్చు. భాషలమధ్య వాక్యనిర్మాణ విషయంలో అధికసామ్యం ఉండటమే ఇందు క్కారణం.

ఈ రచనలో అక్కడక్కడ కర్మణి వాక్యాలను ప్రయోగించాను. కర్మణి వాక్యాలమీద నాకు ప్రత్యేకమైన మోజేమీలేదు. అకారణమైన ద్వేషమూ లేదు. సకర్మక వాక్యాల్లో కర్తృప్రాధాన్యాన్ని తగ్గించటానికి భాషలు అనుసరించే ఒక పద్ధతి కర్మణి ప్రయోగం. ఇది ఇతర మార్గాలద్వారా సాధించవచ్చు గాని, తెలుగులో క్రియా విభక్తులు అందుకు ఆటంకం. రచనా భాషలో, ముఖ్యంగా పరిశోధనా వ్యాసంగంలో ఉత్తమ పురుష కర్తృక వాక్యబాహుళ్యం తప్పించుకోటం కష్టం. ఒక్కొక్కసారి ఆ వాక్యాలు రచయిత అభీష్టానికి విరుద్ధంగా అహంకార ద్యోతకాలు కావచ్చు. ఆ ప్రమాదం నుంచి కాపాడు కోటానికి కర్మణి వాక్యాలు రచయితలకు కవచాల్లాంటివి. ఆ ఉద్దేశంతోటే ఈ పుస్తక రచనలో కర్మణి వాక్యాలు వాడబడినై.

ఈ రచనలో సంస్కృత పద బాహుళ్యాన్ని కూడా అయిష్టంగానే గుర్తించాను. తెలుగు వ్యాకరణ సంప్రదాయం మంచికో, చెడ్డకో సంస్కృత మార్గంలోనే మొదలయి పెరుగుతూ వచ్చింది. ఆ సంబంధాన్ని ఇవాళ అమాంతంగా తెంచుకోటం అంత సులభంగా సాధ్యమయ్యేది గాదు. అందువల్ల ఇందులో కొత్తగా వాడిన పరిభాషకూడా ఆ మార్గంలో తయారుచేసిందే. సమాన కల్పనలో, సరూప సంగ్రహ పదనిర్మాణంలో సంస్కృత భాషలో ఉన్న సౌకర్యమే బహుశా ఇందుక్కారణ మనుకుంటాను.

ఈ పుస్తకంలో ఏ అధ్యాయమూ ఏమాత్రం సమగ్రం కాదని ఎవరైనా వెంటనే గ్రహించగలరు. ఏ రెండు ఉదాహృత వాక్యాలను తీసుకున్నా, మళ్ళీ ఇంతకు రెండింతలు గ్రంథం రాయొచ్చు. అంటే నేను రాయగలనని కాదు. అంత విషయం ఉంటుందని. తెలుగు వాక్యాన్ని గురించి ఇంతవరకు తెలుగులో ఒకపాటి పుస్తకమైనా లేనందువల్ల, అసమగ్రంగా నైనా ఇప్పటివరకు గ్రహించినంత మట్టుకు

ఒకచోట కూరిస్తే తెలుసుకోదల్చుకున్న వాళ్లకు, మరింత కృషి చెయ్యదల్చుకున్న వాళ్లకూ ఉపయోగిస్తుంది గదా అని ఈ సాహసానికి పూనుకున్నాను. ఇంకా కొన్నేండ్లు కృషిచేస్తే ఇంతకన్నా సమగ్రమైన, విపులమైన పెద్దపుస్తకం రాయటానికి వీలుపడొచ్చు. ఇంతకుముందే సూచించినట్టుగ ఈ పుస్తకంలో ప్రతిపాదించిన విషయాలు శాశ్వత సత్యాలనే భ్రమ (అసలు శాశ్వత సత్యాలనేవి ఉంటే) నాకు లేదు.

దారిన నడుస్తున్నప్పుడో, ఏ అల్పాహారమో పానీయమో సేవిస్తున్నప్పుడో శాస్త్రవిషయాలను ముచ్చటించుకోటం భాషాపరిశోధకులకు అలవాటు ఆ విధంగా తెలుగు వ్యాకరణాంశాలను గురించి మా గురువుగారూ (భద్రిరాజు కృష్ణమూర్తిగారు) నేనూ తరచు చర్చించుకుంటుంటాం. ఒకరి ప్రతిపాదనలకు ఇంకొకరు విరుద్ధోదాహరణలు చూపించటం ఆ చర్చల్లో ఒక భాగం. దానివల్ల సూత్రీకరణలు పదును దేరతై. ఈ పుస్తకంలో చేసిన కొన్ని సూత్రీకరణలకు అట్లాంటి లాభం జరిగింది. ఫలానివని ఇప్పుడు వేరు చెయ్యటం కష్టమైనా, క్త్వార్థక వాక్యాల్ని గురించి, నామ్నీకరణాల్ని గురించి చెప్పిన కొన్ని అంశాలు అట్లా బాగుపడ్డట్టు స్పష్టంగా గుర్తు. మిగతావాటికి కూడా అట్లాంటి లాభం జరిగితే అవికూడా నిస్సందేహంగా మెరుగయ్యేవే. కాని సమయాభావం అట్లా జరగనియ్యలేదు

విస్కాన్సిన్ యూనివర్సిటీ (మేడిసన్) లో ఒక పురస్కారం కిందట నేను భాషాశాస్త్రం చదువుకొనేటప్పుడు జెరల్డ్ కెలీ గారు నాకు ఉపాధ్యాయులు. తెలుగు భాషను ఆధునిక పద్ధతుల్లో పరిశీలిస్తూ ఆయన అమెరికన్ విద్యార్థులకు పాఠాలు చెపుతుండేవారు. ఉద్యోగరీత్యా నేనా క్లాసుల్లో కూర్చునే అవసరం కలిగింది. ఆ తరవాత అట్లాంటి క్లాసులు పూర్తిగా నాకే వదిలేసేవారు. అప్పుడు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానా లియ్యటంకోసమైన సొంతంగా ఆలోచించాల్సి వచ్చేది. ఈ విధంగా తెలుగుభాషా నిర్మాణాన్ని గురించి శాస్త్రీయంగా ఆలోచించటానికి నాకు దారిచూపి ప్రేరణ కలిగించిన ఉపాధ్యాయులు కెలీగారికి ఈ పుస్తకం అంకితమియ్యటం ఈ సందర్భంలో ఆయన్ను గుర్తుచేసుకోటం కోసమే గాని ఇది ఆయనకు అంకితమియ్యదగిన ఉద్గ్రంథం అనే ఉద్దేశంతో కాదు.

కెలీగారు 1963 నుంచి కోర్నెల్ యూనివర్సిటీలో భాషా శాస్త్రాచార్యులుగా ఉంటున్నారు.

చదువులోను, విద్యార్థి ఉద్యమాల్లోనూ చురుగ్గా పనిచేస్తూ కూడా, అంత చురుగ్గా ఈ పుస్తకానికి అచ్చుకోసం శుద్ధ ప్రతిని త్వర త్వరగా తయారు చేసి ఇచ్చిన ఆయిలోని (< అయినవోలు) ఉషాదేవికి చాలా రుణపడి ఉన్నాను. ఈ అమ్మాయి భాషా శాస్త్రం ఎమ్. ఏ. రెండో భాగం చదువుతున్నది. విషయం మీద అభిలాష, నామీద అభిమానం వల్ల ఈ పని శ్రమ అనుకోకుండా సంతోషంగా చేసింది.

**చే. రా.**

1975 మార్చి 8.

TO
PROFESSOR GERALD KELLEY

# విషయసూచిక

| | | | |
|---|---|---|---|
| 1. సామాన్య వాక్యాలు | ... | ... | 1 |
| 2. సంశ్లిష్ట వాక్యాలు | ... | ... | 26 |
| 3. అనుకృతి | ... | ... | 74 |
| 4. సంయుక్త వాక్యాలు | ... | ... | 98 |
| 5. తెలుగు వాక్యం : కొన్ని ముఖ్య లక్షణాలు | | ... | 105 |
| పరిభాష | ... | ... | 110 |

# తెలుగు వాక్యం

## 1. సామాన్య వాక్యాలు

వాక్యాలను ఏ భాషలోనైనా సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా విభజించవచ్చు. ఒక వాక్యంలో నిర్దిష్టస్థానంలో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంయుక్త వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకొక వాక్యాన్ని చేర్చినప్పుడు కొన్ని మార్పులు జరుగుతై. ఈ మార్పుల అనంతరమే సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు ప్రయోగార్హాలు అవుతై. ఈ దృష్టితో చూసినప్పుడు సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల్లో సామాన్య వాక్యలక్షణాలుండటం ఆశ్చర్యంకాదు. అందువల్ల తెలుగు వాక్య నిర్మాణాన్ని గురించి విపులంగా పరిశీలించటానికి సామాన్య వాక్యాన్ని గురించి ముందుగా తెలుసు కోటం అవసరం.

ఈ సామాన్య వాక్యాల్లోకూడా మళ్ళీ భేదాలున్నై. ఈ సామాన్య వాక్యాల్లో అతి సామాన్యమైన దాన్ని నిశ్చయార్థకం అంటారు. సామాన్యవాక్యాన్ని కొన్ని మార్పులు చెయ్యటంద్వారా (ఆగమాదేశ వ్యత్యయాది కార్యాలు) వ్యతిరేక, ప్రశ్న, కర్మణి-మొదలైన వాక్య భేదాల్ని సాధించొచ్చు. ఇవి కాక విధి, సంప్రార్థ నాద్యర్థక వాక్యాలుకూడా ఉన్నై. ఒక వాక్యానికి కిల, సంబుద్ధ్యాద్యర్థక ప్రత్యయాలు చేర్చటంవల్ల సామాన్యవాక్యంలో మరి కొన్ని అర్థభేదా లేర్పడతై.

తెలుగు వాక్యాల్లో చెప్పుకోదగిన ఇంకో భేదం ఉంది. కొన్ని వాక్యాలు క్రియారహితాలు, కొన్ని క్రియాసహితాలు.

**1.11 క్రియారహితవాక్యాలు :** క్రియారహితవాక్యాల్లో కొన్ని సహజంగా క్రియలేని వాక్యాలు, మరికొన్ని క్రియ లోపించిన వాక్యాలు ఉంటై. సహజంగా క్రియలేని వాక్యాల్లో రెండు నామబంధాలుంటై. అందులో ఒకటి ఉద్దేశ్యం, ఇంకోటి విధేయం. ఉద్దేశ్య విధేయనామాలు రెండూ ఏకవస్తు బోధకాలు. ఉద్దేశ్య నామాలు ఏ నామాలైనకావచ్చు. సర్వనామాలుకూడా కావచ్చు. విధేయనామాలు

సిద్ధనామాలు, విశేష్యాలనుంచి సాధించిన నామాలుఉంటై. విధేయనామాలు ఉద్దేశ్య నామాల్ని గురించి సాధారణంగా ఏదో ఒక విశేషాన్ని బోధిస్తై. ఉద్దేశ్య, విధేయ నామాలు రెండూ విశేషణపద పూర్వకమై ఉండవచ్చు. ఈ విశేషణాలలో వాటిల్లో భేదాల్నిబట్టి వాటిక్రమం ఉంటుంది. ఈ కింది వాక్యాలు క్రియారహిత వాక్యాలకు ఉదాహరణలు. ఇట్లాంటి వాటిని సమీకరణ వాక్యాలంటారు.

(1) a. ఆయన ప్రొఫెసరుగారు.
b. ఆమె మంచి టీచరు.

విధేయనామంలో విశేషణాలున్నప్పుడు విశేషణాల తర్వాత ఉన్న నామాల్ని లోపింపజేయవచ్చు. అయితే విధేయ పదబంధం విశేషణాల్ని యథాతథంగా సహించ లేదు గనుక లోపించిన నామానికి సరిపోయే లింగ, వచన బోధక ప్రత్యయాలు చేర్చాల్సి ఉంటుంది. ఈ ప్రత్యయాలను సర్వనామ రూపాలనుంచి నిష్పన్నమై నట్లుగా భావించవచ్చు. ఈ ప్రత్యయాలకు మూలం తదర్థబోధకమైన ప్రథమ పురుష సర్వనామాలు. ఇట్లాంటి ప్రత్యయసహితమైన విశేషణాలే సాధ్యనామాలు. ఈ కింది వాక్యాలలో ఈ ప్రక్రియ చూపబడుతున్నది.

(2) a. ఆ ప్రొఫెసరు మంచి ప్రొఫెసరు ⟶ ఆ ప్రొఫెసరు మంచివాడు.
b. ఆ టీచరు మంచి టీచరు ⟶ ఆ టీచరు మంచిది.
c. ఆ విద్యార్థులు మంచి విద్యార్థులు ⟶ ఆ విద్యార్థులు మంచివాళ్ళు.
d. ఆ కుర్చీ కొత్త కుర్చీ ⟶ ఆ కుర్చీ కొత్తది.
e. ఆ చీరలు పట్టు చీరలు ⟶ ఆ చీరలు పట్టువి.

ఈ పైన ఉపయోగించిన వాడు, వాళ్ళు అనే ప్రత్యయాలు సర్వనామాలతో సమానం. 'ది', 'వి' ప్రత్యయాలు అది, అవి అనే సర్వనామాలనుంచి మొదటి అచ్చులోపింపగా ఏర్పడిన రూపాలు.

ఈ క్రియారహితవాక్యాలు ప్రథమ, మధ్యమ పురుష బోధకాలుకూడా కావచ్చు. అయినపుడు విధేయనామం పురుషవచన, భేదాన్నిబట్టి తద్బోధకమైన ప్రత్యయాన్ని గ్రహిస్తుంది. సహజనామంతోబాటు సాధ్యనామంకూడా ఈ ప్రత్యయాలను గ్రహిస్తుంది. ఈ ప్రక్రియ కింది వాక్యాలలో ఉదాహృతం.

(3) a. నేను విద్యార్థిని.
b. మేము విద్యార్థులము.
c. నువ్వు విద్యార్థివి.
d. మీరు విద్యార్థులు.
e. మనము విద్యార్థులము.

పై వాక్యాలలో *ని*, *ము*, అనే ప్రత్యయాలు క్రమంగా ఉత్తమ పురుష, ఏక వచన బోధకాలు. **వు** మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం. మధ్యమపురుష బహు వచనానికి, ప్రథమపురుష బహువచనంకన్నా భిన్నమైనరూపంలేదు. ఈ ప్రత్య యాలు **ము**, *ను*, *వు*, **లు**. ఇవి ఇకారాంతనామాల తర్వాత *మి*, *ని*, *వి* గా మారతై. ఇది స్వర సమీకరణంవల్ల జరిగిన మార్పు.

**1.12** ప్రాధాన్య వివక్షననుసరించి పై వాక్యాలలో ఉద్దేశ్య, విధేయ వ్యత్యాసం జరగవచ్చు. ఆ వ్యత్యాసం కింది ఉదాహరణలలో చూడవచ్చు.

(4) a. నువ్వు గాడిదవు ⟶ గాడిదవు నువ్వు.
b. నేను సుబ్బారావును ⟶ సుబ్బారావును నేను.
c. మేము తెలుగు వాళ్ళం ⟶ తెలుగు వాళ్ళం మేము.

పదక్రమంలో ఈ మార్పు ప్రాధాన్య వివక్షకోసంవచ్చింది. ఈ మార్పువల్ల ఆఖ్యాతస్థానానికి (Predicate-position) చేరిన నామం అధిక ప్రాధాన్యాన్ని వహి స్తుంది. ప్రాధాన్య వివక్షకు పదక్రమవ్యత్యాసం తెలుగుభాష అనుసరించే మార్గాలలో ఒకటి. ఇంకొకమార్గం క్రమవ్యత్యాసం లేకుండా ప్రాధాన్యాన్ని చెప్పదలచుకొన్న పదాన్ని ఉచ్చారణలో ఊనికతో నొక్కి పలకటం. ఇదికాక ప్రశ్నార్థకాది రూపా లను ఉద్దిష్ట నామానికి చేర్చటం ఇంకో పద్ధతి. ఈ పద్ధతి ముందుముందు వివరించ బడుతుంది. ఈ క్రియారహిత వాక్యాలలో ఉద్దేశ్య, విధేయనామాలు ఏకవస్తుబోధకా లైనా ఏకరూపకాలుకావు. సాధారణంగా రెండూ సర్వనామాలుగా ఉండవు. కాని కొన్ని అర్థవిశేషాలలో ఇట్లాంటివి కన్పిస్తాయి. అట్లాంటప్పుడు ఏవార్థకమైన 'ఏ' ప్రత్యయం వీటిల్లో ఒక నామానికి చేరుతుంది. ఈ కింది వాక్యాలు అందుకు ఉదా హరణాలు.

(5) a. వాడే వీడు.
b. అతనే ఇతను.

c. గాడిద గాడిదే, గుర్రం గుర్రమే.

d నేను నేనే, నువ్వు నువ్వే.

**1.13**: ఈ క్రియారహిత వాక్యాలలో విధేయాలుగా వచ్చిన కొన్ని విశేషణాలు నామాలుగా మారకుండానే ప్రయుక్త మయ్యేవికూడా ఉన్నై. అట్లాంటి విశేషణాలను ఇంతకు ముందు ఉదాహరించిన వాటికన్నా భిన్నంగా గ్రహించాల్సి ఉంటుంది. అటువంటి వాటిల్లో కొన్ని ఈ కింది వాక్యలలో గుర్తించవచ్చు.

(6) a. ఆ కొండ ఎత్తు.

b. ఈ బావి లోతు.

c. ఆ అమ్మాయి పొడుగు.

d ఈ అబ్బాయి పొట్టి.

e. ఈ గది వెడల్పు.

ఈ పై వాక్యాలలో విశేషణాలు నిజానికి విశేషణాలయినా, వీటికి విశేష్యాలుగా ప్రయోగాలు కన్పిస్తున్నై ఉదాహరణకు,

(7) ఈ బావి లోతు — 6 అడుగులు.

ఆ కొండ ఎత్తు — 2000 అడుగులు.

ఆ అమ్మాయి పొడుగు — $5\frac{1}{2}$ అడుగులు.

ఈ గది వెడల్పు — 20 అడుగులు.

కాని పొట్టి అనే విశేషణాన్ని ఈ పై విధంగా ఉపయోగించడానికి వీలు లేదు. ఈ పై విశేషణాలు పదార్థం లేక ద్రవ్యం అవకాశంలో ఆక్రమించే స్థానాన్ని సూచించేవిగా కన్పిస్తున్నాయి. ఈ లక్షణానికి ప్రత్యయరహితంగా విధేయస్థానంలో ఉపయోగించటానికి ఏమైనా సంబంధం ఉందేమో చెప్పటం కష్టం. ఈ క్రియా రహిత వాక్యాలలో తులనాత్మక వాక్యాలు ఇంకోరకం. ఈ వాక్యాలలో 'తో', 'కంటె' వంటి ప్రత్యయాలు కూడా చేరతై.

(8) a. అతను నాకంటే పెద్ద.

b. అతని కన్నా నేను చిన్న

c. అతను నాతో సమానం.

ఇట్లాంటి వాక్యాలలో విధేయనామం మానార్థకంగా ఉంటుంది. (6) లో ఉదాహరించిన *పొడుగు, పొట్టి, లోతు, ఎత్తు* వంటి వన్నీ ఈ రకపు వాక్యాలలో ప్రయోగించవచ్చు.

**1.14 :** ఇవి కాక మరికొన్ని విభక్తి బంధాలు కూడా క్రియా రహిత వాక్యాలలో కన్పిస్తున్నై. ఉదాహరణకు ఈ కింది వాటిని పరిశీలించండి.

(9) a. హైదరాబాదు నాకు కొత్త.
b. అతను ఈ ఊరికి పెద్ద.
c. మాతమ్ముడు మాలో పొడుగు.

ఈ పై వాక్యాలలో విధేయస్థానంలో ఉన్నవి విశేషణాలు. ఇవి విశేష్యాలుగా ప్రయుక్తమైనట్లు కన్పిస్తున్నై. అంటే కొన్ని పదాలను విశేషణ విశేష్యోభయ పదాలుగా గ్రహించాలేమో !

కొన్ని క్రియారహిత వాక్యాలు సంబంధ బోధకాలుగా కన్పిస్తై. వీటిల్లో సంబంధాన్ని సూచించే కు-విభక్తి బంధం కూడా ఉంటుంది.

(10) a. అతను నాకు తమ్ముడు.
b. ఇతను నాకు స్నేహితుడు.
c. ఈమె నాకు స్నేహితురాలు.

**1.15 :** ఇంతవరకు ఉదాహరించిన వాక్యాలలో క్రియ లేకపోవటమే కాకుండా కాలబోధకత లేకపోవడం కూడా గమనించవచ్చు. కాలాన్ని బోధించాల్సి వచ్చినప్పుడు ఈ వాక్యాలకు *అవు* అనే క్రియను అనుబంధించాలి. అప్పుడు ఇతర వాక్యాలకులాగే ఈ వాక్యాలకు కూడా భిన్నకాలాలను బోధించే క్రియారూపాలుంటై అట్లాంటి వాటిలో కొన్ని ఈ కింద ఉదాహరించిన వాక్యాలు.

(11) a. అతను మంత్రి.
b. అతను మంత్రి అయ్యాడు.
c. అతను మంత్రి అవుతాడు.

ఇట్లాంటి వాక్యాలకు వ్యతిరేకార్థంలో కాలబోధకత లేనపుడు *కాదు* అనే వ్యతిరేకరూపం చేరుతుంది. ఈ రూపాన్ని అన్ని పురుషలలోను ప్రయోగించవచ్చు.

అట్లా కాకుండా లింగ, పురుష, భేదాన్ని వివక్షించవచ్చు. అప్పుడా భేదాల్నిబట్టి **కాను, కాము, కావు, కాడు, కాదు, కారు** అనే రూపాలు చేరతై. ఈ రూపాలు భవిష్యదర్థంలో నిత్యంగా చేరతై. అందువల్ల ఇట్లా చేరిన రూపాలుగల వాక్యాలు భిన్నకాలార్థ బోధక సమర్థాలవుతాయి. ఉదాహరణకు - *అతను మంత్రి కాడు* అనే వాక్యానికి *అతను ఇప్పుడు మంత్రి కాదు, అతను ఇక మంత్రి కాడు* అన్న రెండర్థాలు ఉన్నై. ఈ రకపు వాక్యాలకు అరుదుగా విధి, సంప్రార్థనాది రూపాలు కూడా ఉంటై. అప్పుడు కా, **కాండి, (కండి)** అనే ఏకవచన, బహువచన రూపాలు వ్యతిరేక విధిలో ఉభయ వచనాలలోను **కావద్దు** అనే రూపం చేరతై.

ఉదాహరణ :

(12) a. నువ్వు కలెక్టరువికా.
b మీరు మంచి పౌరులు కండి.
c. మీరు ప్రజా వ్యతిరేకులు కావద్దు.

కొన్ని మండలాలలో కా అనే రూపానికి బదులు, కాలబోధక, వ్యతిరేక, అవ్యతిరేక రూపాలు రెండిట్లోను **అవు** అనే రూపం కన్పిస్తుంది.

**1.16 :** ఈ క్రియారహిత వాక్యాలకు అంతంలో ఆ అనే దీర్ఘాచ్చును చేరిస్తే ప్రశ్నార్థక వాక్యాలు ఏర్పడతై. వాక్యార్థాన్ని రకరకాలుగా మార్చే కిలార్థ కాది రూపాలు గూడా ఇట్లాంటి వాక్యాల చివర చేర్చొచ్చు. వ్యతిరేకార్థకం గాని, ప్రశార్థకం గాని, కిలార్థకాదులు గాని వక్తృవివక్షనుబట్టి ఉద్దేశ్య నామానికి కూడా చేర్చవచ్చు. ఇట్లా చేర్చటం వలన ఉద్దేశ్య నామాలకి ప్రాధాన్యం ఏర్పడుతుంది. అంటే ప్రాధాన్య వివక్షకు పదక్రమ వ్యత్యాసమేకాక ఈ పేర్కొన్న వ్యతిరేక, ప్రశ్న, కిలార్థకాలను చేర్చటం కూడా ఒక పద్ధతి అన్నమాట. పదక్రమ వ్యత్యాసంలో ఉద్దేశ్య నామాన్ని ఆఖ్యాత స్థానానికి జరపటం వలన ఈ ప్రాధాన్యం ఏర్పడుతున్నది. ఆఖ్యాత స్థానంలో ఉన్న పదం ఆస్థానాన్నిబట్టి సహజంగానే ప్రధానమైనదని దీని అర్థం.

**1.17 :** క్రియాలోపం వల్లగూడా కొన్ని క్రియారహిత వాక్యాలు ఏర్పడ తాయని పూర్వం సూచించబడింది. వీటిల్లో కొన్ని *ఉండు* అనే క్రియ లోపించటం వల్ల ఏర్పడినవి. ఈ క్రింది వాక్యసమూహం ఈ రకపు వాక్యాలకు ఉదాహరణం.

**1.20 : క్రియాసహిత వాక్యాలు :** క్రియాసహిత సామాన్య వాక్యాలలో క్రియ వాక్యాంతంలో వస్తుంది. క్రియలలో చాలారకాలు విభాగాలు చేయవచ్చు. అందులో ఒక విభాగం సకర్మక అకర్మక క్రియాభేదం. సకర్మక క్రియ కర్మ పదాపేక్షికం. అకర్మక క్రియ కర్మపద నిరపేక్షకం. *ఉండు*, *పోవు*, *వచ్చు* వంటి క్రియలు అకర్మకాలు. *కొను*, *తిను*, *చేయు* వంటివి సకర్మకాలు. సకర్మకాలలో కొన్ని ద్వికర్మకాలు. అంటే ఈ క్రియలకు రెండు కర్మపదాలుంటాయి. రెండు కర్మలున్నప్పుడు ఒకదాన్ని ముఖ్యకర్మ అని, రెండవదాన్ని అముఖ్య కర్మ అని అంటారు. ఇవికాక క్రియలను వాటి అర్థాలను బట్టి స్థితిబోధకాలని, గతిబోధకాలని, సంఘటన బోధకాలని, వచ్యర్థకాలని చాలా రకాలుగా విభాగాలు చేయవచ్చు. చేయవచ్చునంటే వాక్యనిర్మాణ విధానంలో ఈ విభాగానికి ప్రమేయముంటుందని అర్థం. తెలుగు క్రియలకు ఇట్లాంటి విభాగం స్పష్టగా జరగలేదు. విశేషమైన పరిశోధన జరిగితేగాని ఇట్లాంటి విభాగం సాధ్యంకాదు. జరిగినంత మటుకు కొంతలో కొంత ఈ రచనలో అక్కడక్కడ ప్రసక్తమవుతుంది.

**1.21 :** వాక్యంలో ప్రధాన విభాగం నామబంధం, ఆఖ్యాత బంధం. ఆఖ్యాత బంధంకూడా నామబంధమయితే ఇంతకుపూర్వం చర్చించిన క్రియారహిత వాక్యాలు నిష్పన్నమవుతై. ఆఖ్యాతబంధం క్రియాసహితమైతే అకర్మక, సకర్మక భేదం ప్రవర్తిత మవుతుంది. సకర్మక క్రియాబంధంలో ఇంకో నామబంధం ఉండొచ్చు. క్రియాబంధంలో ఉన్న నామబంధం ఆ క్రియకు కర్మ అవుతుంది. క్రియాబంధంలో భాగం కాని నామబంధం కర్తృపద మవుతుంది. దీన్ని బట్టి వాక్యంలో కర్తృ, కర్మ పదాలుగా రాగలిగిన సామర్థ్యం నామ పదానికున్నట్లు తెలుస్తున్నది.

వాక్యంలో దేశకాల బోధకాలైన పదబంధాలుకూడా ఉంటై. ఇవికాక కొన్ని రకాల క్రియావిశేషణాలు, కారకబంధాలు కూడా ఉండవచ్చు. కర్తృకారకం కాక మిగతా కారకాల్ని సూచించే పదబంధాలు ఆఖ్యాత బంధంలో భాగాలుగా ఇక్కడ పరిగణించబడుతున్నై. వీటిల్లో కర్మకారకాన్ని బోధించే పదం కర్మపదం. మిగతావి కరణ, అధికరణాది కారకాలను బోధించే పదబంధాలు. పైన పేర్కొన్న పదాలన్ని ఒకే సామాన్య వాక్యంలో రావడానికి వీలుంది. ఇట్లావచ్చినప్పుడు ఈ పదాలస్థానం క్రమ నిరపేక్షకం కాదు. కర్తృపదం వాక్యాదిని, క్రియాపదం

వాక్యాంతంలో వస్తుందని పూర్వమే తెలుసుకున్నాము. కర్మపదం క్రియకు పూర్వం ఉంటుంది. అముఖ్య కర్మపదం ముఖ్యకర్మకంటే ముందు వస్తుంది. దానికంటే ముందు స్థలబోధక పదం, దానికంటే ముందు కాలబోధకపదం వస్తై. క్రియావిశేషణం క్రియకంటే ముందు, కర్మపదం తర్వాత వస్తుంది. ఈ పదాల వరస పైన చెప్పిన పద్ధతిలోవస్తే ఇందులో ఏ పదానికీ ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉండదు. ప్రత్యేకమైన ప్రాధాన్యాన్ని చెప్పవలసి వచ్చినపుడు ఆ పదాన్ని క్రియాపదానికి సన్నిహితంగా జరపటం ఒక పద్ధతి. ఉదాహరణకు ఈ క్రింది వాక్యాలను పరిశీలిస్తే ఈ ప్రాధాన్యం తెలుస్తుంది.

(17) a. నేను రేపు మద్రాసులో అరవ సినిమాకి వెళతాను.
b. నేను మద్రాసులో అరవ సినిమాకి రేపు వెళతాను.
c. నేను రేపు అరవసినిమాకి మద్రాసులో వెళతాను.

పై వాక్యాల్ని పరిశీలిస్తే మొదటిది సాధారణంగా ఉండే పదక్రమం అని, దానికి వ్యతిక్రమం జరిగినపుడు క్రియాపదానికి సన్నిహితంగా ఉన్నపదం కొంత ఎక్కువ ప్రాధాన్యం వహిస్తుందని తెలుస్తుంది. క్రియాపదం సాన్నిహిత్యం ఈ ప్రాధాన్యానికి కారణం. ఒక్కొసారి కర్తృపదం కూడా క్రియాపద సన్నిహిత మైనపుడు అధిక ప్రాధాన్యాన్ని వహిస్తుంది.

(18) a. కిట్టు పకోడీలు తిన్నాడు.
b. పకోడీలు కిట్టు తిన్నాడు.

ఈ రెండు వాక్యాలలో మొదటిది సాధారణ పదక్రమం. దీనికి వ్యతిక్రమం జరిగినప్పుడు కర్తృపదానికి ప్రత్యేక ప్రాధాన్యం వస్తున్నది. మొదటి వాక్యంలో ఒక మనిషి ఒక వ్యాపారం చేసినట్లు మాత్రమే సూచితమయింది. రెండో వాక్యంలో వ్యాపారాశ్రయమైన నామం నిర్దిష్టమైంది. అంటే రెండో వాక్యానికి 'పకోడీలు తిన్నది కిట్టు, మరొకరు కాదు' అన్న అర్థం ఉంది. మొదటి వాక్యంలో అట్లాంటి అర్థం లేదు. మొదటి వాక్యంలో 'పకోడీలు ఇంకొకరు కూడా తిని ఉండవచ్చు' అన్న భావం ఉంది. దీన్ని ఉద్దేశ్యవిధేయ పద్ధతిలోకూడా చెప్పవచ్చు. మొదటి వాక్యంలో కిట్టు ఉద్దేశ్యం. రెండవ వాక్యంలో పకోడీలు ఉద్దేశం. రెండు వాక్యాలలోను కర్త ఒకటే. అది కిట్టు అనే నామపదం. దీన్నిబట్టి తెలుగులో పదక్రమ వ్యత్యయం వల్ల ఉద్దేశ్య విధేయాలు మారతాయని, క్రియాపదానికి సన్నిహితంగా జరిగిన నామానికి

ప్రాధాన్యం ఉంటుందని తెలుసుకోవచ్చు. కర్తృ, కర్మపదాలు నామబంధాలే అవుతయ్యని ఇంతకు ముందే చెప్పబడింది. ఉద్దేశ్య విధేయాలకు ఈ రకమైన నిబంధన లేదు. ఈ కింది వాక్యాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది.

(19) a. వంట ఇంట్లో బొద్దింకలున్నై.

b. బొద్దింకలు వంటఇంట్లో ఉన్నాయి

పై వాక్యాలలో ఒక దాంట్లో *వంట ఇంట్లో* అనేది ఉద్దేశ్యం. ఇంకొక దాంట్లో *బొద్దింకలు* అనేది ఉద్దేశ్యం.

ప్రాచీనుల మతం ప్రకారం వక్తకు, శ్రోతకు తెలిసింది ఉద్దేశ్యం. వక్తకు మాత్రమే తెలిసింది విధేయం. ఆధునిక పద్ధతి ఇందుకు విరుద్ధమైనది కాదు. తెలుగు వాక్యాలలో మొదట ఉద్దేశ్యం వస్తుంది. తర్వాత విధేయం వస్తుంది. కొన్ని వాక్యాలలో కర్త, ఉద్దేశ్యం ఒకటే కావచ్చు. మరికొన్ని వాక్యాలలో దీనికి భిన్నంగా వ్యత్యాసం జరగవచ్చు.

**1.22 :** కొన్ని వాక్యాలకు కర్తృపద నిర్ణయం కష్టం. కాని ఉద్దేశ్యపదం సులభంగా గ్రహించవచ్చు. దీనికి కారణం ఉద్దేశ్యపదం సాధారణంగా పదాదిన వస్తుంది. ఈ కింది వాక్యాలలో కర్తృపదాన్ని నిర్ణయించలేము. మొదటిపదం ఉద్దేశ్యంగా గుర్తించటం సులభమే.

(20) a. నాకు చలిగా ఉంది.

b. ఆమెకు భయంగా ఉంది.

c. అతనికి కష్టంగా ఉంది.

d. మాకు సంతోషంగా ఉంది.

ఈ పై వాక్యాలలో మొదటిపదం ఉద్దేశ్యం. కాని కర్తృపదం ఫలానిదని చెప్పటం కష్టం. వ్యక్త నిర్మాణంలో కర్తలేదు. గుప్తనిర్మాణంలో కర్తను సూచించాల్సిన అవసరం ఉన్నట్లు కనిపించదు. ఇట్లాంటి వాక్యాలలో ఉద్దేశ్యాన్ని అనుభోక్త (experiencer) గా భావించవచ్చు. అనుభవం (experience) దేహ, మనఃస్థితి బోధకం కావటం విశేషం. మరికొన్ని వాక్యాలలో వికల్ప వాక్య పద్ధతిని బట్టి కర్తృ పదాన్ని గుర్తించవచ్చు.

(21) a. నాకు ఆకలిగా ఉంది.
b. నాకు ఆకలి అవుతున్నది.
c. నాకు దప్పికగా ఉంది.
d. నాకు దప్పిక అవుతున్నది.
e. నాకు తలనొప్పిగా ఉంది.
f. నాకు తలనొప్పి వేస్తున్నది.

ఈ పై వాక్య సమూహంలో సరివాక్యాలలో ఉద్దేశ్యపదానికి, క్రియాపదానికి మధ్యనున్న పదాన్ని కర్తృపదంగా గుర్తించవచ్చు. అయితే ఇది వ్యక్తనిర్మాణపు కర్త (surface subject). గుప్త నిర్మాణం (deep-structure) లో కర్తను గుర్తించవలసిన అవసరం ఉందో లేదో చెప్పటం వెంటనే సాధ్యంకాదు. ఒకవేళ అట్లా చెప్పితే అనుభోక్తనే కర్తగా చెప్పాల్సి రావచ్చు. ఈ పై వాక్యాలలోకూడా అనుభవ బోధక నామాలు దేహ, మనఃస్థితి బోధకాలే కావటం విశేషం. ఈ రకమైన వాక్యాలు ఇంకా పరిశీలనకు లొంగలేదు.

**1.23** ఆఖ్యాతబంధంలో ప్రధానమైనది క్రియా పదం. ఈ క్రియాపదం ద్వారానే కాలబోధకత వ్యక్తమవుతుంది. కాలబోధను స్థూలంగా భూత, భవిష్యత్, వర్తమానాలుగా విభజించవచ్చు. ఆయా కాలాలలో కాలబోధను సూచించే ప్రత్యయాలు చేరతై. కాలబోధక ప్రత్యయాల తర్వాత కర్తృపదంలోఉన్న లింగ పురుష వచన భేదాన్ననుసరించి క్రియావిభక్తులు చేరతై. నేటి తెలుగులో భవిషద్బోధ, తద్ధర్మబోధ ఒకే క్రియద్వారా జరుగుతుంది ''అతను మాంసం తింటాడు'' అనే వాక్యంలో *తింటాడు* అనే క్రియకు వేరే పదసహాయం లేనప్పుడు 'అతను ఎప్పుడూ మాంసాహారే' అనిగాని, 'అతను ఇక ముందు మాంసం తింటాడు'-అనిగాని అర్థాలు కావచ్చు. తెలుగులో వర్తమానార్థక క్రియ శత్రర్థక బోధకంకూడా అవుతుంది. శత్రర్థకబోధ ఇతరకాలాలలో చెప్పాల్సి వచ్చినప్పుడు దానికి సంబంధించిన కాల బోధ ఇతర పదాలద్వారా చెప్పాల్సి ఉంటుంది. ఏ పదసహాయమూ లేనపుడు ఈ క్రియ వర్తమానార్థకమే అవుతుంది. *అతను వస్తున్నాడు* అనే వాక్యానికి ఇతర పదాల సహాయమూ, వాక్య ప్రయోగ సందర్భ సహాయము లేనప్పుడు *అతను ఇప్పుడు వస్తున్నాడు* అనే అర్థం చెప్పాల్సి ఉంటుంది. ఇతర కాలాల బోధలో ఆ కాలాల్ని సూచించే *నిన్న*, *మొన్న*, *రేపు*, *ఎల్లుండి* వంటి పదాల అవసరం

ఉంటుంది. ఈ కాలాలకు వ్యతిరేక బోధకూడా ఉంటుంది. భూతకాల వ్యతిరేకబోధ అన్నంత క్రియకు అన్ని పురుషలలోను లేదు అనే రూపం చేర్చటంవల్ల ఏర్పడు తుంది. వర్తమాన వ్యతిరేకక్రియ భావార్థకరూపానికి లేదు అనేరూపం చేర్చటంవల్ల ఏర్పడుతుంది, భవిష్యద్ వ్యతిరేకక్రియ అన్నంతరూపానికి క్రియావిభక్తులు చేర్చటంవల్ల ఏర్పడుతుంది. వీటి నిర్మాణ విశేషాలు పద నిర్మాణచర్చలో భాగాలు కావటంవల్ల ఇక్కడ విశేషించి చెప్పలేదు.

**1.241** ప్రశ్నార్థక వాక్యాలు రెండురకాలు. విశేష విషయాపేక్షకాలు, విశేషవిషయ నిరపేక్షకాలు. క్రియారహితవాక్యాల గురించి చెప్పినవుడు పేర్కొన్న ప్రశ్నలు విశేషవిషయ నిరపేక్షకాలు. అవి వాక్యాంతంలో ఆ అనే రూపాన్ని చేర్చటంవల్ల ఏర్పడతాయి. విశేషవిషయాపేక్షకాలు ప్రత్యేకపదార్థకపదంద్వారా వ్యక్తమవుతాయి. ఈ రకపు ప్రశ్నలు ఎందుకు, ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా, ఎవరు, ఏమిటి మొదలైన రూపాలవల్ల ఏర్పడతై. ఈ పదాలు క్రియకు సన్నిహితంగా పూర్వస్థానంలో వస్తై ఈ కింది వాక్యంలో ఈ ప్రశ్నాభేదాలు ఉదాహరించబడుతున్నై.

(22) a. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉందా ?
b. భారతదేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చింది ?

విషయాపేక్షక ప్రశ్నలలో ఏ విషయాన్ని ప్రశ్నించినా ఆ ప్రశ్నపదం క్రియకు సన్నిహితంగా చేరుతుంది. అంటే ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఎవరు, మొదలైన ప్రశ్నపదాలు ఈ రకపు ప్రశ్నలలో క్రియాపదానికి పూర్వం సన్నిహిత స్థానంలో ఉంటై. వాక్యం మొత్తాన్ని ప్రశ్నించే ఆ అనే రూపం వాక్యాంతంలో చేరుతుంది. ఆ అనే రూపం వాక్యంలో ఇతర పదాలకుకూడా చేరవచ్చు. అట్లా చేరినపుడు వాక్యంలో క్రియ నామ్నీకృతమవుతుంది. ఆ క్రియకు పురుషబోధతో నిమిత్తం లేకుండా 'ది' అనే ప్రత్యయం చేరుతుంది. ఈ ప్రక్రియాగతిని క్రింది వాక్యాలలో చూడవచ్చు

(23) అతను ఊరికి వెళ్ళాడు ⟶ a. అతనా ఊరికి వెళ్ళింది.
b. అతను ఊరికా వెళ్ళింది.

**1.242** విధ్యర్థబోధక క్రియలలో కర్త ఎప్పుడు మధ్యమ పురుష సర్వ

నామమే. ఈ సర్వనామం ఏకవచనమైనపుడు క్రియ ధాతురూపంలోనే ఉంటుంది. ఈ ధాతువులకు ఆదేశరూపాలుంటే ఆ రూపాలే ప్రయుక్తమవుతై. *వచ్చుకు-రా, తెచ్చుకు-తే, ఇచ్చుకు-ఇయ్, చచ్చుకు-చావు, లేచుకు-లే, పోవుకు-పో-* ఆదేశ రూపాలు. విధ్యర్థక క్రియకు బహువచనంలో *అండి* అనే ప్రత్యయం చేరుతుంది. తెలంగాణా మాండలికాలలో *(ని, ం(డి, ండి* అనే ప్రత్యయాలుచేరతై. *చెప్పుం(డి, చెప్పు(ని*, రాం(డి, రారి అనేరూపాలు తెలంగాణా వ్యవహారంలోఉన్నై. వ్యతిరేక విధిలో ధాతువుకు అదంతరూపం మీద *వద్దు* అనే ప్రత్యయం ఉభయపురుషల లోను చేరటం సాధారణం. అయితే దీనికి బదులుగా భిన్న ప్రత్యయాలతో భిన్న రూపాలు కనిపిస్తున్నై. చెప్పకు, చెప్పగాకు, చెప్పబాకు, చెప్పబోకు, చెప్పమాకు, చెప్పమోకు, చెప్పవాకు అనే రూపాలు ఏకవచనంలో విన్పిస్తున్నాయి వీటిమీద *అండి* చేరిస్తే బహువచనరూపాలు ఏర్పడతై. అన్ని క్రియలకు విధిరూపాలుండవు. ఇది ఆ క్రియల అర్థాన్నిబట్టి నిర్ణీతమవుతున్నట్లు కన్పిస్తున్నది. ఎరుగు, కొను ప్రయోగంలేని తెలుసు, దోకు ఎంటి కొన్ని క్రియలకు వ్యవహారంలో విధి ప్రయో గాలు లేవు.

**1.243** : క్రియలలో ఉన్న అకర్మక, సకర్మక ప్రేరణ భేదాలు వాక్య నిర్మాణంలో వ్యక్తమవుతై. అకర్మక వాక్యంలో ఉన్న కర్తృపదం, సకర్మక వాక్యంలో కర్మ అవుతుంది. కొన్ని క్రియలు సహజంగా సకర్మకాలు, కొన్ని క్రియలు ప్రత్యయాదులచేత సకర్మకాలుగా మారతై. అట్లా మారిన క్రియలకు పైన చెప్పిన సూత్రం వర్తిస్తుంది. సకర్మక క్రియలుకూడా ప్రత్యయాలవల్ల ప్రేరణ క్రియలుగా మారతై. సకర్మక వాక్యంలోఉన్న కర్తృపదానికి ప్రేరణలో చేత అనే వర్ణకం చేరుతుంది. ఈ సంబంధాన్ని కింది వాక్యాలలో చూడవచ్చు.

(24) a. *కార్మిక నాయకుడు చనిపోయాడు.*

b. *గూండాలు కార్మిక నాయకుణ్ణి చంపారు.*

c. *యజమాని గూండాలచేత కార్మికనాయకుణ్ణి చంపించాడు.*

పై వాక్యాలలో మూడవదాంట్లో *యజమాని* ప్రేరకుడు. గూండాలు కర్త. *కార్మికనాయకుడు* కర్మ. *కార్మికనాయకుడు* అకర్మక వాక్యంలో కర్త, సకర్మ వాక్యంలో కర్మ. అయితే ఈ విభజన చాలా స్థూలదృష్టితో చేసినది. ఒక వాక్యంలో ఒకే నామపదం క్రియతో అన్వయించినపుడు దాన్ని స్థూలదృష్టితో కర్త అంటు

న్నాము. లోతుగా పరిశీలిస్తే ఇంతకన్నా విశేషమైన సంబంధాలను గుర్తించాల్సి ఉంటుంది. నిజానికి పై మూడు వాక్యాలలోను కార్మిక నాయకుడు అనే పదానికి క్రియతో ఒకే సంబంధముంది. చనిపోవు అనే వ్యాపారానికి అనుభోక్త మూడు వాక్యాలలోను కార్మిక నాయకుడే. వాక్యాలలో క్రియావ్యాపారానికి అందులో నామ పదానికి ఉన్న పాత్రనుబట్టి ఈ సంబంధాన్ని నిర్ణయించాలి. ఉదాహరణకి ఈ కింది వాక్యాలని పరిశీలించండి.

(25) a. అన్నం ఉడికింది.
b. వంటమనిషి అన్నం వండింది.
c. యజమానురాలు వంటమనిషిచేత అన్నం వండించింది.

ఈ వాక్య సమూహంలో మూడిట్లోను అన్నం అనేదాని పాత్ర ఒకటే. ఇది వ్యాపార ఫలితంగా వచ్చే పదార్థం. మొదటి వాక్యంలో అన్నం కర్త కాదు, స్థూలదృష్టితో మాత్రమే కర్త అవుతుంది. ఇట్లాగే ఈ కింది వాక్యాలను కూడా పరిశీలించండి.

(26) a. తలుపు తీసి ఉంది.
b. మా అబ్బాయి తలుపు తీశాడు.
c. మా అబ్బాయిచేత తలుపు తీయించాను.

పై వాక్యాలలో తలుపు కర్త కాదు. క్రియ తలుపు ఉన్న స్థితిని సూచిస్తుంది. వాక్య నిర్మాణంలో వివిధ రీతుల్ని పరిశీలించాలంటే క్రియా వ్యాపారాలతో, లేక స్థితులతో నామపదాలకున్న అంతర్గత సంబంధాలను సమగ్రంగా తెలుసుకోవాలి.

**1.244 :** కొన్ని వాక్యాలలో ప్రేరణార్థక క్రియ వాక్యభేదాన్నిబట్టి ఒకే నామంతో భిన్న సంబంధాలను కలిగి ఉండవచ్చు. ఉదాహరణకి ఈ కింది వాక్యాలు చూడండి.

(27) a. సుబ్బారావు రామారావుని చదివిస్తున్నాడు.
b. సుబ్బారావు రామారావుచేత చదివిస్తున్నాడు.

వీటిల్లో మొదటి వాక్యానికి రెండర్థాలున్నాయి. ఒక అర్థంలో రామారావు చదువుకి అవసరమైన డబ్బు పెట్టుబడి సుబ్బారావు పెడుతున్నాడు అని. రెండో

అర్థం రెండో వాక్యంలో సూచించిన దానితో సమానం. అంటే రామారావు చదవటానికి సుబ్బారావు పక్కనే ఉండి ప్రేరేపిస్తున్నాడు అని అర్థం. బహుశా ఈ అర్థభేదం చదువు అనే క్రియలోనే ఉండవచ్చు. ఒక అర్థంలో చదువుకు ఒక కాల పరిమితి ఉన్న కోర్సు అని కావచ్చు. రెండో అర్థంలో 'ఒక పుస్తకం' అని అర్థం కావచ్చు. అట్లాగే ఇంకో రకమైన అర్థభేదం ఈ కింది వాక్యాలలో చూడవచ్చు.

(28) a. మా స్నేహితుడు నన్ను కాలేజీదాకా నడిపించాడు.
b. మా స్నేహితుడు నా చేత కాలేజీదాకా నడిపించాడు.

ఈ పై వాక్యాలలో మొదటి దానికి రెండర్థాలున్నాయి. ఒకటి స్నేహితుడు నేను నడవడానికి భౌతికంగా ఆసరాగా ఉన్నాడని. రెండు, నేను నడవడానికి అతడు ప్రేరకుడుగా ఉన్నాడని. రెండో వాక్యానికి ఈ రెండో అర్థమే ప్రసిద్ధం. పై వాక్యాలనుబట్టి వాక్యాలలో ప్రేరక సంబంధాలు క్రియావ్యాపారానికి నామ పదాలకి ఉన్న సంబంధాన్నిబట్టి నిర్ణయ మవుతయ్యని తెలుస్తుంది.

**1.245 :** తెలుగులో కర్మణి వాక్యాలకు వ్యవహారంలో ప్రయోగం తక్కువ. కర్మణి వాక్యాలలో కర్తరి వాక్యాలలోని కర్తృ, కర్మపదాలు వ్యత్యస్త మవుతై. అట్లా వ్యత్యస్తమైనపుడు కర్తకు చేత వర్ణకం వస్తుంది. కర్తరి వాక్యంలో కర్మపదానికి, కర్మణి వాక్యంలో ప్రాధాన్యం వస్తుంది. ఈ కింది వాక్యాలలో ఇది సూచించబడింది.

(29) a. కెలీగారు తెలుగు వ్యాకరణం రాశారు.
b. తెలుగు వ్యాకరణం కెలీగారిచేత రాయబడింది.

రెండవ వాక్యంలో ప్రధానమైంది తెలుగు వ్యాకరణం. తెలుగులో కర్మణి వాక్యాలు రచనా భాషలోను, కొన్ని రకాల ఉపన్యాసాలలోను, ఉపన్యాసాలవంటి కొన్ని సంభాషణలలోను మాత్రమే కనిపిస్తున్నాయి, కర్త ప్రాధాన్యం తగ్గించటమే కర్మణి వాక్యాల ప్రయోజనం. వ్యవహారంలో కర్తృ పదాన్ని యథేచ్ఛగా లోపింప జేయటానికి అవకాశం ఉంది, కనుక తెలుగు వ్యవహారంలో కర్మణి వాక్యాలకంత ప్రాచుర్యం లేదు. అయితే తెలుగు క్రియలో కర్తను బోధించే ప్రత్యయం ఉంటుంది. అందువల్ల రచనా భాషలో ఈ అవసరం కొంత కన్పిస్తుంది.

**1.246 :** తెలుగులో ఆత్మార్థక వాక్యాలు ధాతువులకు *కొను* అనే ధాతువు చేర్చటం వలన ఏర్పడుతుంది. ఈ *కొను* కు మిగతా క్రియల్లాగే కాల బోధక ప్రత్యయాలు, కర్తృబోధక క్రియా విభక్తులు చేరతై. *కొను* ను స్థూల దృష్టితో ఆత్మార్థబోధకమన్నా, మరికొన్ని అర్థాలు కూడా దీని ద్వారా వ్యక్తమవుతై. *కొను* పరిగ్రహణంలో ధాతువులకేకత్వం లేదు. కొన్ని ధాతువులు *కొను* తో మాత్రమే ప్రయోగార్హాలు. *ఊరుకొను, పుచ్చుకొను*వంటి ధాతువు లట్లాంటివి. కొన్ని ధాతువులు *కొను* ను అంగీకరించవు. *ఎరుగు, కూర్చుండు, తిను, పెరుగు, పోవు, వచ్చు, వెళ్ళు* వంటి ధాతువులు అట్లాంటివి. ధాతువుల అర్థపరిశీలన సమగ్రంగా జరిగినప్పుడు *కొను* పరిగ్రహణంలో ప్రవర్తించే విధివిశేషాలను గుర్తించటం సాధ్యం కావచ్చు. ధాతువుకు కొను చేరినపుడు వ్యాపారాన్ని కర్తృ ప్రయోజనపరంగా అన్వయించాలి. ఈ కింది వాక్యాలలో ఈ అర్థ భేదాన్ని గ్రహించవచ్చు.

(30) a. వాళ్ళు పాలు అమ్ముతారు.
b. వాళ్ళు పాలు అమ్ముకొంటారు.
c. అతను పాఠం చదువుతున్నాడు.
d. అతను పాఠం చదువు కొంటున్నాడు.

పై వాక్యాలలో కొను ప్రయోగం ఉన్న క్రియలు వ్యాపార ప్రయోజనం కర్తకోసం అని తెలియజేస్తై. కొన్ని క్రియలకు *కొను* చేరినపుడు పారస్పర్యార్థం వస్తుంది. ఈ అర్థంలో కర్తృపదం బహువచన నామమై ఉండాలి. ఈ పారస్పర్యార్థం సహజంగా ధాతునిష్ఠమై ఉండి బహువచన నామం కర్తగా ఉన్నప్పుడు *కొను* ద్వారా వ్యక్తమవుతుంది. *కొట్టుకొను, తిట్టుకొను, మాట్లాడుకొను, పోట్లాడుకొను*, వంటి క్రియలు బహువచన నామ కర్తృత్వంతో పారస్పర్యార్థ బోధకాలవుతాయి. ఈ క్రింది వాక్యాలలో ఈ అర్థభేదాన్ని గమనించవచ్చు.

(31) అతను (తన్ను తాను) తిట్టుకొన్నాడు.
వాళ్ళు బజారులో తిట్టుకొన్నారు.
అతను తనలో తాను మాట్లాడుకొంటున్నారు.
వాళ్ళు ఆ గదిలో మాట్లాడుకొంటున్నారు.

అకర్మకంగా ఉన్న కొన్ని ధాతువులు కొను చేర్చటం వల్ల సకర్మకమవు

తాయి. తెలును అకర్మక క్రియ, తెలుసుకొను సకర్మక క్రియ. ఇవికాక మరికొన్ని అర్థభేదాల్ని కూడా గమనించవచ్చు. *అను* అంటే బయటికి మాట్లాడటం, *అనుకొను* అంటే ఆలోచించటం *అడుగు* అంటే ప్రశ్నించటం, *అడుక్కొను* అంటే యాచించటం. *పడు* అంటే పతనం కావడం, *పడుకొను* అంటే విశ్రాంతి తీసుకోవడం, నిద్రపోవటం.

**1 247** : *కొను* లాగే మరికొన్ని ధాతువుల్ని క్రియలకు చేర్చటం వలన కొన్ని విశేషార్థాలు వ్యక్తమవుతై. ఇదంతమైన క్రియలకు **పెట్టు** చేర్చటంవలన పరప్రయోజనార్థమూ, *పోవు, వేయు* చేర్చటం వలన పరిపూర్ణార్థమూ వస్తై. ఈ కింది వాక్యాలు ఈ అర్థాలకు ఉదాహరణలు.

(32) a మా అన్నయ్య బజారునుంచి నాకు చొక్కాలు తెచ్చిపెట్టాడు.
b. గాలివాన వచ్చి మామిడి పండ్లు రాలిపోయినై.
c. వ్యాపారస్తులు ధాన్యాన్ని దాచివేశారు.

**1.248** : ఇతరభాషలలో పరిపరి విధాలుగా వ్యక్తమయే విశేషార్థాలు తెలుగులో ధాతువిస్తరణ ప్రక్రియద్వారా వ్యక్తం కావటం విశేషమైనది ఆత్మార్థం, పరప్రయోజనార్థం ఇంగ్లీషులో నామపదాల ద్వారా వ్యక్తమవుతై. తెలుగులో ధాతువులద్వారా వ్యక్తమవుతై. తెలుగులో అన్నంత క్రియకు కొన్ని ధాతువులను చేర్చటంవల్ల కొన్ని విశేషార్థాలు వ్యక్తమవుతై. వీటిని ఇంగ్లీషులో Modals అంటారు. వివిధార్థాలు ఈ కింది వాక్యాలలో పదాహృత మవుతున్నై.

సామర్థ్యార్థం : *కల, కలుగు.*

(33) అతను పన్నెండు ఇడ్లీలు తినగలడు.

కల ప్రయోగించినపుడు వాక్యంలో ప్రత్యేకంగా కాలబోధ లేకపోతే వాక్యం తద్ధర్మార్థకం అవుతుంది. దీన్ని భవిష్యత్ కాలంలోకూడా ప్రయోగించవచ్చు. కాలబోధ ప్రత్యేకంగా చెప్పాల్సి వచ్చినప్పుడు *కల*కు *కలుగు* ఆదేశమవుతుంది. వ్యతిరేకంలో *కల* కు ***లే***, *కలుగు* కు ***లేకపో*** ఆదేశమవుతాయి.

అనుమత్యర్థం : *ఇచ్చు.*

(34) నన్ను లోపలికి రానియ్యి.

ఈ అర్థంలో *ఇచ్చు* ప్రయోగించినపుడు ప్రధానక్రియకు కర్త అయిన నామం ద్వితీయా విభక్తి రూపంలో ఉంటుంది. ఇచ్చు క్రియకు కర్త ప్రథమా విభక్తిలో ఉంటుంది. భిన్నక్రియలకు భిన్నకర్తలున్న ఈ వాక్యాన్ని సంశ్లిష్ట వాక్యంగా భావించవచ్చు. ఈ వాక్యంలో ఇచ్చు క్రియను దానార్థంలో ఉన్న *ఇచ్చు* కన్న భిన్నంగా భావించాలి.

సంభావన, అనుమతి : వచ్చు.

(35) మా మామయ్య రేపు ఊరినుంచి రావచ్చు.

(36) మీరిక బయటికి వెళ్ళవచ్చు.

(35) లో 'రా' కు వ్యతిరేకంలో 'రాకపో' అనే రూపం ఆదేశమవుతుంది. (36) లో వచ్చు కు *రాదు, కూడదు* అనే రూపాలు ఆదేశమవుతై. ఈ రెండర్థాల లోను ఈ క్రియలకు కాలబోధక ప్రత్యయాలు కాని, క్రియా విభక్తులుగాని చేరవు.

సంవిధి (తప్పనిసరి) వలయు > *అలి*, అల

(37) a. రేపు సాయంకాలం నేను ఊరికి వెళ్ళాలి.
b. మీరు మాయింటి కొకసారి రావాలి.

అన్నంతరూపం దీర్ఘాంతమయితే 'వ' కారం ఆగమం అవుతుంది. ఈ రూపా లకి వ్యతిరేకంలో అన్నంత రూపంలో ఉన్న ప్రధాన క్రియకు *అక్కరలేదు* అవసరం లేదు అనే పదాలు చేర్చటం వల్ల ఏర్పడతై. ఈ క్రియారూపం సహజంగా భవిష్యదర్థ బోధకం. కాలబోధ ప్రత్యేకంగా చెయ్యదలచుకుంటే ఈ క్రియకు *ఉండు, వచ్చు* అనే క్రియలను అనుబంధించాలి. దీనికి *ది* అనే క్రియా విభక్తి మాత్రమే చేరుతుంది. ఈ కింది ఉదాహరణలను పరిశీలించండి.

(38) a. పాలకులకోసం సైనికులు యుద్ధాలు చేయాల్సి ఉంటుంది.
b. దేశంకోసం ప్రజలు మాత్రమే కష్టాలను భరించాల్సి వచ్చింది.

*వలయు* కు *ఉండు, వచ్చు* లను అనుబంధించినప్పుడు *వలసి* అని అవుతుంది. అదే వ్యవహారంలో *అల్సి* అని ఉంటుంది.

అసామర్థ్యం : చాలు.

చాలు అనే క్రియ అన్నంత క్రియకు అనుబంధింపబడి అశక్తతను చూపిస్తుంది. దీనికి వ్యతిరేకంలో మాత్రమే ప్రయోగం ఉంటుంది. చాలు కు అన్నంత రూపంలో అన్ని క్రియావిభక్తులూ చేరతై. దీనికి భవిష్యత్తులోనే ప్రయోగం ఉంటుంది.

(39) స్వార్థపరులైన నాయకులు ప్రజలకు మేలుచేయజాలరు.

చాలు అనే క్రియతో ఈ రకమైన ప్రయోగాలు కావ్యభాషలో ఎక్కువగా ఉన్నై. ఆధునిక భాషలో కొన్ని తెలంగాణా జిల్లాలలో మాత్రమే వినిపిస్తై.

తక్షణ భవితవ్యం : పోవు.

(40) నేను ఊరికి వెళ్ళబోతున్నాను.

ఈ క్రియ అనుసంధించినపుడు మిగతా క్రియలకు లాగే అన్ని కాలాలలోనూ రూపాలుంటై.

నిషేధార్థం : వద్దు.

(41) చెప్పుడు మాటలు వినవద్దు.

ఈ రకమైన వాక్యం సాధారణంగా మధ్యమ పురుషకర్తృకంగా ఉంటుంది. తెలంగాణాలో కొందరి వ్యవహారంలో ప్రథమోత్తమ పురుష కర్తృకంగా కూడా ఉండవచ్చు.

**1.25 :** నిశ్చయార్థక వాక్యాలన్నిటికీ వ్యతిరేక వాక్యాలుంటై. క్రియా సహిత వాక్యాలలో వ్యతిరేక క్రియాప్రయోగం వల్ల వ్యతిరేక వాక్యాలు ఏర్పడతై. ఆ క్రియారూపాలు కాలభేదాల్ని బట్టి వేరువేరుగా ఉంటై. అన్నంత క్రియారూపం మీద లేదు అనే శబ్దాన్ని ప్రయోగిస్తే భూతకాల వ్యతిరేక క్రియలు, అటమంత భావార్థక రూపాలమీద లేదు అనే శబ్దాన్ని ప్రయోగిస్తే వర్తమాన వ్యతిరేక క్రియా రూపాలు ఏర్పడతై. ఈ రెండు రూపాల్లోనూ కర్తృబోధను సూచించే క్రియా విభక్తులుండవు. అంటే అన్ని పురుషలలోనూ ఒకేరూపం నిశ్చలంగా ఉంటుంది. లేదు అనే శబ్దం క్రియాసహిత వాక్యాలతో ఏర్పడ్డ ప్రశ్నలకు వ్యతిరేకంలో ఇచ్చే సమాధానాలన్నింటికి వాక్యాదిని అవ్యయంగా ఉపయోగించవచ్చు,

**లేదు** శబ్దంలో **లే** ఉండు ధాతువుకు భూతకాల వ్యతిరేకంలో వచ్చే ఆదేశరూపం; **దు** అమహద్విభక్తి. అయినా ఈ పైన చెప్పిన ప్రయోగాల్లో **లేదు** అవ్యయంగానే ఉపయుక్త మవుతుంది. వ్యతిరేక భవిష్యత్క్రియ అన్నంత క్రియారూపం మీద క్రియావిభక్తులను చేర్చటంవల్ల ఏర్పడుతుంది.

**1.26** : వాక్యంలో క్రియేతర శబ్దాలకు ప్రాధాన్యాన్ని సూచించే కొన్ని పద్ధతులు ఇంతకు ముందే పేర్కొన బడ్డై. ఇంకొక పద్ధతి వాక్యంలో క్రియేతర శబ్దాన్ని ఆఖ్యాత స్థానానికి జరపటం. అప్పుడు అట్లా జరిగిన పదం విధేయమవుతుంది; మిగతా వాక్యభాగమంతా ఉద్దేశ్యమవుతుంది. ఈ నామ్నీకృత రూపం క్రియాజన్య విశేషణం మీద *ది* అనే ప్రత్యయం చేర్చటంవల్ల ఏర్పడుతుంది. ఈ ప్రక్రియను ప్రాధాన్య వివక్షామూలక నామ్నీకరణం అనవచ్చు. అది ఈ క్రింది వాక్యాలలో ఉదాహరించబడుతుంది.

(42) a. సుబ్బారావు నిన్న పట్నంనుంచి పిల్లిపిల్లను తెచ్చాడు.
b సుబ్బారావు నిన్న పట్నంనుంచి తెచ్చింది పిల్లిపిల్లను.
c. సుబ్బారావు నిన్న పిల్లిపిల్లను తెచ్చింది పట్నంనుంచి.
d. సుబ్బారావు పట్నంనుంచి పిల్లిపిల్లను తెచ్చింది నిన్న.
e. నిన్న పట్నంనుంచి పిల్లిపిల్లను తెచ్చింది సుబ్బారావు.

పై వాక్యాలలో ప్రధానార్థం ఒకటే అయినా ఆఖ్యాత స్థానానికి జరిగిన పదానికి ఎక్కువ ప్రాధాన్యం వచ్చింది.

ప్రశ్నార్థక శబ్దాలున్న వాక్యాల్లో కూడా ఈ రకమయిన మార్పు జరుగుతుంది. ఆ వాక్యాలలో ప్రశ్నార్థక శబ్దం విధేయమై ఆఖ్యాత స్థానానికి జరిగినప్పుడు అటమంత భావార్థక రూపం కూడా ప్రయోగించవచ్చు.

(43) a. మీరు ఊరికి ఎప్పుడు వెళ్లారు?
b. మీరు ఊరికి వెళ్ళటం ఎప్పుడు?

భావార్థక రూపంలో కాలబోధ లేదు. సందర్భాన్నిబట్టే కాలాన్ని గ్రహించాల్సి ఉంటుంది.

**1.27** : తెలుగు వాక్యాలలో కొన్ని రకాల అర్థ ప్రభేదాలను కలిగించగల శబ్దాలు కొన్ని ఉన్నై. ఇవి ప్రత్యేక పదాలు కావు. సాధారణంగా వాక్యాంతంలో చేరతై. వీటిని వాక్యంలో దాదాపు ఏ పదానికైనా తగిలించవచ్చు. అట్లాంటి శబ్దాలు కొన్ని. 1. *అంట > అట > ట;* 2. *కదా, కదూ, కదే, గా;* 3. *ఏ, వే, రా, రోయ్, ఓయ్;* 4. *అండీ;* 5. *లే;* 6. *ఏమో, ఓ;* 7. *ఆ;* 8. *ఏ.*

పై వాటిల్లో అట తర్వాత మిగతా ఏ శబ్దాలయినా రావచ్చు. వీటిల్లో రెండో వాటికి కిలార్థకాలని, మూడోవాటికి సంబుద్ధ్యర్థకాలని, నాలుగో దానికి గౌరవార్థకమని, ఐదోదానికి నిరాదరణార్థకమని, ఆరో వాటికి సందేహార్థకాలని, ఏడో దానికి ప్రశ్నార్థకమని పేర్లు. ఎనిమిది సంఖ్యతో సూచించినది క్రియ మీద వచ్చినపుడు ఆశ్చర్యార్థకం, మిగతా పదాలమీద వచ్చినపుడు అవధారణార్థకం, అవుతుంది.

వీటిలో *అట*కు అనుకృతిలో ప్రయోగించే అని కి సామ్యం ఉంది. *అట* ప్రయోగించిన వాక్యాలను అనుకరణ వాక్యాలుగానే నిరూపించవచ్చు. వక్త ప్రయోగించిన వాక్య విషయం తను స్వయంగా చెపుతున్న విషయం కాదని. ఇంకొకరు చెప్పిన విషయాన్ని తాను చెప్తున్నట్లుగా భావించవలసి ఉంటుందని వక్త ఉద్దేశించినపుడు *అట* ప్రయోగం జరుగుతుంది.

*అట* శబ్దప్రయోగంలో వ్యవహర్తల మధ్య కొన్ని భేదాలున్నట్లు కన్పిస్తున్నది. గ్రామీణ వ్యవహారంలో అంట అనే రూపం ఎక్కువగా కన్పిస్తున్నది. పట్టణాలలో కొందరి భాషలో అట, మరికొందరి భాషలో *ట* అనే రూపాలున్నై. ఈ రచయిత భాషలో సాధారణ వ్యవహారంలో *అంట*, బయటి వ్యవహారంలో *అట* ఉన్నై. *ట* ప్రయోగం మాత్రం లేదు.

అట ప్రయోగించిన ఈ కింది వాక్యాలను పరిశీలించండి.

(44) a. శ్రీమతి సుజాతారావుగారు సిగరెట్లు కాలుస్తారట.
b. నేను నిద్దరలో కలవరించానట.
c. నువ్వు మీపై అధికారికి మస్కా కొడుతున్నావట.

మొదటి వాక్యంలో చెప్పిన విషయానికి తన బాధ్యత ఏమిలేదని తానె

క్కడో విన్న విషయాన్ని మాత్రమే చెప్పుతున్నానని వక్త ఉద్దేశం. రెండో వాక్యంలో చెప్పిన విషయాన్ని గురించి వక్తకు ప్రత్యక్ష జ్ఞానం లేనట్లు అట సూచిస్తున్నది. మూడో వాక్యంలో కూడా శ్రోతను గురించి వక్త పరోక్షంగా గ్రహించిన విషయాన్ని సూచిస్తున్నది. వాక్యంలో విషయానికి వక్తకు ప్రత్యక్ష జ్ఞాన రాహిత్యాన్ని సూచించటానికి అట ప్రయోగించబడుతుంది.

వాక్యాలలో ఏ-శబ్దంతో ఉన్న ప్రశ్నార్థక పదం ఉన్నప్పుడు ఓ-ప్రశ్నార్థక పదం లేనప్పుడు ఏమో అనే రూపాలు సందేహార్థంలో చేరతై.

(45) a. అతనెప్పుడు వస్తాడో ?
b. అతను రేపు వస్తాడేమో.

అటాదులు ఒకే వాక్యంలో ఒకటికన్నా ఎక్కువ ఒకదానిపక్కన ఒకటి రావచ్చు. ఈ కింది వాక్యాలలో అట్లాంటి క్రమం కొంతవరకు తెలుస్తుంది.

(46) a ఆమె అందరితో పోట్లాడుతుందట గదరా ?
b. అతడు మర్యాదగా మాట్లాడతాడటనా ?
c. అతను రేపు సాయంకాలం వస్తాడేమోగదూ ?
d. నువ్వు చెప్పింది అతనేనా ?
e. అతను రేపు వస్తాడేమోలే,

ఈ అటాదులు వాక్యంలో ఏ పదానికైనా తగిలించవచ్చునని ఇంతకు ముందు చెప్పబడింది. ఇట్లా తగిలించబడిన పదాలు వాక్యంలో ప్రాధాన్యాన్ని వహిస్తై. అప్పుడు ప్రాధాన్యాన్ని పొందిన పదం ఆఖ్యాత స్థానానికి జరగకుండానే క్రియ నామ్నీకృత మవుతుంది.

(47) *a. అతను నిన్న వచ్చింది.
b. అతనా నిన్న వచ్చింది.

పై వాక్యాలలో మొదటిది వ్యాకరణ విరుద్ధం. ప్రాధాన్యాన్ని సూచించిన రెండవవాక్యం వ్యాకరణ సమ్మతం. అంటే ప్రాధాన్యబోధ లేకుండా క్రియ నామ్నీకృతం కాదని అర్థం. పై వాక్యంలో ప్రశ్నార్థకమైన ఆ ఉపయోగించబడింది. అటాదుల్లో ఏవి ప్రయోగించినా ఫలితమిదేనని స్పష్టం. అంతేకాక ఈ అటాదులు వాక్యంలో క్రియేతరమైన ఏ పదానికి తగిలించినా ఇదే ఫలితం వస్తుంది. ఈ శబ్దాలు

క్రియారహిత వాక్యాలలో కూడా ఇదే పద్ధతిలో ప్రయోగించవచ్చు. ఇక్కడలాగే అక్కడకూడా ఈ శబ్దాలు చేర్చినపుడు పదక్రమంలో మార్పు వికల్పమవుతుంది. వీటిల్లో కొన్ని సంయుక్త వాక్యాలలో అసమాపక క్రియలకు కూడా చేరతై. అప్పుడుకూడా సమాపక క్రియ నామ్నీకృత మవుతుంది. ఈ కింది ఉదాహరణలలో ఈ ప్రక్రియ చూపించబడుతుంది.

(48) a. అతను మెట్లు దిగుతూనట కిందపడింది.
b. నువ్వు కాఫీ తాగి కదా బజారుకు వెళ్ళేది?
c. నువ్వు చేస్తానంటే గదా పనిచెప్పేది?
d. ప్రజల్ని మోసం చెయ్యటమేగదా ప్రభుత్వాలు చేస్తున్నది?

ఈ పై వాక్యాలలో అసమాపక క్రియలైన శత్రర్థక, క్త్వార్థక, చేదర్థక, భావార్థక క్రియలమీద అటాదులు ప్రయోగించబడినై. ఆ కారణంగా సమాపక క్రియలు నామ్నీకృతాలు అయినై.

**1.28 :** వాక్యంలో కర్తృపదానికి, క్రియకు ఉన్న సంబంధం క్రియ బోధించే వ్యాపారాన్ని బట్టి ఉంటుంది ఆ సంబంధాల ననుసరించి నామపదాల్ని ప్రాణి, అప్రాణి వాచకాలుగా; మూర్త, అమూర్త బోధకాలుగా; మనుష్య, మనుష్యేతర వాచకాలుగా, ఘన, ద్రవపదార్థ వాచకాలుగా విభజించాల్సి ఉంటుంది. ఇవి కాక వేరే విభాగాలు కూడా అవసరం కావచ్చు. ఉదాహరణకి ఈ కింది వాక్యాలు చూస్తే అట్లాంటి విభాగాల ఆవశ్యకత తెలుస్తుంది.

(49) a. కర్ర విరిగింది.
b. కాయితం చినిగింది.
c. అద్దం పగిలింది.
d. ఇల్లు కడిగారు.
e. గుడ్డలుతికారు.

పై వాక్యాలలో ఒక్కొక్క నామానికి, క్రియావ్యాపారానికి ఉన్న పరస్పర సంబంధం తెలుస్తుంది. ఈ సంబంధాలన్నీ సంపూర్ణంగా గ్రహించినపుడే సమగ్రమైన తెలుగు వ్యాకరణం సాధ్యమవుతుంది.

**1.29 :** కర్మపదాలు ప్రాణివాచకాలైనపుడు, ద్వితీయావిభక్తి ప్రత్యయమైన ను, ని లను గ్రహిస్తుంది. ఇవికాక భిన్నార్థాలలో భిన్నవిభక్తి ప్రత్యయాలు నామాలకు చేరుతుంటై. వాటిల్లో కొన్ని ఈ కింది ఉదాహరించబడు తున్నై.

1. *కు ; కి* : సంబంధార్థం, స్వామ్యార్థం, సంప్రదానార్థం, ప్రయోజనార్థం, గమ్యార్థం.

(50) a. ఆమెకి ఇద్దరు పిల్లలు.
b. అతనికి రెండిళ్ళున్నై.
c. నీకు పిల్ల నెవరిస్తారు.
d. చల్లకువచ్చి ముంత దాచట మెందుకు ?
e. అతను ఊరికి వెళ్ళాడు.

ఇవికాక చాలా చాలా అర్థాలలో ఈ విభక్తి ప్రయోగించబడుతుంది.

(51) a. నాకు వందరూపాయలు కావాలి.
b. నీకు ఎవరు చెప్పారు ?
c. ఆమె పిల్లికి భయపడుతుంది.
d. అతను చలికి వణుకు తున్నాడు.
e. నాకు హిందీ రాదు.
f. రేపు పదిగంటలకు వస్తాను.

2. *నుంచి* : అపాదానార్థం, హేత్వర్థం, ఏకదేశ పృథక్కరణం.

(52) a. అతను అమెరికానుంచి వచ్చాడు.
b. అతను పదేళ్ళ నుంచి మెడిసిన్ చదువుతున్నాడు.
c. నీనుంచి మాటలు పడాల్సి వచ్చింది.
d. అతను చెట్టునుండి పువ్వులు కోశాడు.

3. **తో** : కరణార్థం, సహార్థం, రీత్యర్థం, దేహమనఃస్థితి బోధకం.

(53) a. అతను పెన్సిలుతో పరీక్ష రాసాడు.
b. అతను కమలతో పరీక్షకు వెళ్ళాడు.
c. అతను శ్రద్ధతో పాఠాలు చదివాడు

d. అతను జ్వరంతో పరీక్ష రాసాడు.

e. అతను నా మీద కోపంతో మా యింటికి రాలేదు.

ఈ చివరి వాక్యానికి రెండర్థాలున్నాయి. ఒకటి : నామీద కోపంవల్ల మా యింటికి రాలేదు అని, రెండు : మా యింటికి వచ్చాడు కాని కోపంగా లేడని.

ఈ పై వాక్యాలలో కరణార్థం తప్ప మిగతా అర్థాలను బోధించే వాక్యాలను ఏక వాక్యాలుగా కాక, భిన్న వాక్యాల సంయోగం వల్ల సిష్పన్నమైనట్లుగా భావించ వచ్చు. చివరి వాక్యంలో ఉన్న అర్థభేదంకూడా ఈ విషయాన్నే సూచిస్తుంది

4. లో : అధికరణార్థం.

(54) a. రచయితలకు తెలుగు దేశంలో సంపూర్ణ స్వేచ్ఛలేదు.

b. 1956 లో విశాలాంధ్ర ఏర్పడింది.

c. తెలుగు పత్రికలో ఆంధ్రపత్రిక పురాతనమైనది,

d. అతనికి ఆటలలో ఆసక్తి ఎక్కువ.

ఈ పైన ఇచ్చినవికాక *వరకు, దాకా, గురించి, బట్టి,* వంటి విభక్తి ప్రత్యయాలు చాలా ప్రయోగంలో ఉన్నై. *కంటె, కన్నా* అనే ప్రత్యయాలు తుల నార్థంలో ఉన్నై. ప్రయోజనార్థంలో *కోసం* ఉంది. దేశకాలంలో భిన్న సంబంధా లను బోధించే *ముందు, వెనక, తరువాత, కింద, పైన, పైకి, మీద, పక్క, వైపు, తట్టు, బయట, లోపల* ఇట్లాంటివి చాలా పదాలు నామపదానికి చేరతై. వీటిల్లో కొన్ని మళ్ళీ విభక్తులను గ్రహిస్తాయి. *పైనుంచి, పైకి, వెనక నుంచి, వెనక్కి,* ఇట్లాంటివి దేశకాలబోధక శబ్దాలకు *నుంచి, కు* చేర్చటంవల్ల ఏర్పడతై. గమనార్థక క్రియలున్నప్పుడు వాక్యంలో ఈ రకమైన రూపాలు నామం తరువాత ప్రయోగించబడతై. పైన పేర్కొన్న విభక్తులు ఆయా ధాతువుల ననుసరించి నామాలకి చేరతై. అవి గ్రహించే కారకబంధాల్ని బట్టి క్రియలను విభజించటం ఒక పద్ధతి.

★

# 2. సంశ్లిష్ట వాక్యాలు

ఒక ప్రధానవాక్యానికి కొన్ని ఉపవాక్యాలుచేరడంవల్ల సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడుతై. సంశ్లిష్ట వాక్యాల్లో ప్రధానవాక్యం క్రియాసహితమైతే ఒకటికన్నా ఎక్కువ క్రియలను గుర్తు పట్టవచ్చు. ఉపవాక్యాల్లో క్రియ సాధారణంగా అసమాపక క్రియ అయి ఉంటుంది. మరికొన్నిటిలో క్రియ భావార్థకనామంగాగాని, క్రియాజన్యవిశేషణంగా కాని ఉంటుంది. ఈ చెప్పిన క్రియారూపాల్లో పురుషబోధ ఉండదు. అసమాపక క్రియల్లో అయినా, వ్యాపారం జరిగే తీరును గురించే ఉంటుంది. కాలబోధ ప్రధాన క్రియను అనుసరించి ఉంటుంది. క్రియాజన్య విశేషణంలో కాలబోధ ఉంటుంది. క్రియలన్నింటికీ వ్యతిరేకరూపాలుకూడా ఉంటై. అని తో ప్రయోగించే అనుకరణల్లోనూ, పరోక్షప్రశ్నల్లోను ఉపవాక్యంలోకూడా సమాపక క్రియే ఉంటుంది. ప్రధాన వాక్యాన్ని గర్భివాక్యంగానూ ఉపవాక్యాన్ని గర్భ, వాక్యంగానూ భాషాశాస్త్రంలో వ్యవహరిస్తారు.

## 2.1 అసమాపక క్రియలు; క్త్వార్థకం :

తెలుగులో (మిగతా భారతీయభాషల్లోకూడా) ప్రధాన క్రియకన్నా ముందు జరిగినట్లు భావించే వ్యాపారాలను సూచించటానికి అసమాపక క్రియలను వాడతారు. దీనికి క్త్వార్థక క్రియ అనే పేరు సాంప్రదాయికంగా ఉంది. ధాతువుకు ఇ అనే ప్రత్యయం చేర్చటంవల్ల తెలుగులో క్త్వార్థక క్రియ ఏర్పడుతుంది. క్రియాంత భాషల్లో అసమాపక క్రియలన్నీ ప్రధానక్రియకు పూర్వమే ఉంటై. పూర్వాపూర్వ వ్యాపారాలను సూచించటానికి క్త్వార్థకక్రియ ప్రయోగించవడుతుంది. ప్రధానక్రియ సూచించే వ్యాపారంతోపాటే జరిగే వ్యాపారాలను బోధించటానికి వాడే అసమాపక క్రియను శత్రర్థకక్రియ అంటారు. ఇది ధాతువులకు తూ అనే ప్రత్యయాన్నీ, (కొందరి భాషలో ఇది తా అనే రూపంతో ఉంటుంది.) చేర్చటంవల్ల ఏర్పడుతుంది. 'వచ్చు' అను ధాతువును ఉదాహరణంగా తీసుకొంటే క్త్వార్థక క్రియ 'వచ్చి' అని. శత్రర్థక క్రియ వస్తూ అని ఉంటుంది.

**2.11** వాక్యంలో క్త్వార్థక, శత్రర్థక క్రియలు ఉన్నప్పుడు ప్రధాన

అప్రధాన క్రియలకు రెండింటికి ఒకేకర్త ఉంటుంది. దీన్నే క్త్వార్థకం విషయంలో "సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగు" (క్రియ-8) అని బాల వ్యాకర్త గుర్తించి సూత్రించారు. ఈ నియమాన్ని సూచించే కింది వాక్యాలని గమనించండి.

(55) సుజాత అన్నం తిని నిద్రపోయింది.

(56) సుజాత అన్నం తింటూ నిద్రపోయింది.

వేరువేరు కర్తలున్న ఈ కింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

* (57) సుజాతా అన్నంతిని సుశీల నిద్రపోయింది.

* (58) సుజాత అన్నం తింటూ సుశీల నిద్రపోయింది.

ఈ రకమైన వాక్యాల్లో ఒకే కర్తను సూచించాలంటే కర్తృపదంగా ఒకే నామాన్నే (నామబంధాన్ని) వాడాలి. భిన్న నామాలుంటే ఒకే కర్తను సూచించలేవు. అందువల్ల అట్లాంటివి వ్యాకరణ సమ్మతాలు కావు.

* (59) ఆ అమ్మాయి అన్నంతిని సుజాత నిద్రపోయింది.

* (60) ఆ అమ్మాయి అన్నం తింటూ సుజాత నిద్రపోయింది.

ఈ రకమైన వాక్యాల్లో కర్తృపదాలు రూపైకత, అర్థైకత ఉన్న నామాలే ఉండాలని, వాటిల్లో ఒకటి నిత్యంగా (సనామబంధంలోపం సూత్రంచేత) లోపించాలని పై వాక్యాలనిబట్టి తెలుస్తుంది. ఈ లోపించే వాక్యం గర్భివాక్యంలోదా ? గర్భవాక్యంలోదా ? అనే ప్రశ్నకు ఈ వాక్యంలో సమాధానం దొరకదు. ఎందుకంటే లోపించగా మిగిలిన క్రియ ప్రధానవాక్యంతోనూ ఉండవచ్చు, ఉపవాక్యంతోనూ ఉండవచ్చు.

(61) సుజాత అన్నం తిని నిద్రపోయింది.

(62) అన్నం తిని సుజాత నిద్రపోయింది.

ఈ రకమైన వాక్యాలు ఏకకర్తృకంగా ఉండాలనే నియమాన్ని బాలవ్యాకర్త కూడా గుర్తించినట్లు గమనించాం. కాని బాల వ్యాకర్తపైన వేర్కొన్న సూత్ర వివరణలో "సమాన కర్తృకంబు లనక సమానాశ్రయంబులనుటంజేసి చైత్రుని చేత మైత్రుండు, కొట్టంబడిమడిసె." అని చెప్పాడు దీన్నిబట్టి ఈ రకపు వాక్యాల్లో

గుప్తనిర్మాణపుకర్తల్లో ఏకత్వం ఉండాలని బాలవ్యాకర్త ఉద్దేశించినట్టు కనిపిస్తుంది. కాని కొట్టంబడి అనే క్రియకు చైత్రుడు ఆశ్రయం ("కర్తకుచేత వర్ణకంబగు"). మైత్రుడు ఆశ్రయంకాదు. కర్మణిసూత్రంవల్ల ఏర్పడిన కర్త. అంటే వ్యక్త నిర్మాణపు కర్త. క్త్వార్థకాది క్రియలున్న వాక్యాల్లో సమాన కర్తృకాలంటే క్త్వార్థక సూత్రం వర్తించేటప్పుడున్న కర్తలనే అర్థం చెప్పుకోవాలి. గుప్తనిర్మాణంనుంచే క్త్వార్థక క్రియ లేర్పడవచ్చు. కర్మణి సూత్రప్రవర్తన తరవాత (కర్మణిసూత్రం వల్ల గుప్తనిర్మాణంలో కర్తృకర్మలకు వ్యత్యయం ఏర్పడుతుంది ) ఉన్న కర్తలతో సమానతనిబట్టికూడా క్త్వార్థక మేర్పడవచ్చు. దీన్నిబట్టి "సమాన కర్తృక" మనే నియమాన్ని గుప్తవ్యక్త నిర్మాణాల్లో ఏ ఒక్కదానికి ప్రత్యేకంగా నిబంధించకుండా, క్త్వార్థకసూత్రం వర్తించేటప్పుడున్న కర్తలనే అర్థం చెప్పుకోవాలి. ఈ క్రింది వాక్యాలనుబట్టి ఈ నియమ ప్రవర్తనను గుర్తించవచ్చు.

(63) సుజాత (సుబ్బారావును) తిరస్కరించి బాధపడింది.

సుజాత (సుబ్బారావుచేత) తిరస్కరించబడి బాధపడింది.

పై రెండు వాక్యాల్లో గుప్తనిర్మాణపు కర్తలు వేరనే విషయం స్పష్టమే. (63)లో సుజాత, (64)లో సుబ్బారావు గుప్తనిర్మాణపు (వ్యాపారాశ్రయమైన) కర్తలు. అయినా రెండుచోట్లా క్త్వార్థకక్రియ సాధ్యమయింది.

కర్మణి సూత్రం (64)లో ఉపవాక్యానికి వర్తించింది. ప్రధాన వాక్యంలో సకర్మకక్రియ ఉంటే అక్కడ కూడా వర్తించవచ్చు. రెండు చోట్లా వర్తించిన ఈ క్రింది వాక్యాన్ని గమనించండి.

(65) సుజాత సుబ్బారావుచేత తిరస్కరించబడి అవమానించ బడింది.

క్త్వార్థకక్రియ, ప్రధానక్రియ సన్నిహితంగా ఉన్నపుడు క్త్వార్థకంలో కర్మణి క్రియారూపాన్ని సూచించే 'పడు' ధాతురూపాన్ని లోపింపజేసినా ప్రధాన క్రియ నుంచి కర్మణి అర్థాన్ని గ్రహిస్తుంది.

(66) సుజాత సుబ్బారావుచేత తిరస్కరించి అవమానించబడింది.

(65) (66) వాక్యాలు సమానార్థకాలు. రెండిట్లో క్రియలకు గుప్త నిర్మాణ కర్త సుబ్బారావు; కర్మ సుజాత. వాక్యం (66)లో **సుబ్బారావుచేత** అనే పద బంధాన్ని లోపింపజేస్తే అది భిన్నార్థబంధకం అవుతుంది.

(67) సుజాత తిరస్కరించి అవమానించబడింది

ఈ వాక్యానికి రెండర్థాలున్నై. ఒక అర్థంలో ఇది (65) (66) వాక్యాలకు సమానం. అంటే సుజాత రెండు క్రియలకు గుప్తనిర్మాణ కర్మగానే వ్యవహరిస్తుంది. రెండో అర్థంలో సుజాత ఎవర్నో తిరస్కరించిందని, ఆ 'ఎవరో' సుజాతని అవమానించారని భావం. అంటే క్త్వార్థకక్రియకు కర్త అనీ, ప్రధాన క్రియకు కర్మ అనీ తెలుస్తుంది. వాక్యంలో క్త్వార్థకక్రియ, ప్రధానక్రియ సన్నిహితంగా ఉన్నప్పుడే ఈ విధంగా రెండర్థాలు వస్తై. రెండు క్రియలూ వ్యవహితమైనప్పు డిట్లా రెండర్థాలు రావు.

(68) సుజాత తిరస్కరించి ఘోరంగా అవమానించ బడింది.

ఈ వాక్యానికి రెండర్థాలు రావు. సుజాతా క్త్వార్థక క్రియకు కర్త. ప్రధాన క్రియకు కర్మ.

క్త్వార్థకక్రియ ప్రధాన క్రియకన్నా ముందు జరిగే వ్యాపారాన్ని సూచిస్తుంది. అందువల్ల ఈ వాక్యాలు 'తరవాత' అనే పదం ఉన్న వాక్యాలతో సమనార్థ కాలవుతై.

(69) a. సుజాత అన్నం తిని నిద్రపోయింది.
b. సుజాత అన్నం తిని, తరవాత నిద్రపోయింది.
c. సుజాత అన్నం తిన్న తరవాత నిద్రపోయింది.

(69)లో సూచించిన మూడు వాక్యాల్లోనూ సుజాత రెండు వ్యాపారాలను నిర్వహించిందనీ, అందులో మొదటిది అన్నం తినటం, రెండోది నిద్రపోవటం అనీ అర్థం.

క్త్వార్థక వాక్యాల్లో ఏకకర్తృక నియమం సరైనదే అయినా కొన్ని విరుద్ధమైన ప్రయోగాలు కనిపిస్తున్నై. ఉదాహరణకు :

(70) గొర్రెల్ని తినేవాడు పోయి బర్రెల్ని తినేవాడు వచ్చాడు

భిన్నకర్తృకమైన ఈ పైవాక్యం వ్యాకరణ సమ్మతమే. ఈ పైవాక్యం ఒక తెలుగు సామెత. కాని ఇట్లాంటి ప్రయోగాలు కేవలం సామెతల్లోనే సాధ్యమని అనుకోనక్కర్లేదు.

(71) వాడుపోయి వీడెవ్వడు? వీడు హాయిగా నవ్వాడు.

అని దాశరథి కృష్ణమాచార్యులుగారి ప్రయోగం ఒకటి ఉంది. "వీడెవ్వడు" అనే రూపానికి "వీడెవడొచ్చాడు" అని అర్థం. సామాన్య భాషలో ఇట్లాంటివి సాధ్యమేనని కింది వాక్యాలు నిరూపిస్తున్నై.

(72) a. బెంగాల్లో కాంగ్రెసువాళ్ళు ఓడిపోయి కమ్యూనిస్టులు గెల్చారు.
b. ఆంధ్రలో సంజీవరెడ్డి పడిపోయి బ్రహ్మానందరెడ్డి పైకివచ్చాడు.

ఏరకమైన క్రియ లున్నప్పుడు ఇట్లాంటి వాక్యాలు సాధ్యమో తెలియటం లేదు. పరస్పర విరుద్ధబోధ ఉన్న క్రియలున్నప్పుడు ఈ వాక్యాలు భిన్న కర్తృకతను సహిస్తయ్యని తోస్తున్నది.

**2.12**: క్త్వార్థక క్రియతో ఉన్న వాక్యం ఒక్కోసారి ప్రధాన క్రియకు విశేషణంగా ప్రవర్తిస్తుంది. అప్పుడు క్త్వార్థక క్రియాసహిత వాక్యాల్లో *తరవాత* అనే పదం ఉండదు. *తరవాత* అనే పదం ఉన్న వాక్యాలతో ఇవి సమానార్థకాలు కావు. ఈ కింది వాక్యాల్లో అర్థబోధను గమనిస్తే ఈ విశేషాలు గ్రహించవచ్చు.

(73) a. సుజాత ఆఫీసుకు జడ వేసుకుని వెళ్ళింది.
b. సుజాత జడవేసుకుని ఆఫీసుకు వెళ్లింది
c సుజాత జడవేసుకున్న తరవాత ఆఫీసుకు వెళ్ళింది.

పై మూడు వాక్యాల్లో b, c సమానార్థకాలు. కాని (73)a ఈ రెండింటితో సంపూర్ణ సమానార్థకం కాదు. (73)a లో క్త్వార్థక క్రియ ప్రధాన వ్యాపారం నిర్వహించేటప్పుడు కర్త ఉన్నస్థితిని తెలియజేస్తున్నది. ప్రధాన క్రియకు సన్నిహిత స్థితిలో ఈ అర్థం (73a) లో స్ఫురిస్తున్నది. ఉచ్చారణలో వ్యవధానాన్ని సూచిస్తే ఇది (73b, c) లతో సమానార్థకం కావచ్చు.

ధాతువుకు *అకుండా* అనే ప్రత్యయాన్ని చేరిస్తే వ్యతిరేక క్త్వార్థకరూపం ఏర్పడుతుంది. ఇది ఎప్పుడూ కర్తృస్థితి బోధకంగానే ప్రవర్తిస్తున్నట్టు తోస్తున్నది. ఇదే నిజమైతే కేవల వ్యాపారపూర్వికతా బోధలో వ్యతిరేకరూపం లేదనే చెప్పాల్సి ఉంటుంది.

(74) a. సుజాత ఆఫీసుకు జడవేసుకోకుండా వెళ్ళింది.
b. సుజాత జడవేసుకోకుండా ఆఫీసుకు వెళ్ళింది.

ఈ రెండు వాక్యాల్లోనూ వ్యతిరేక క్త్వార్థకం స్థితి బోధకంగానే ప్రవర్తిస్తున్నట్టు కనిపిస్తున్నది.

ప్రధానక్రియలో వ్యతిరేకబోధ క్త్వార్థక క్రియాసహితవాక్యాలు భిన్నార్థ బోధకా సమర్థాలవుతై.

(75) సుబ్బారావు ఇడ్లీ తిని కాఫీ తాగలేదు.

ఈ పై వాక్యంలో రెండర్థాలున్నై. ఆ అర్థాలు ఈ కింది వాక్యాల్లో వ్యక్తమవుతై.

(76) సుబ్బారావు ఇడ్లీ తిన్నాడు కాని కాఫీ తాగలేదు,

(77) సుబ్బారావు ఇడ్లీ తినికాదు కాఫీ తాగింది.

రెండో అర్థంలో (వాక్యం (77)కు సమానార్థంలో) ''ఇడ్లీతిని'' అనే పదం మీద ఊనిక ఉంటుంది.

**2.13** కొన్ని క్రియలు క్త్వార్థకరూపంలో ప్రధానక్రియకు సన్నిహితంగా ఉండి వ్యాపారం రీతిని బోధిస్తై. ఈ రకమైన క్రియలను ఉపవాక్యాలుగా వేరు చెయ్యటంకూడా కష్టమవుతుంది. *నడిచివెళ్ళు, తీసుకువెళ్ళు, తీసుకురా, లాగితన్ను* వంటివి ఇట్లాంటివి. నన్నయగారి భారతభాగంలో ''పావనములైన శిరోజములం దెమల్చి పాపావహు *డీడ్చితెచ్చె*' (సభా-2-216) అనే ప్రయోగంలో ఈ రకమైన క్రియను చూడవచ్చు. ఇవికాక క్త్వార్థకక్రియతో ఉన్న ఉపవాక్యాలు ప్రధానవాక్యానికి రీత్యర్థక విశేషణాలుగా ప్రవర్తించటం, ఈ కింది వాక్యాల్లో చూడవచ్చు.

(78) a. ఆ ఇంజనీరు లంచాలు తిని సంపాయించాడు.

b. ఆ పంతులుగారు ప్రైవేట్లు చెప్పుకుని బ్రతుకున్నాడు.

ఈ పై వాక్యాల్లో క్త్వార్థకక్రియ ప్రధాన వ్యాపారరీతికన్నా సాధనాన్నే బోధిస్తున్నది. కరణకారకానికి అవసరమైన సాధనాల్లో మూర్తమూ, అమూర్తమూ అనే విభాగాన్ని అంగీకరిస్తే ఇక్కడ క్త్వార్థక క్రియలను ప్రధానవ్యాపారానికి అమూర్త సాధనాలని ప్రతిపాదించవచ్చు. ఈ పై వాక్యాల్లో క్రమంగా ''లంచాలు తినటంద్వారా, ప్రైవేట్లు చెప్పుకోటంద్వారా'' అని క్త్వార్థక క్రియస్థానంలో ప్రయోగించినా అదే అర్థం వస్తుంది. బహుశా కింది వాక్యాలకుకూడా ఇదే రకమయిన వ్యాఖ్య అనువర్తించవచ్చు.

(79) a. సుజాత రిక్షా ఎక్కి సినిమాకు వెళ్ళింది.
b. సుజాత బస్సెక్కి బెజవాడ వెళ్ళింది.

**2.14 :** ఈ క్త్వార్థక క్రియ ఒక్కొక్కప్పుడు ప్రధానక్రియకు హేత్వర్థక మవుతుంది. ఏ రకమయిన నియమాలున్నపుడు హేత్వర్థం వస్తుందో చెప్పటం కష్టం. ఈ కింది వాక్యాలని ముందుగా పరిశీలించండి.

(80) a. సుబ్బారావు పాఠంచెప్పి అలిసిపోయాడు.
b. సుజాత భర్తతో పోట్లాడి బాధ పడుతున్నది.
c. సుబ్బారావు కోడిగుడ్లు తిని బలిశాడు.
d. సుబ్బారావుకు కోడిగుడ్లు తిని అజీర్తి చేసింది.

పై నాలుగు వాక్యాల్లోనూ కర్తచేసిన వ్యాపారానికి కర్తే అనుభోక్తగా (experiencer) ప్రధానవాక్యంలో సూచించబడింది. పై వాక్యాలవల్ల హేత్వర్థంలో వ్యక్త నిర్మాణపుకర్తలు ఒకటిగా ఉండాలనే నియమంలేదు కాని, ఒక వ్యాపారానికి కర్త అయిన ప్రాణి రెండోవ్యాపారానికి అనుభోక్తగా ఉండాలనే నియమం ఉంది. అందువల్లనే ఈ కింది వాక్యం వ్యాకరణ విరుద్ధమయింది

(81) సుబ్బారావు పాఠం చెప్పి సుజాత అలసిపోయింది.

(80) లో సూచించిన వాక్యాలలో ప్రధానక్రియ దేహమనః పరిణామబోధకం కావటంకూడా విశేషం. ఒక ప్రాణికి కలిగిన అనుభవం (experience) అదే ప్రాణి నిర్వహించే వ్యాపారానికి కాని, అదేప్రాణికి జరిగిన ఇంకో అనుభవానికి గాని హేతువు కావచ్చు. అప్పుడు అనుభవబోధకమైన మొదటిక్రియ క్త్వార్థక రూపంలో ఉంటుంది.

(82) a. సుబ్బారావు కోపం వచ్చి పెళ్లాన్ని కొట్టాడు
b సుజాతకు జలుబుచేసి జ్వరం వచ్చింది.

పై రెండు వాక్యాల్లోనూ క్త్వార్థకక్రియ బోధించే అనుభవాలకు ప్రాణివాచకాలు అనుభోక్తలు. (82) a. లో ప్రదాన క్రియావ్యాపారానికి ప్రాణివాచక నామం కర్త. (82) b. లో ప్రధాన క్రియకు (కూడా) అనుభోక్త.

పై వాక్యాలను బట్టి ఈ కింది విశేషాలని గమనించవచ్చు. హేత్వర్థబోధ

ఉన్న వాక్యాల్లో ప్రధాన క్రియగాని, క్త్వార్థక క్రియగాని, ఏదో ఒకటైనా దేహ మనః పరిణామ బోధకమైన క్రియ అయివుండాలని, అట్లాంటి క్రియకు అనుభోక్తగా ఉన్న నామమే ఇంకో క్రియకు అనుభోక్తగాగాని, కర్తగాగాని ఉండాలని తెలుస్తుంది. క్త్వార్థక వాక్యాలు భిన్నప్రాణి వాచకనామాలను కర్తలుగాగాని, అనుభోక్తలుగా గాని సహించవని చెప్పవచ్చు. అనుభోక్తలనుగూడా కర్తలుగా గుప్తనిర్మాణంలో ప్రతిపాదిస్తే క్త్వార్థక క్రియాసహిత వాక్యాలు ఏకకర్తృకాలుగా ఉండాలనే నియమాన్ని నిలుపుకోవచ్చు. అప్పుడు వ్యాపారాశ్రయత్వానికి విపులమైన అర్థం చెప్పుకోవాలి. అంటే *నాకు జలుబు చేసింది* అనే వాక్యంలో *నేను* అనే శబ్దాన్నే కర్తగా గుర్తించి కొన్ని క్రియా సందర్భాల్లో కర్తకు కు వర్ణకం వ్యక్తనిర్మాణంలో చేరుతుందని చెప్పటం ఒక పద్ధతి. క్త్వార్థక క్రియలు ఏక కర్తృకమై ఉండాలనే నియమం అప్పుడు గుప్తనిర్మాణ నియమం (deep structure constraint) అవుతుంది. అయితే అట్లాంటి నియమానికి ఇంతకు పూర్వం చర్చించిన కర్మణి వాక్యాలు విరుద్ధమవుతై. అక్కడ ఏక కర్తృక నియమం క్త్వార్థక సూత్రం వర్తించేటప్పటి నియమంగా గుర్తించాం. ఏ రకమైన వ్యాకరణ ప్రక్రియను అనుసరించినా ఎక్కడో ఒకచోట వ్యాకరణంలో అనుభోక్తృ సంబంధాన్ని గుర్తించాల్సి వస్తుంది.

పైన ప్రతిపాదించిన అనుభోక్తృ నియమానికి విరుద్ధంగా కూడా కొన్ని వాక్యాలు కనిపిస్తున్నై.

(83) **a. సుజాత భర్తతో పోట్లాడి పుట్టింటి కెళ్ళింది.**

**b. సుజాత జ్వరం వచ్చి కాలేజీకి వెళ్లింది.**

(83) (a) లో రెండు క్రియలకూ *సుజాత* కర్త. అయినా హేత్వర్థం వచ్చింది. అయితే *పోట్లాడు* వంటి క్రియలను పారస్పర్యార్థ బోధకాలుగా ఊహించవచ్చు. అప్పుడు సుజాతను *పోట్లాడు* అనే క్రియకు కర్తగాను, అనుభోక్తగాను కూడా వ్యాఖ్యానించవచ్చు. ఉదాహరణకు ఈ కింది వాక్యంలో అనుభవబోధకత లేకపోవటంవల్ల హేత్వర్థం లేదు.

(84) **సుజాత భర్తను తిట్టి పుట్టింటికి వెళ్ళింది.**

(83) (b) లో సుజాత అనుభోక్త. అయినా ఇక్కడ హేత్వర్థం లేదు.

అందువల్ల అనుభోక్తృ సంబంధం ఉన్నప్పుడల్లా హేత్వర్థం వస్తుందని చెప్పలేం. ఈ వాక్యంలో (83b) హేత్వర్థానికి బదులు అప్యర్థం వస్తుంది. *సుజాతకు జ్వరం వచ్చినా కూడా కాలేజి వెళ్ళింది* అనే వాక్యార్థంతో (83) (b) సమానం. (83) (b)లో ప్రధాన క్రియ వ్యతిరేక క్రియ అయితే హేత్వర్థం వస్తుంది.

(85) సుజాత జ్వరం వచ్చి కాలేజికి వెళ్ల లేదు.

దీన్నిబట్టి హేత్వర్థం వచ్చినప్పుడు అనుభోక్తృ సంబంధం అవసరమైనా, ఏ వ్యాపారాలకు (వ్యాపారాభావాలకుకూడా) కార్యకారణసంబంధం ఉందో వ్యవహర్తల పరిజ్ఞానాన్నిబట్టి సాంఘికమైన అలవాట్లనుబట్టి మాత్రమే నిర్ణయించాల్సి ఉంటుంది. ఉదాహరణకి ఈ వాక్యాల్ని చూడండి.

(86) a. సుజాత భర్తతో పోట్లాడి పుట్టింటికి వెళ్లింది.
b. సుజాత భర్తతో పోట్లాడి సినిమాకి వెళ్లింది.

(a)లో ఉన్న హేత్వర్థం (86) (b) లో లేక పోవటానికి కారణం ఆ భాషా సమాజంలోఉన్న సాంఘికమైన అలవాట్లు. వ్యాపారభావంకూడా హేత్వర్థంకావచ్చు. అప్పుడు క్త్వార్థక రూపానికి హేత్వర్థక వ్యతిరేక క్త్వార్థకం. ఉపయోగించబడుతుంది. ఇది ధాతువుకు *అక* అనే ప్రత్యయాన్ని చేర్చటంవల్ల ఏర్పడుతుంది.

(87) సుబ్బారావు అన్నం తినక చిక్కిపోయాడు.

హేత్వర్థం లేనిచోట అక ప్రత్యయాంతరూపంవల్ల ఆధునికభాషలో వాక్యం వ్యాకరణ విరుద్ధమవుతుంది.

* (88) సుబ్బారావు అన్నం తినక కాలేజికి వెళ్ళాడు.

తినకుండా అనే రూపం ఉపయోగిస్తే పై వాక్యం వ్యాకరణ సమ్మతమవుతుంది. ప్రాచీనభాషలో హేత్వర్థం లేనిచోట కూడా ఇట్లాంటిరూపం ఉండేదని "బ్రాహ్మణుల కవజ్ఞసేయక శమత్వంబు చేకొనుము" (ఆది. 67-129) అనే నన్నయ ప్రయోగంవల్ల తెలుసుకోవచ్చు. ఆధునికభాషలోకూడా కొన్నిచోట్ల హేత్వర్థం లేకుండా అక ప్రత్యయాంతరూపాలు కనిపిస్తున్నై.

(89) a. ఊరికే పస పెట్టుక తొందరగా రా.

b. బజారులో అటూయిటూ దిక్కులు చూడక సరిగ్గా నడువు.

బహుశా విధ్యర్థక వాక్యాల్లో ఇట్లాంటి ప్రయోగాలు సాధ్యం కావచ్చు. అక ప్రత్యయం కొన్ని రకాల అవ్యయాల, క్రియాపదాల నిర్మాణంలోకూడా ఉపయోగించ బడుతుంది. ఉదా : *తినకముందు, తినకపోతే, తినకతప్పదు.* బహుకాలం చెయ్యని వ్యాపారాన్ని (లేనిస్థితిని) సూచించటానికి ఈ అక ప్రత్యయాంతరూపాన్ని ద్విరుక్తిలో ప్రయోగిస్తారు.

(90) a. లేకలేక లోకాయి పుడితే లోకాయి కన్ను లొట్ట పోయింది.

b. పోకపోక పోతే వాళ్ళింట్లో టీ నీళ్ళుకూడా పొయ్యలేదు.

**2.14 :** ఇంతవరకూ పరిశీలించిన వాక్యాలు ప్రాణివాచక నామాలతో ముడిపడిఉన్నై. అట్లాకాకుండా కేవల అప్రాణివాచకాలు కర్తృపదాలుగా ఉన్నప్పుడుకూడా క్త్వార్థక క్రియారూపం ప్రయోగించబడుతుంది. వస్తుస్థానభేదం వస్తుస్థితి భేదానికి హేతువవుతుంది.

(91) అద్దం కిందబడి పగిలింది.

కొన్ని ప్రకృతిసిద్ధంగా జరిగే వ్యాపారాలు (సంఘటనలు) కూడా వస్తుస్థితి భేదానికి హేతువుకావచ్చు.

(92) a. ఈయేడు గాలివాన వచ్చి మామిడిపండ్లు రాలిపోయినై.

b. వరదలు వచ్చి పంటలు దెబ్బతిన్నై.

c. చెరువు గట్టు తెగి పొలాలు మునిగి పోయినై.

ఒకదానితో ఒకటి సంబంధంలేకపోయినా రెండు ప్రకృతిసిద్ధమైన వ్యాపారాలను క్త్వార్థకక్రియను ఉపయోగించి చెప్పవచ్చు. అప్పుడు ఆనంతర్యార్థక మవుతుంది.

(93) వాన కురిసి, ఎండ కాసింది.

**2.15 :** క్త్వార్థకక్రియ తరవాత కొన్ని పరిమితవాక్యాలు, సాధారణంగా వ్యతిరేకార్థక ప్రతిపాదకాలు, వస్తై.

(94) a. ఈ రోజుల్లో తెలుగు సాహిత్యం చదివి ఏం లాభం ?

b. పౌర హక్కుల్ని గురించి పోలీసులకు చెప్పి ప్రయోజనం లేదు.

వీటిల్లోకూడా హేత్వర్థాన్ని గుర్తించవచ్చు. పై వాక్యాల్లో *చదవటంవల్ల*, *చెప్పటంవల్ల* అనే రూపాలను క్త్వార్థక క్రియకుబదులు వాడవచ్చు. హేత్వర్థంలో క్త్వార్థకక్రియ ఉన్నప్పుడు ప్రయోజనరాహిత్య సూచకమైన ఏ వాక్యమైనా రావచ్చు నన్నమాట. ఈ రకమైన వాక్యాలకు కర్త్రనుభోక్తృ నియమాలేవీ వర్తించవు.

**2.16 :** ఇవికాక క్త్వార్థకక్రియకు ఇంకో విశేషమైన ప్రయోజనం ఉంది. మొదటి (ఉప) వాక్యంలో క్త్వార్థక క్రియ ఉన్నప్పుడు ప్రధానవాక్యం కాలగమన బోధకం కావచ్చు.

(95) సుజాత స్నానంచేసి వారం రోజులయింది.

*వారం రోజులు* రూపాన్నిబట్టి బహువచననామం అయినా ఇక్కడ ఏక వచన నామంగా - అంటే వారంరోజుల కాలంగా అన్వయించుకోవాలి. అందువల్ల చివరి క్రియ ఏకత్వ బోధకంగానే ఉంటుంది. *అయింది* బదులు *అవుతుంది* అని ప్రయోగించినా భూతకాలబోధకమే అవుతుంది. ఈ వాక్యంలో *వారంరోజులు* బదులు కాలపరిమాణాన్ని సూచించే ఏ నామాలైనా ఉపయోగించవచ్చు. మానార్థకం కాని *నిన్న*, *మొన్న* వంటి మాటల మాత్రం ప్రయోగార్హం కావు. ఈ పై వాక్యం ప్రధానార్థబోధలో ఈ కింది వాక్యానికి సమానం.

(96) సుజాత వారం రోజులకిందట స్నానం చేసింది.

పైన కాలపరిమాణాన్ని గురించి చెప్పిన నియమాలే ఈ వాక్యానికికూడా వర్తిసు.

(95), (96) వాక్యాలకున్న సంబంధాలు చాలాభాషల్లో సమానం. ఇట్లాంటి వాక్యాలు ఈ రకపు సంబంధాలతో అన్ని భాషల్లో ఉండవచ్చు.

(95) లో క్త్వార్థకానికి వ్యతిరేకరూపంకూడా ప్రయోగించవచ్చు. అప్పుడు వాక్యం ఇట్లా ఉంటుంది.

(97) సుజాత స్నానం చెయ్యక వారం రోజు లయింది.

(95) కి (97) కీ అర్థబోధలో భేదం ఉంది. (95)లో సుజాత వారంరోజుల కిందట స్నానంచేసినట్టు మాత్రమే తెలుస్తుంది. తరవాతకూడాచేసి ఉండవచ్చు.

చేసి ఉండకపోవచ్చు. (97) లో వారంరోజులపాటు స్నానంచెయ్యలేదని అర్థం. (97) ని (98) కి సమానార్థకంగా గ్రహించవచ్చు.

(98) సుజాత వారం రోజులనుంచీ స్నానం చెయ్యలేదు.

ఈ వాక్యాల్లో వ్యతిరేక క్త్వార్థకం అన్నిరకాల క్రియలతోనూ సాధ్యంకాదు. ఉదాహరణకు ఈ కింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

* (99) a అతను చనిపోక నెల రోజు లయింది.
b. అతనికి పెళ్ళికాక రెండేళ్లయింది.

* (100) a. అతను నెల రోజుల నుంచీ చనిపోలేదు.
b. అతనికి రెండేళ్ల నుంచీ పెళ్ళి కాలేదు.

పునఃపునస్సంభవ యోగంలేని వ్యాపారాలను బోధించేక్రియలవల్ల 99, 100 లలో వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలయినై. ఈ కారణంవల్లనే ఈ కింది వాక్యాలు కూడా వ్యాకరణ విరుద్ధాలు.

* (101) a. అతను విషం తాగక నెల రోజు లయింది.
b. అతనికి కలరా రాక రెండేళ్లయింది.

విషంతాగినా చనిపోకుండా ఉండి, విషంతాగటం కొన్ని రకాల వ్యాధులకు విరుగుడైతే (101) (a) వ్యాకరణ సమ్మతమవుతుంది. అట్లాగే కలరా అనేది ఇప్పుడున్నంత భయంకరమైన వ్యాధిగాకాక నేటి జలుబులాంటిది అయివుంటే అప్పుడు (101) (b) వ్యాకరణ సమ్మతమవుతుంది. (99) (b), (100) (b) లు కూడా ఒకవ్యక్తి అలవాటుగా ఎక్కువ పెళ్ళిళ్ళు చేసుకుంటుంటే వ్యాకరణ సమ్మత మవుతై. అంటే ఈ వాక్యాల వ్యాకరణసమ్మతి సామాజిక పరిస్థితులమీద ఆధారపడి ఉంటుందని గ్రహించవచ్చు.

**2.17 :** కొన్ని ప్రకృతిసిద్ధమైన సంఘటనలు క్త్వార్థక క్రియారూపంలో కాలార్థబోధలో ప్రయుక్తమవుతై.

(102) a. అతను పొద్దెక్కి నిద్ర లేస్తాడు.
b. ఆమె పొద్దుగూకి ఇంటికి వెళ్తుంది.
c. అతడు చీకటిబడి యింటికి వచ్చాడు.

ఈ కింది వాక్యాలు వ్యాకరణవిరుద్ధాలు.

* (103) a. అతను ఫ్యాక్టరీ కూత కూసి నిద్ర లేస్తాడు.
b ఆమె వాన కురిసి ఇంటికి వచ్చింది.
c. వాడు దీపాలుపెట్టి ఇంటికి వచ్చాడు.

(102) లో వాక్యాలు వ్యాకరణ సమ్మతాలయి (103) లో వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు కావటానికి కారణాలు ఈ విధంగా ఊహించవచ్చు. (102) లో వ్యాపారాలన్నీ ప్రకృతిసిద్ధాలు. అంతేకాక నియత సమయ ప్రవర్తితాలు (rhythmic). (103) (a), (b)లలో క్త్వార్థకక్రియలు నియత సమయ ప్రవర్తితాలైనా ప్రకృతిసిద్ధంకావు. (103) (b) లో ప్రకృతిసిద్ధమైనా నియతసమయ ప్రవర్తితం కాదు.

క్త్వార్థక క్రియాప్రయోగం ద్రావిడభాషల్లో విశేషమైనది. వీటిల్లో పూర్వవ్యాపార బోధకత, హేత్వర్థం. కాలగమన బోధకత ఆర్యభాషల్లో కూడాఉన్నై.

**2.2 : శత్రర్థకం :** క్త్వార్థక క్రియకున్న విశేష ప్రయోజనాలు శత్రర్థ క్రియకులేవు. ఏక కర్తృకంగా ఏకకాలంలో జరిగే వ్యాపారాలు బోధించటం శత్రర్థక క్రియల ప్రధాన ప్రయోజనం. క్త్వార్థకక్రియలాగే శత్రర్థక క్రియకూడా ప్రధాన క్రియకు రీతిబోధక విశేషణంగా ప్రవర్తిస్తుంది.

(104) a. సుజాత నవ్వుతూ మాట్లాడుతుంది.
b సుబ్బారావు ఏడుస్తూ పాఠం చెపుతాడు.

ఈ రకమైన రీతిబోధ అన్ని శత్రర్థ క్రియలకూ లేదు. ఉదాహరణకు,

(105) a. సుజాత మాట్లాడుతూ ఊరికే నవ్వుతుంది.
b. సుబ్బారావు పాఠం చెపుతూ నెత్తి గోక్కుంటాడు.

ఈ వాక్యాల్లోకూడా ఏక కర్తృనియమం గుప్త నిర్మాణ నియమంగా కనపడదు. ఉదాహరణకు ఈ వాక్యంలో క్రియలు గుప్త నిర్మాణంలో ఏక కర్తృకాలు కావు.

(106) ప్రభుత్వాలు ప్రజలచేత ఎన్నుకోబడుతూ ప్రజల్ని పీడిస్తున్నై.

స్థూలదృష్టితో శత్రర్థక ప్రధానక్రియలు ఏకకాలంలో జరుగుతున్నట్టు చెప్పినా ఇది నిజంకాదు. రెండు వ్యాపారాల నడుమ వ్యవధి లేనపుడు కూడా శత్రర్థక క్రియ ప్రయోగించబడుతుంది. (106) లో ఈ రకమైన అర్థాన్ని చూడవచ్చు. అట్లాగే ఈ కింది వాక్యంలో కూడా,

(107) సుబ్బారావు ఊరికి వెళ్తూ మా యింటికి వచ్చాడు.

ఇక్కడ 'వెళ్లబోతూ' అని అర్థం.

నియతసమయ ప్రవర్తితాలయిన ప్రకృతిలో మార్పుల్ని పురస్కరించుకుని చేసే కాలబోధలో క్త్వార్థకంలాగే శత్రర్థకం కూడా ప్రయుక్త మవుతుంది.

(108) a. అతను పొద్దు పొడుస్తూనే పొలం పనుల కెళతాడు.
b. చీకటి పడుతూనే ఇంటికొస్తాడు.

ఏవార్థ బోధక ప్రత్యయం లేకుండా ఈ వాక్యాలు ప్రయోగంలో లేవు.

**2.31 : చేదర్థకం :** ధాతువుకు తే అనే ప్రత్యయాన్ని చేరిస్తే చేదర్థక రూపం ఏర్పడుతుంది. కొన్ని మండలాల్లో ధాతువులో అంత్యమైన అచ్చులు ఈ ప్రత్యయం ముందు హ్రస్వ ఇ కారాలుగా మారతై. మారని క్రియారూపాలు కాకినాడ, విజయనగర ప్రాంతాలవైపు వినిపిస్తై. ప్రధానవాక్యంలో వ్యాపారం ఉపవాక్యాల వ్యాపారాలమీద ఆధారపడ్డట్టుగా చేదర్థక వాక్యాలలో భావించబడు తుంది. ఆధారదశంలో తే ప్రత్యయాంత క్రియారూపం ఉంటుంది. చేదర్థక రూపానికి వ్యతిరేకరూపం *అకపోతే* అనే రూపాన్ని చేర్చటంవల్ల ఏర్పడుతుంది. చేదర్థక క్రియ ఉన్నప్పుడు ప్రధానవాక్యంలో భవిష్యద్బోధక క్రియ ఉండటం సాధారణ స్థితి.

(109) a. వానలు కురిస్తే పంటలు పండుతై.
b. అడక్కపోతే అమ్మ అయినా పెట్టదు.
c. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా?

**2.32 :** ప్రధాన వాక్యంలో భూతకాలిక వ్యాపార సమాప్తిని సూచించే సమాపక క్రియ ఉన్నప్పుడు చేదర్థక క్రియ రెండు వ్యాపారాలను క్రమానుగతిని కాని, హేత్వర్థాన్ని కాని సూచిస్తుంది.

(110) a వాళ్లింటికి వెళితే సుజాత మంచి కాఫీ ఇచ్చింది.
b. సుబ్బారావు వస్తే సుజాత చివాట్లు పెట్టింది.

**2.33** : సంభావ్యమైన వ్యాపారాల మధ్యేకాని, సమాప్తి నందిన వ్యాపారాల మధ్య చేదర్థ బోధకత లేదని దీనివల్ల తెలుసుకోవచ్చు. భూతకాలంలో సంభావ్యమైన వ్యాపారాలమధ్య చేదర్థం (conditionality) బోధించాలంటే సమాప్తిని బోధించని క్రియారూపం ఉండాలి. అల్లాంటి క్రియ తెలుగులో లేనందువల్ల క్రియా జన్య విశేషణం మీద నిర్మించబడ్డ నామం ఉపయోగించ బడుతుంది. సంభావ్యమాన భూతకాల వ్యాపారాలతో చేదర్థకబోధ చేసేటప్పుడు *ఉండు* ధాతువును అను ప్రయుక్తం చేసినా అర్థంలో మార్పురాదు.

(111) a. జ్వరం తగ్గితే కాలేజికి వచ్చేవాడు.
b. జ్వరం తగ్గితే కాలేజికి వచ్చి ఉండేవాడు.
c. జ్వరం తగ్గి ఉంటే కాలేజికి వచ్చేవాడు.
d జ్వరం తగ్గి ఉంటే కాలేజికి వచ్చి ఉండేవాడు.

ఈ పైవాక్యాలన్నీ సమానార్థకాలు. వ్యతిరేక చేదర్థకానికి కూడా ఇట్లాంటి అవకాశమే ఉంది. ప్రధానవాక్యంలో ఆఖ్యాతానికి, నామానికి లాగే వ్యతిరేకరూపం ఉంటుంది ప్రధాన ఉపవాక్యాల రెండిట్లోనూ వ్యతిరేక క్రియ ఉంటే ఈ వ్యతిరేకార్థం వస్తుంది. (111) లో వాక్యాల్లో వ్యక్తమయిన రెండు వ్యాపారాలు జరలేదు. కేవల సంభావ్యాలు. జరిగినదానికి, సంభావ్యానికి వైరుధ్యం (111) వాక్యాల్లో గమనించవచ్చు. భవిష్యత్క్రియా వాక్యాల్లో ఇట్లాంటి వైరుధ్యం ఉండదు.

**2.34** : చేదర్థక క్రియ తరవాత కొన్ని ప్రత్యయాల్లాంటి అపదాలు ప్రయోగించవచ్చు. అప్పుడు ప్రధానక్రియ నామ్నీకృత మవుతుంది.

(112) a. జ్వరం తగ్గితేనా వాడు కాలేజికి వచ్చేది ?
b జ్వరం తగ్గితేకదా వాడు కాలేజికి వచ్చేది ?

ఒక అర్థంలో (112) లో వాక్యాలు (111) లో వాక్యాలకు సమానార్థకాలు. ''జ్వరం తగ్గలేదు. కాలేజికి రాలేదు'' అని. రెండోఅర్థంలో కేవల భవిష్యదర్థం ఈ భిన్నార్థబోధకతకి కారణం. (112) లో నామ్నీకృతమైన క్రియారూపం (111) లోని ప్రధాన వాక్యంలో క్రియ అయినా కావచ్చు. కేవల భవిష్యద్బోధక క్రియ అయినా కావచ్చు. (113) లో ఈ క్రమం చూపించబడుతుంది.

(113) a. జ్వరం తగ్గితే వాడు కాలేజికి వస్తాడు + ఆ ⟶
b. జ్వరం తగ్గితే + ఆ వాడు కాలేజి వస్తాడు ⟶
c. జ్వరం తగ్గితేనా వాడు కాలేజికి వచ్చేది ⟶
d. వాడు కాలేజికి వచ్చేది జ్వరం తగ్గితేనా ?

క్రియ నామ్నీకృతమైతే పదక్రమ వ్యత్యయం జరగటం సామాన్య వాక్యాల్లో గమనించాం. అదే ప్రక్రియ ఇక్కడకూడా (113) (d) లో చూడవచ్చు. (111) లో వాక్యాల్లో చివరిపదం నామ్నీకృత రూపంకాదు. అందువల్ల ఆ వాక్యాల్లో (113) (d) లాంటి పదక్రమ వ్యత్యయాన్ని సహించవు. ఉదాహరణకు ఈ కింది వాక్యం అవ్యవహితంగా ప్రయోగించినప్పుడు వ్యాకరణసమ్మతం కాదు.

* (114) వాడు కాలేజికి వచ్చేవాడు, జ్వరం తగ్గితే.

**2.35 :** ఇంతవరకూ చర్చించిన వాక్యాలతో ఒకే వాక్యంలో వ్యక్తమయిన రెండు విషయాల మధ్య వైరుధ్యం లేదు. చేదర్థకరూపం తరవాత తప్ప, కాని, అనే శబ్దాలను చేరిస్తే అట్లాంటి వైరుధ్యం ఏర్పడుతుంది. ఆ వైరుధ్యాన్ని ఈ వాక్యాలు సహించవు గనుక అప్పుడు ప్రధాన వాక్యంలో క్రియ వ్యతిరేక క్రియగా మారుతుంది.

(115) a. ఉత్పత్తి పెరిగితేకాని (తప్ప) ధరలుతగ్గవు.
b. ఎంతో బతిమిలాడితేగాని కిష్టప్ప అన్నం తినలేదు.

ప్రధానక్రియ వ్యాపార సమాప్తిని సూచిస్తే చేదర్థక క్రియకూడా వ్యాపారం జరిగినట్టుగానే సూచిస్తుంది. ప్రధాన వ్యాపారం సంభావ్యమానమైతే చేదర్థక క్రియ కూడా అదే సూచిస్తుంది. ఈ భేదం (115) a, b ల మధ్య చూడవచ్చు. ఈ వాక్యాల్లో వ్యతిరేకక్రియ వ్యతిరేకార్థం కాదు.

**2.36 :** చేదర్థక వాక్యంలో ఏక, భిన్న కర్తృకనియమం లేదు. అయినా ఏక కర్తృక మైనప్పుడు ప్రధానవాక్యంలో భవిష్యద్బోధక క్రియ ఉంటే వ్యాకరణ సమ్మతమవుతుంది. సమాప్తిని సూచించే భూతకాలిక క్రియ ఉంటే వ్యాకరణ విరుద్ధ మవుతుంది.

(116) a. సుజాత సినిమాకి వెళ్తే పల్లీలు తింటుంది.
* b. సుజాత సినిమాకి వెళ్తే పల్లీలు తిన్నది.

(116) లో (b) భిన్నకర్తృకమైతే వ్యాకరణ సమ్మత మవుతుంది. ప్రధాన వాక్యం ప్రశ్నార్థకమైనా వ్యాకరణ సమ్మతమవుతుంది. హేత్వర్థబోధ ఉన్నప్పుడు భూతకాలిక క్రియా యోగంలో చేదర్థక వాక్యాలు ఏక కర్తృకతను సహిస్తై.

(117) సుబ్బారావు కోడిగుడ్డు తింటే బలిశాడు.

హేత్వర్థ బోధలో క్త్వార్థక, చేదర్థక వాక్యాలకు సంబంధముంది. హేత్వర్థ బోధను కలిగించే నియమాలు రెంటికీ సమానం.

**2.37 :** క్రియారహిత వాక్యాలకు చేదర్థయోగంలో *అగు* ధాతురూపం చేరుతుంది.

(118) అతడు దిగంబర కవి అయితే బట్టలు వేసుకున్నాడేం ?

ఈ పై వాక్యంలో ప్రశ్నార్థక శబ్దం తీసేస్తే (116) (b) లాగా వ్యాకరణ విరుద్ధ మవుతుంది.

చేదర్థక క్రియఉన్న వాక్యాల్లో ప్రధాన వాక్యస్థానంలో కేవల ప్రశ్నార్థక శబ్దాలుకూడా వస్తై.

(119) a. ప్రజలకు తిండి లేకపోతే ఏం ?
b. అధికార్లకు సలాములు కొట్టకపోతే ఎట్లా ?
c. గుడ్డికన్ను మూస్తే ఎంత ? తెరిస్తే ఎంత ?

**2.38 :** క్రియాజన్య విశేషణం మీద **అట్టు** చేరిస్తే ఏర్పడ్డ నామానికి ***ఉంటే, అయితే*** అనే శబ్దాల్లో ఒకదాన్ని చేర్చి చేదర్థకాన్ని తయారు చేయవచ్చు. అట్లాంటి వాక్యాల్లో ప్రధాన వాక్యంలో క్రియ భూతకాలికం కాగూడదు.

(120) a. నువ్వు రేపు పొద్దున వచ్చేట్టుంటే డబ్బిస్తాను.
b. నువ్వు నిన్న సాయంకాలం వచ్చినట్టుంటే సినిమాకు వెళ్ళేవాళ్ళం.
* c. నువ్వు నిన్న సాయంకాలం వచ్చినట్టుంటే సినిమాకి వెళ్లాం.

పై వాక్యాల్లో (c) వ్యాకరణ విరుద్ధం.

**2.41 : అప్యర్థకం :** ధాతువుకు *ఇనా* అనే ప్రత్యయాన్ని చేర్చటంవల్ల, అప్యర్థక క్రియ ఏర్పడుతుంది. రెండు వాక్యాలకు మధ్య నిరనుబంధ బోధకత

ఉన్నప్పుడు మొదటి వాక్యంలో అప్యర్థక క్రియ ఉంటుంది. అందుకే ఒక్కోసారి రెండు వ్యాపారాల మధ్య వైరుధ్యం కూడా ఉంటుంది. అందువల్ల తరచుగా ఏవైనా ఒకక్రియలో వ్యతిరేక బోధకత కూడా ఉంటుంది.

(121) a. వాడికి చదివినా మార్కులు రాలేదు.

b. వాడికి చదివినా మార్కులు రావు.

ఈ పై వాక్యాల్లో అప్యర్థక క్రియకు బదులు చేదర్థక క్రియకు కూడా అనే శబ్దాన్ని చేర్చి వాడిన అర్థభేదం రాదు.

(122) a. వాడికి చదివితే కూడా మార్కులు రాలేదు.

b. వాడికి చదివి కూడా మార్కులు రావు.

**2.42 :** క్రియాజన్య విశేషణంతో తయారయిన నామం చేదర్థకంలోలాగే (చూ. వాక్యాలు 111.) ఇక్కడ కూడా ప్రధానాఖ్యాతంగా ప్రయోగించవచ్చు.

(123) a. వాడికి చదివినా మార్కులు వచ్చేవి కావు.

b. వాడికి చదవకపోయినా మార్కులు వచ్చేవి.

**2.43 :** ఈ అప్యర్థక వాక్యాల్లో ఒక్కోసారి భిన్నార్థాలు వస్తై.

(124) ఆయన డబ్బు తీసుకున్నా మార్కులు వేసేవాడు కాదు.

ఈ పై వాక్యానికి మూడు రకాల అర్థాలున్నై. అవి ఈ కింద సూచించబడుతున్నై.

(125) a. ఆయన డబ్బు తీసుకున్నా మార్కులు వేసే మనిషి కాదు.

b. ఆయన డబ్బు తీసుకునేవాడు కాని మార్కులు వెయ్యలేదు.

c. ఆయన డబ్బు తీసుకోలేదు, మార్కులు వెయ్యలేదు.

చివరి ఆఖ్యాతానికున్న భిన్నవ్యాకరణ ప్రవృత్తులవల్ల ఈ భేదం వచ్చింది. కేవల నామ ప్రవర్తనవల్ల (125a)లో అర్థం వచ్చింది. భూతకాలంలో అలవాటును సూచించే ఆఖ్యాతంగా ఈ రూపానికి ప్రవృత్తి ఉండటంవల్ల (125b)లో అర్థం వచ్చింది. అపిచేదర్థకాల్లో భూతకాల సంభావ్యమాన వ్యాపారాన్ని సూచించే ప్రవృత్తివల్ల (125c)లో అర్థం వచ్చింది. (123 a, b) లకి (125) a లో

సూచించిన అర్థం లాంటిది లేదు కాని b, c లలో సూచించిన అర్థాలకు తుల్యమైన అర్థాలున్నై.

**2.44 :** చేదర్థకంలో లాగే మిగతా అసమాపక క్రియా రూపాలన్నిటికీ *కాని* శబ్ద ప్రయోగం చెయ్యవచ్చు. కాని అప్యర్థంలో *కాని* శబ్ద ప్రయోగంవల్ల అర్థంలో మార్పుండదు.

(126) a ఉత్పత్తి పెరిగినా ధరలు తగ్గవు.
b. ఉత్పత్తి పెరిగినా కాని ధరలు తగ్గవు.

ఇంతకు పూర్వమే చెప్పినట్లుగా అప్యర్థక వాక్యాల్లో వ్యాపారాల మధ్య నిరనుబద్ధత (disjunction) వ్యక్తమవుతుంది. క్త్వార్థక, శత్రర్థక, చేదర్థకాది మిగతా వాక్యాల్లో వ్యాపారాల మధ్య సానుబద్ధత వ్యక్తమవుతుంది. అందువల్ల అక్కడ *కాని* శబ్దప్రయోగంవల్ల ఈ అనుబంధం దెబ్బ తింటుంది. తనకు పూర్వమున్న అసమాపక క్రియకు *కాని* శబ్దం వైరుధ్యాన్ని సమకూరుస్తుంది. అందువల్ల ఆ వాక్యాల్లో అసమాపక క్రియతో *కాని* శబ్దప్రయోగం సమాపక క్రియలో వ్యతిరేకతని కోరుతుంది. అసమాపక క్రియలోనే వ్యతిరేకత ఉంటే *కాని* శబ్దం ప్రయోగార్హం కాదు. అందువల్ల *కాని* శబ్దంతో ఉన్న ఈ కింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

* (127) a ఆతను అన్నం తినకగాని కాలేజికి వెళ్తాడు.
b ఉత్పత్తి పెరగకపోతేగాని ధరలు తగ్గుతై.

పై వాక్యాల్లో ప్రధానక్రియ వ్యతిరేకంలో ఉన్నాగాని తప్పేఅవుతై. దీన్ని బట్టి అప్యర్థక క్రియావాక్యాలు నిరనుబద్ధతను (disjunction),. అప్యర్థకేతర అసమాపక క్రియావాక్యాలు సానుబద్ధతను (conjunnction) వ్యక్తం చేస్తయ్యని తెలుస్తుంది.

**2.45** : *కాని, అయినా* అనే శబ్దాలకు శబ్దరీత్యా *అను* ధాతువుతో సంబంధముంది. మొదటిది వ్యతిరేక క్రియాజన్య విశేషణం. రెండోది అప్యర్థరూపం. ఈ రెండూ ఇతరత్రా కూడా నిరనుబద్ధతను బోధించ గలవు. *కలమయిన, పెన్సిలయిన ; కలంగాని, పెన్సిల్ గాని* అనే పదబంధాలు *కలమో, పెన్సిలో*

అనే పదబంధానికి నిరనుబంధ బోధలో సమానం. రెండు ప్రతిపాదిత విషయాల మధ్య వైరుధ్య మున్నట్టు భావించినప్పుడు కూడా ఈ శబ్దాల ప్రయోగం జరుగుతుంది. ఉదాహరణకు ఈ కింది వాక్యాలు చూడండి.

(128) a. మనది ప్రజాస్వామ్య దేశం. అయినా పౌరహక్కులు లేవు.
b. ఆయన చాలా గొప్ప పండితుడు. కాని కొద్దిగా కొసమెర్రి ఉంది.

**2.46 :** చేదర్థక క్రియకులాగే అప్యర్థక క్రియ తరవాత కూడా కొన్ని పదబంధాలు ప్రధాన వాక్యాల స్థానంలో వస్తై.

(129) a. గుడ్డికన్ను మూసినా ఒకటే, తెరచినా ఒకటే.
b. కవిత్వానికి ఛందస్సు లేకపోయినా ఫరవాలేదు.
c ఈ రోజుల్లో కష్టపడి చదివినా ప్రయోజనం లేదు.

**2.47 :** క్త్వార్థకాది అసమాపక క్రియా వాక్యాలు సానుబంధ బోధకాలనీ, అప్యర్థక వాక్యాలు నిరనుబంధ బోధకాలనీ, పూర్వం సూచించబడింది. ఈ అనుబంధ భేదాల్నిబట్టి క్త్వార్థక, శత్రర్థక, చేదర్థక భేదాలు ఏర్పడ్డై. క్త్వార్థకం వ్యాపార ఆనుపూర్విక సంబంధాన్ని, శత్రర్థకం సమసామయిక సంబంధాన్ని తెలియజేస్తై. ఆ రెంటికీ ఏకకర్తృకాద నియమాలు కొన్ని సమానంగా ఉన్నై. ఆ రెండూ ప్రధాన వ్యాపారానికి రీత్యర్థక విశేషణాలుగా ప్రవర్తించటం కూడా చూశాం. చేదర్థక అప్యర్థక భేదం వ్యాపారాధార నిరాధార భేదాన్నిబట్టి ఏర్పడింది, ఆర్థికంగా అప్యర్థక వాక్యాలను చేదర్థక వాక్యాలకు వ్యతిరేక సమ రూపాలుగా భావించవచ్చు. ఈ రెంటికీ కొన్ని సామ్యాలున్నై. భూతకాలిక సంభావ్యమాన వ్యాపారసూచక ఆఖ్యాత ప్రయోగం రెంటికీ సమానం. ఈ రెంటికీ ఏక కర్తృక నియమం లేదు.

**2.5 :** ఇవికాక వ్యాపారాలమధ్య కాలవ్యవధికత, అవ్యవధికత, హేతువు, మొదలైనవి ఉపవాక్యాల ద్వారా వ్యక్తమవుతై. ఉపవాక్యాల్లో అన్నంతక్రియ క్రియమీదగానీ, అక ప్రత్యయాంతావ్యయం మీదగానీ, ధాతుజవిశేషణం మీద గానీ కొన్ని ప్రత్యయాలకు, అవ్యయాలను చేర్చటంవల్ల ఈ అర్థాలు సాధ్యమవుతై.

(130) a. సుజాత నిద్ర లేవగానే కాఫీ తాగుతుంది.
b. సుజాత నిద్ర లేచిన వెంటనే కాఫీ తాగుతుంది.

c. సుబ్బారావు కాఫీ తాగకముందు సిగరెట్టు కాలుస్తాడు.
d. సుబ్బారావు కాఫీ తాగేముందు సిగరెట్టు కాలుస్తాడు.
e. సుబ్బారావు కాఫీ తాగేటప్పుడు సిగరెట్టు కాలుస్తాడు.
f సుబ్బారావు కాఫీ తాగిన తరవాత వక్కపొడి వేసుకుంటాడు.

ఈ పై వాక్యాల్లో రెండు వ్యాపారాల మధ్య ఉన్న కాల సంబంధం వ్యక్తమవుతున్నది.

ఈ వాక్యాలు ఏకకర్తృకాలు కావచ్చు, భిన్న కర్తృకాలు కావచ్చు. వాటిల్లో ఉపయోగించే ప్రత్యయాలు, అవ్యయాలు, క్రియారూపంతో కొన్ని విధినిషేధాలను బట్టి చేరతై. ఉదాహరణకు, *తాగినముందు*, *తాగుతున్నముందు*, ***తాగనిముందు***, *తాగే వెంటనే*, *తాగని వెంటనే*, *తాగే తరవాత*, ***తాగని తరవాత*** మొదలైన రూపాలు లేవు.

**2.61 :** అన్నంత క్రియ *బట్టి* ( < *పట్టి* ) శబ్దాన్ని ప్రయోగించి హేత్వర్థంలో ఉపవాక్యంగా వాడవచ్చు. క్రియారహిత వాక్యాలకు *అగు* ధాతువు అన్నంత రూపమైన *కా* అనుబంధించబడుతుంది.

(131) a. అతను కాపీ కొట్టబట్టి ప్యాసయ్యాడు.
b. ఆయన పెద్దవాడు *గా*బట్టి ఏం చేసిన చెల్లుతుంది.

**2.62 :** *బట్టి* తో వ్యతిరేక క్రియారూపాలు లేవు, ఈ అసమాపక క్రియకు వ్యతిరేక రూపం *అక* ప్రత్యయాంత రూపం మీద *పోబట్టి* చేర్చటంవల్ల ఏర్పడుతుంది.

(132) a. మీరు సమయానికి రాకపోబట్టి పనికాలేదు.
b. మొగుడు ప్రయోజకుడు కాకపోబట్టి భార్య ఉద్యోగం చేయాల్సి వచ్చింది.

**2.63 :** **బట్టి తో** ఉన్న వాక్యాల్లో అన్నిరకాల ప్రధాన వాక్యాలు ఉండవు. ఉదాహరణ విధి, ప్రశ్నలు ప్రధాన వాక్యాలుగా ఈ కింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

(133) * a. మీరు సమయానికి రాబట్టి తినండి.
* b. మీరు నమ్మకంగా చెయ్యబట్టి ఏం సాధించారు ?

పై వాక్యాల్లో * a లో 'వచ్చారు కాబట్టి' అని, b లో చేశారు కాఇట్టి అని వాడితే వ్యాకరణ సమ్మతాలవుతై. హేత్వర్థాన్ని సూచించే ఈ *బట్టి* క్రియ వ్యాపార పరిసమాప్తిని, సహజస్థితిని మాత్రమే సూచించగలదు. సంభావ్యమాన వ్యాపారాన్ని సూచించలేదు. అట్టాంటి వాక్యాలను *కాబట్టి* తోనే అనుసంధించాలి.

(134) మీ ఆవిడ రేపు వస్తుంది కాబట్టి మీకు దిగులు లేదు.

**2.64 :** రెండు వాక్యాలమధ్య హేతుసంబంధం ఉన్నప్పుడు ప్రధాన వ్యాపారాన్ని సూచించే వాక్యం *కాబట్టి* తో మొదలుకావచ్చు. అట్లాంటి రెండు వాక్యాలను కలిపినప్పుడు పూర్వక్రియతో అనుసంధించిన *కాబట్టి* వికల్పంగా అన్నంత క్రియమీద *బట్టి* తో అసమాపక క్రియగా ఏర్పడుతుందని సూచించుకోవచ్చు. పైన సూచించిన విధినిషేధాలననుసరించి అట్లాంటి రూపాలు సాధించుకోవచ్చు.

**2.65 :** ప్రధానవాక్యం కాలగమనాన్ని సూచించేదయినప్పుడు ఈ బట్టి క్రియ వ్యాపార పర్యంతార్థాన్ని సూచిస్తుంది.

(135) a. మీరు సిగరెట్లు కాల్చబట్టి ఎన్నాళ్లయింది ?
b. ఆమె మెడిసిన్ చదవబట్టి పదేళ్లవుతున్నది.

అర్థబోధలో (135) లో వాక్యాలు (136) వాక్యాలతో సమానార్థకాలు.

(136) a. మీరు ఎన్నాళ్లనుంచి సిగరెట్లు కాలుస్తున్నారు.
b. ఆమె పదేళ్లనుంచి మెడిసిన్ చదువుతున్నది.

(135) (136) లతో సూచించిన వాక్యాల సంబంధం క్త్వార్థకవాక్యాల విషయంలో (చూ. 2.16) సూచించిన సంబంధం లాంటిది. అయితే ఒక భేదం ఉంది. అవు క్రియతోనూ, *కిందట* అనే అవ్యయంతోనూ మానార్థక కాలబోధక నామం మాత్రమే రాగలదు. కాని *నుంచి* అనే ప్రత్యయంతో అట్లాంటి నియమం వర్తిస్తున్నట్టు లేదు.

(137) * a. అతను నిన్న కిందట సిగరెట్లు కాల్చాడు.

b. అతను నిన్నటి నుంచి సిగరెట్లు కాలుస్తున్నాడు.

* c. అతను సిగరెట్లు కాల్చబట్టి నిన్న అవుతున్నది.

అయితే (136) వాక్యాల్లోకూడా *బట్టి* వాడవచ్చు. అప్పుడు *కిందట* అనే శబ్దానికి వర్తించిన నియమాలే వర్తిస్తై. ఉదాహరణకు—

(138) * b. అతను నిన్నబట్టి నాతో మాట్లాడటం లేదు.

* b. అతను నాతో మాటాడక పోబట్టి నిన్న అయింది.

అయితే *నుంచి* కి *బట్టి* కి ఇంకా పూర్తిగా దొరకని అర్థభేదంకూడా ఏమన్నా ఉండొచ్చు. (136) వాక్యాలలో క్రియ వ్యాపార అపరిసమాప్తిని సూచిస్తున్నది. అందువల్ల ఆ వాక్యాల్లోగాని, *బట్టి*-వాక్యాల్లోగాని, పునఃపున స్సంభవయోగంలేని వ్యాపారాలనుబోధించే క్రియలు రావు. అట్లాంటి క్రియలుండటం వల్ల ఈ కింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

* (139) a. ఆ ముసలాయన పదేళ్ల నుంచీ చనిపోతున్నాడు.

b. ఆ ముసలాయన పదేళ్ళు బట్టి చనిపోతున్నాడు.

c. ఆముసలాయన చనిపోబట్టి పదేళ్లవుతున్నది.

వ్యతిరేక క్త్వార్థక ప్రయోగానికి ఇట్లాంటి నియమమే ఉన్నట్టు ఇంతకు ముందు గుర్తించాం. అందువల్ల *అకపోబట్టి*తో నిర్మించిన వ్యతిరేకరూపానికి, వ్యతిరేక క్త్వార్థకానికీ ఈ కాలగమన ప్రయోగంలో భేదం లేదు.

(140) a. నేను ఐస్‌క్రీం తినకపోబట్టి రెండేండ్లు అయింది.

b. నేను ఐస్‌క్రీం తినక రెండేళ్లయింది.

**2.65 :** క్త్వార్థక, వ్యతిరేకక్త్వార్థక ప్రయోగంవల్ల హేత్వర్థం రావటం గుర్తించాం. *బట్టి* ప్రయోగంవల్లకూడా హేత్వర్థం వస్తుంది. అందువల్ల ఈ వాక్యాలన్నీ తుల్యార్థకాలవుతై. కాని ఏకార్థకాలయినట్లు కనబడదు. ఈ కింది వాక్యాలకు పోల్చిచూడండి.

(141) a. సుబ్బారావు కోడిగుడ్లు తిని బలిశాడు.

b. సుబ్బారావు కోడిగుడ్లు తినబట్టి బలిశాడు.

c. కిష్టప్ప అన్నం తినక చిక్కిపోయాడు.

d. కిష్టప్ప అన్నం తినక పోబట్టి చిక్కిపోయాడు.

పై వాక్యాలలో a, c లలో లేని హేతుప్రాధాన్యం b, d లలో ఉన్నట్టు కనిపిస్తున్నది ఇంకా ఇతరభేదాలుకూడా ఉండొచ్చు.

**2.70 : నామ్నీకరణాలు :** ఒక వాక్యాన్ని మరో వాక్యంలో నామపదం స్థానంలో ప్రయోగించినప్పుడు కొన్ని మార్పులు జరుగుతై. ఆ మార్పుల్ని నామ్నీకరణ విధానం అంటారు.

**2.71 : విభక్త్యర్థనామ్నీకరణం :** ఒక సామాన్య వాక్యంలో క్రియకు పూర్వం నామపదాలు భిన్నకారకార్థాలను సూచిస్తై. అవి విభక్తి ప్రత్యయాలద్వారా వ్యక్తమవుతై. ఆ నామాల్లో దేనినైనా ఉద్దేశ్యంచేసి మిగతా వాక్య భాగాన్ని విధేయం చేసేపద్ధతి విభక్త్యర్థ నామ్నీకరణం. ఈ ప్రక్రియలో ఉద్దేశ్యం చెయ్యబడిన పదబంధం క్రియకు పరస్థానానికి జరుగుతుంది. అప్పుడు క్రియ విశేషణంరూపంగా మారుతుంది. దాన్నే క్రియాజన్యవిశేషణమని ప్రాచీనులు వ్యవహరించారు. క్రియానంతర స్థానానికి జరిగిన పదబంధంలో ఉన్న విభక్తి ప్రత్యయం ఈ ప్రక్రియలో లోపిస్తుంది. అయినా విభక్త్యర్థాన్ని గ్రహించగలుగుతాం. ఈ రకంగా నిష్పాదించిన నామబంధాన్ని ఇంకో వాక్యంలో నామంగా ప్రయోగించవచ్చు. ఈ కింది ఉదాహరణలు గమనిస్తే పై విషయాలు స్పష్టమవుతై.

(142) సుజాత తెడ్డుతో భర్తను కొట్టింది ⟶
? a. సుజాత తెడ్డుతో కొట్టిన భర్త.
b. సుజాత భర్తను కొట్టిన తెడ్డు.
c. భర్తను తెడ్డుతో కొట్టిన సుజాత.

పైన నిష్పన్నంచేసిన నామబంధాల్లో క్రమంగా భర్త, తెడ్డు, సుజాత అనే నామాలు ఉద్దేశ్యాలు. వీటికి మూలవాక్యంలో ఉన్న విభక్తులు లోపించినా వాటి కారకార్థాలకు లోపం కలగలేదు. అదే ఈ ప్రక్రియలో ఉన్న విశేషం.

పై నామబంధాల్లో (a) ఆధునికసమాజంలో వ్యాకరణ సమ్మతంకాదు. అందుక్కారణం ఈనాటి సమాజంలో చట్టబద్ధమైన బహుభర్తృకాచారం లేక పోవటం. అట్లాంటి సమాజంలో ఇది వ్యాకరణ సమ్మతమే. వ్యాకరణ సమ్మతికి సామాజికమైన అలవాట్లకు, వ్యక్తిగతమైన నమ్మకాలకు ప్రమేయం ఉంటుందని కూడా ఈ ఉదాహరణ నిరూపిస్తుంది. బహుత్వబోధకవకాశంలేని నామం ఈ

ప్రక్రియలో ఉద్దేశ్యంగా ఉండటానికి అర్హంకాదనేది ఇక్కడ గ్రహించాల్సిన వ్యాకరణ విశేషం.

వాక్యంలో ఉద్దేశ్యంగా జరిగేది కేవలనామపదంకాదని, విశేషణాదికాలతో కూడిన నామబంధం అనీ ఈ కింది ఉదాహరణనుచూస్తే తెలుస్తుంది.

(143) సుజాత మద్రాసులో (ఒక) జరీ అంచు పచ్చపట్టు చీరకొన్నది.
⟶ సుజాత మద్రాసులో కొన్న జరీ అంచు పచ్చపట్టు చీర.

ఇట్లాంటి నిష్పన్న నామాలు భిన్నార్థకబోధకాలవుతై. పై వాక్యానికి రెండర్థాలున్నై. (1) సుజాత *ఒక* పట్టుచీరకొన్నది. అది కొన్నది మద్రాసులో (2) సుజాత కొన్ని పట్టుచీరలుకొన్నది. అందులో ఒకటి మద్రాసులో కొన్నది. (మిగతావి కంజీవరంలోనో, ధర్మవరంలోనో మరెక్కడో కొని ఉండవచ్చు.)

మూల వాక్యంలో కర్తృపదంకాని, కర్మపదంగాని ఏ అడ్డంకులు లేకుండా ఈ నామ్నీకరణలో ఉద్దేశ్యాలుకావచ్చు. కాని మిగతా విభక్తులలో అన్నిటికీ ఇట్లాంటి అవకాశం లేదు.

**2 711** : **తో** అనే విభక్తి తెలుగులో బహుళార్థాల్లో ప్రయుక్తమవుతుంది. వాటిల్లో ప్రధానమైనది కరణార్థం. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యం. కాని ఇతరార్థాల్లో సాధ్యం కాదు.

(144) a. సుజాత కలంతో పరీక్ష రాసింది.
⟶ సుజాత పరీక్ష రాసిన కలం.
b. సుజాత శ్రద్ధతో పరీక్ష రాసింది.
⟶ * సుజాత పరీక్షరాసిన శ్రద్ధ.
c. సుజాత జ్వరంతో పరీక్షరాసింది
⟶ * సుజాత పరీక్షరాసిన జ్వరం.

పై వాక్యాల్లో **తో** (a) లో కరణార్థంలోనూ, (b) లో రీత్యర్థంలోనూ, (c)లో కర్తృదేహస్థితి బోధకంగాను ఉపయోగించబడింది. కరణేతరార్థాల్లో నామ్నీకరణం నిరాకృతమయింది.

**తో** వచ్యర్థధాతువుల అముఖ్య కర్మతోనూ, మూల పదార్థార్థంలోనూ, స్థితి హేతుకంగాను, ప్రతిక్రియాపేక్షక క్రియాప్రయోగంలో కర్మపదంతోనూ, సహార్థంలోను ప్రయుక్తమవుతుంది. వీటిల్లో కొన్నిటితో మాత్రమే నామ్నీకరణం సాధ్యమవుతుంది.

(145) a. నేను ఆ అమ్మాయితో ఒక రహస్యం చెప్పాను.

→ నేను రహస్యం చెప్పిన అమ్మాయి.

( * నేను చెప్పిన అమ్మాయి)

b. ఈ బల్ల కట్టెతో చేశారు.

→ ఈ బల్ల చేసిన కట్టె.

c. సుజాత తలనొప్పితో బాధపడుతున్నది.

→ ? సుజాత బాధపడుతున్న తల నొప్పి.

d. సుజాత పనిమనిషితో పోట్లాడుతుంది.

→ సుజాత పోట్లాడే పనిమనిషి.

e. సుజాత స్నేహితులతో క్లబ్బుకి వెళ్లింది.

→ * సుజాత క్లబ్బుకి వెళ్లిన స్నేహితులు.

(145) (a) లో చెప్పు అనే క్రియతో అమ్మాయి అనే నామం ముఖ్య కర్మగానూ, అముఖ్యకర్మగాను రావచ్చు (ముఖ్యకర్మ : ఆ **అమ్మాయిని** గురించి నీకు చెప్పాను.) నిష్పన్న నామబంధంలో ముఖ్యకర్మను బోధించే నామంలేకపోతే ఉన్ననామమే ముఖ్యకర్మస్థానాన్ని ఆక్రమిస్తుంది. అందులో (145) (a) లో బ్రాకెట్లలో సూచించిన నామబంధం ఉద్దేశించిన అర్థాన్ని బోధించదు. (c) లో **తో** అనుభోక్తృ దేహస్థితి హేతువును సూచిస్తుంది. తలనొప్పులలో రకరకాలను భావించి నప్పుడు (c) లో నిష్పన్నమైన నామం వ్యాకరణ సమ్మతమవుతుంది. (e) లో సహార్థంలో **తో** ప్రయుక్తమయింది. ఈ అర్థంలో నామ్నీకరణ సాధ్యంకాదు.

**2.712 :** కు విభక్తికూడా తెలుగులో బహుళార్థాల్లో ప్రయుక్తమవుతుంది. దానార్థక క్రియలతోను, వచ్యర్థక క్రియలతో అముఖ్యకర్మబోధకంగా, గమనార్థక క్రియలతో గమ్యసూచకంగానూ, అస్త్యర్థకక్రియతో స్వామ్యార్థంలోను, దేహమనఃస్థితి బోధకంగానూ, బాంధవ్యార్థంలోను, దేహమనఃస్థితులకు హేతు

బోధలోనూ, కాలార్థంలోనూ–ఇట్లా రకరకాల అర్థాల్లో ఈ విభక్తి ప్రయుక్త మవుతుంది, అముఖ్యకర్మ, గమ్య, స్వామ్యార్థాల్లో నామ్నీకరణసాధ్యం. ఈ కింది ఉదాహరణల్లో స్పష్టమవుతుంది.

(146) a. సుజాత బ్రాహ్మడికి ఆవును దాన మిచ్చింది.
→ సుజాత ఆవును దానమిచ్చిన బ్రాహ్మడు.

b. సుజాత ఊరికి వెళ్ళింది.
→ సుజాత వెళ్లిన వూరు.

c. వాళ్ళకు రెండు ఇళ్ళున్నై.
→ వాళ్ల కున్న రెండు ఇళ్ళు.

d. నేను వాళ్లకు తెలుసు.
→ నేను తెలిసిన వాళ్ళు.

ఈ కిందివి వ్యాకరణ విరుద్ధాలు.

(147) a. అతను చలికి వణుకుతున్నాడు.
→ ? అతను వణుకుతున్న చలి.

b. రూపాయికి నాలుగు పండ్లు ఇస్తారు.
→ * నాలుగు పండ్లిచ్చే రూపాయి.

కొన్ని నామ్నీ కరణాలు విశేషనామానికి బదులు సామాన్యనామాన్ని కోరతై.

(148) a. అతను ఎల్లుండి వస్తాడు.
→ * a. అతను వచ్చే ఎల్లుండి.
b. అతను వచ్చే రోజు.

b. ఆమె పది గంటలకి వస్తుంది.
→ * a. ఆమె వచ్చే పది గంటలు.
b. ఆమె వచ్చే టైము.

c. పక్కింటామె పంచదారకు వచ్చింది.
→ * a. పక్కింటామె వచ్చిన పంచదార
b. పక్కింటామె వచ్చిన పని.

d ప్రసాదు మద్రాసు వెళ్ళాడు

→ * a. ప్రసాదు వెళ్ళిన మద్రాసు.

b. ప్రసాదు వెళ్ళిన వూరు.

స్వామ్యార్థంలో నిష్పన్నమైన నామంలో ఉన్న కు బదులు వికల్పంగా *గల* శబ్దం ఆదేశమవుతుంది.

(149) a. డబ్బున్న వాళ్లు → డబ్బుగల వాళ్ళు.

b పిల్లలున్న వాళ్ళు → పిల్లలు గలవాళ్ళు.

c. తెలివున్నవాడు → తెలివిగల వాడు.

**2 713** : గురించి అనే విభక్తి నేటి భాషలో కర్మార్థంలోను, ప్రయోజనార్థంలోను ఉపయోగిస్తారు. కర్మార్థంలోనే నామ్నీకరణం సాధ్యం.

(150) a. నేను సుజాతను గురించి చెప్పాను.

→ నేను చెప్పిన సుజాత.

b. అతను డబ్బు గురించి వచ్చాడు

→ * అతను వచ్చిన డబ్బు.

**2.714** : నుంచి అనే విభక్తి వ్యాపారాదిని సూచిస్తుంది. ఆ అర్థంలో నామ్నీకరణం సాధ్యంకాదు.

(151) అతను కాలేజి నుంచి ఇంటికి వచ్చాడు

→ * అతను ఇంటికి వచ్చిన కాలేజి.

కాని *నుంచి* తో ఉన్న ఈ కింది వాక్యాలనుంచి నామ్నీకరణం సాధ్యమయింది.

(152) a. అత్తగారు బావినుంచి నీళ్ళు తెచ్చింది

→ అత్తగారు నీళ్ళు తెచ్చిన బావి.

b. మా ఆవిడ మార్కెట్ నుంచి అరటి పండ్లు తెచ్చింది

→ మా ఆవిడ అరటిపండ్లు తెచ్చిన మార్కెట్

c. సుజాత చెట్టునుంచి పువ్వులు కోసింది

→ సుజాత పువ్వులు కోసిన చెట్టు.

ఈ పై వాక్యాల్లో *నుంచి* కి బదులు (a) లో *లోనుంచి*, (b) లో *దగ్గరనుంచి*, (c) లో *మీదనుంచి* అని వికల్పంగా ప్రయోగించవచ్చు. అంటే (151) లో లేని అధికరణార్థం (152) లో ఉంది. (152) లో *నుంచి* కర్మపదం యొక్క ఆధార పదాన్ని సూచిస్తున్నది. ఈ అర్థంలో మాత్రమే *నుంచి* తో నామ్నీకరణం సాధ్యమయింది.

ఒక తెలుగు సినిమాలో *దిగివచ్చిన దేవలోకానికే తిరిగి వెళ్ళింది.* అనే డైలాగు ఉంది. *దిగివచ్చిన దేవలోకం* అనే నామబంధానికి మూలవాక్యం *ఆమె దేవలోకంనుంచి దిగి వచ్చింది*, అనేదే అయిఉండాలి. ఇక్కడకూడా *నుంచి* కి *లోనుంచి* అనేఅర్థం చెప్పుకోవచ్చు.

సి. విజయలక్ష్మి రచించిన కారుచీకటికి కాంతిరేఖ అనే పుస్తకంలో *శవం వెళ్ళిన ఇల్లులా* అనే ప్రయోగం ఉంది. దీనికి మూల వాక్యం *ఇంటినుంచి శవం వెళ్లింది* అనే అయి ఉండాలి. ఇక్కడ కూడా నుంచికి *లోనుంచి* అనే అర్థం చెప్పుకోవాలి. దాశరథి రంగాచార్యులుగారి ***మాయజలతారు*** అనే నవలలో *పీనుగు వెళ్లిపోయిన ఇల్లులా* అనే ప్రయోగానికీ ఇట్లాంటి వివరణే ఇయ్యాల్సి ఉంటుంది. దీన్నిబట్టి అధికరణార్థబోధ ఉన్న *నుంచి* తో నామ్నీకరణం జరుగుతుందని తెలుసుకోవచ్చు.

**2.715 :** *లో*, *మీద* అనే విభక్తులు అధికరణార్థాన్ని సూచిస్తై. ఈ అర్థాల్లో నామ్నీకరణ సాధ్యం.

(153) a. మా ఆవిడ భరిణెలో డబ్బు దాచి పెడుతుంది.
→ మా ఆవిడ డబ్బు దాచిపెట్టే భరిణె.

b. మా ఆవిడ పరుపు కింద డబ్బు దాచిపెడుతుంది.
→ * మా ఆవిడ డబ్బు దాచిపెట్టే పరుపు

c. చింతచెట్టు మీద చిలక కూర్చున్నది.
→ చిలక కూర్చున్న చింత చెట్టు.

d. చింత చెట్టు కింద చిలక కూర్చున్నది.
→ * చిలక కూర్చున్న చింతచెట్టు.

పైన ఉదాహరించిన వాటిలో (b), (d) లలో నిష్పన్నమైన నామబంధాలు

మూల వాక్యార్థాల్ని వ్యక్తం చెయ్యలేక పోతున్నై. (a), (c) లో వ్యక్తం చెయ్య గలుగుతున్నై. ఇందుక్కారణం *లో*, *మీద* అనేవి సామాన్య (Unmarked) అధికరణాన్ని బోధిస్తై. అంతేకాక ఇవి ఆధారాధేయాల సంశ్లేషను కూడా సూచిస్తై. ఆధారాధేయాల సంశ్లేషబోధ ఉన్న విభక్తులతోనే అధికరణలో నామ్నీకరణం సాధ్యమవుతుందని సూత్రించుకోవచ్చు.

*లో*, *మీద* వైషయికాధికరణలో కూడా ప్రయుక్తమవుతై. ఆ అర్థాల్లోను నామ్నీకరణం సాధ్యమవుతుంది

(154) a. మంత్రిగారికి సాహిత్యంలో ప్రవేశం ఉంది.
→ మంత్రిగారి ప్రవేశము ఉన్న సాహిత్యం.
b. సుజాతకు నైలెక్సు చీరల మీద మోజు ఉన్నది.
→ సుజాతకు మోజున్న నైలెక్సు చీరలు.

కాలార్థంలో *లో* ప్రయోగించినప్పుడు నిష్పన్న నామబంధంలో విశేష నామానికి బదులు సామాన్యనామం వస్తుంది.

(155) మాకు 1959 లో పెళ్లి అయింది
→ మాకు పెళ్లి అయిన సంవత్సరం.
* మాకు పెళ్లి అయిన 1959.

**2 716** : ఈ విభక్త్యర్థక నామ్నీకరణంలో గమనించాల్సిన విశేషం ఇంకోటి ఉంది. నేను తిన్న అన్నం అనే నామబంధంలో కర్తృబోధక శబ్దాన్ని తీసేసి *తిన్న అన్నం* అన్నా *తిను* అనే క్రియకు, *అన్నం* అనే నామానికి ఉన్న వ్యాకరణ సంబంధాల్లో మార్పురాదు.

*నేను చంపిన పులి* అనే నామబంధంలో *పులి చంపు* అనే క్రియకు కర్మ. అందులో నుంచి *నేను* శబ్దాన్ని తొలగించి, *చంపిన పులి* అంటే *పులి* అనే శబ్దాన్ని కర్మగా కాక కర్తగా అర్థం చేసుకుంటాం.

అట్లాగే నేను *డబ్బుపెట్టిన* పెట్టె అనే నామబంధంలో పెట్టె అనే నామం పెట్టు అనే క్రియతో అధికరణ కారక సంబంధంలో ఉంది. *డబ్బు* అనే పదం తీసేసి నేను *పెట్టిన* పెట్టె అంటే పెట్టెను కర్మకారకంగా అర్థం చేసుకుంటాం.

దీన్నిబట్టి అధికరణ, కర్మ, కర్తృ కారకాల్లో ఉత్తరోత్తరం బలీయమని తెలుస్తుంది. ఒక నామ పదానికి క్రియతో ఒకటికన్నా ఎక్కువ కారక సంబంధాలుండే అవకాశం ఉన్నప్పుడు పూర్వకారక బోధక పదాభావంలో ఉత్తరోత్తర కారకార్థానికే ప్రాధాన్య మెక్కువని గ్రహించవచ్చు. భిన్నకారక సంబంధాలుండే పదాలు దొరికినప్పుడు మిగతా కారకాలకు కూడా ఈ అంతరువుల్లో స్థిరస్థానం కలిగించ వచ్చు.

**2.717 :** సమాసాలనుకూడా ఈ విధమైన నామ్నీకరణాల నుంచి నిష్పన్నం చెయ్యవచ్చు. ఉదాహరణకు : *మాకు ఇల్లుంది* ⟶ *మాకున్న ఇల్లు* ⟶ *మా ఇల్లు*. కాని సమాసాల్లో క్రియ లోపించటం వల్ల బహుళార్థ బోధకాలవుతై. ఉదాహరణకు *ప్రభుత్వ కవులు* అనే సమాసానికి ''ప్రభుత్వంలో ఉద్యోగం చేసే కవులు'', ''ప్రభుత్వం పోషించే కవులు'', ''ప్రభుత్వం కోసం రాసే కవులు'', ''ప్రభుత్వం అభిమానించే కవులు'' ఇట్లా చాలా అర్థాలు రావచ్చు. ఈ అర్థాలు అప్పటి సామాజికుల అలవాట్లనుబట్టి ఉంటై. సమాజంలో వచ్చే మార్పుల్ని బట్టి సమాసాల అర్థాలుంటై. ఉదాహరణకు నేడు వాడుకలో ఉన్న *వంటింటి పత్రికలు*, *రేడియో కవులు*, *రేడియో నాటికలు*, *పండగ కవులు*, *విప్లవకవులు* ఇట్లాంటివే. పండగల ప్రత్యేక సంచికలకు కవిత్వం రాసేకవులు అనే అర్థంలో ఇటీవల సాహిత్య విమర్శలో *పండగ కవులు* అనే సమాసం వాడుకలో ఉంది. 'విప్లవ కవిత్వం రాసే కవులు' అనే అర్థంలో *విప్లవ కవులు* అనే సమాసం వాడుకలో ఉంది. ఈ సమాసాలను వ్యాకరణ ప్రక్రియద్వారా వాక్యం నుంచి నిష్పన్నం చెయ్యటం కష్టం.

**2.718 :** విభక్త్యర్థక నామ్నీ కరణంలో అన్ని రకాల అర్థాలలో నామ్నీ కరణం సాధ్యం కాదని తెలుసుకున్నాం. ఇదే పనిని చాలా అర్థాల్లో చేసే వ్యాకరణ ప్రక్రియ యత్తదర్థక వాక్యప్రయోగం. విభక్త్యర్థక నామ్నీకరణం ద్రావిడ భాషల్లో ప్రచురం, ఆర్యభాషల్లో విరళం, (ఒరియా, బెంగాలీ భాషల్లో విభక్త్యర్థక నామ్నీకరణం విస్తారంగానే ఉంది.) ఆర్యభాషల్లో యత్తదర్థక వాక్య ప్రయోగం అధికం. ఈ కింది వాక్యాల్లో యత్తదర్థక ప్రక్రియను చూడవచ్చు.

(156) a. నేను ఒక అమ్మాయితో సినిమాకు వెళ్లాను.

⟶ నేను ఏ అమ్మాయితో సినిమాకు వెళ్లానో ఆ అమ్మాయి.

b అతను కాలేజినుంచి ఇంటికి వచ్చాడు.

→ అతను ఏ కాలేజి నుంచి ఇంటికి వచ్చాడో ఆ కాలేజీ.

ఉద్దేశ్యంగా చేసిన నామానికి ముందు తదర్థబోధక శబ్దం, విధేయంగా మారిన భాగానికి మొదట యదర్థక బోధక శబ్దం చేరి ఓ అనే శబ్దంతో అనుసంధించ బడటం ఇక్కడ జరిగే ప్రక్రియ.

యత్తదర్థ బోధక వాక్యాల ప్రణాళిక విభక్త్యర్థ నామ్నీకరణం కన్నా విపులమైనా, వీటిల్లోనూ కొన్ని విధి నిషేధాలున్నై. ఉదాహరణకు

* (157) a. "సుజాత ఏ జ్వరంతో పరీక్ష రాసిందో ఆ జ్వరం"
b. "సుజాత ఏ శ్రద్ధతో పరీక్ష రాసిందో ఆ శ్రద్ధ".
c. "సుజాత ఏ భర్తను తెడ్డుతో కొట్టిందో ఆ భర్త".
d. "పక్కింటామె ఏ పంచదారకు వచ్చిందో ఆ పంచదార".

ఇట్లాంటి నామబంధాలు ఈ ప్రక్రియలో అయినా వ్యాకరణ సమ్మతాలు కావు.

ద్రావిడ భాషల్లో విభక్త్యర్థక నామ్నీకరణల్లో నయినా, యత్తదర్థ వాక్యాల్లో నయినా విధేయ, ఉద్దేశ్యాల క్రమం నియతం, స్థిరం. నామానికి వచ్చే విశేషణాలు సిద్ధాలయినా, వాక్య నిష్పన్నాలయినా, నామ పదానికి పూర్వమే వస్తై. క్రియాంత భాషల్లో ఇట్లాగే వస్తై.

**2.72 : భావార్థక నామ్నీ కరణాలు :** క్రియలు వ్యాపారాలను (processes), స్థితులను (states), చర్యలను (actions) సంఘటనలను (events) తెలియజేస్తై. ధాతువుకు భావార్థంలో - *అటం* (కొందరి వ్యవహారంలో *అడం*) అనే ప్రత్యయం చేరుతుంది. ఇట్లా తయారయిన నామం ఇంకో వాక్యంలో ఆయా అర్థాల్లో ప్రయుక్తమయింది.

**2.721 :** వ్యాపారార్థక నామంగా ప్రవర్తించినప్పుడు కొన్ని క్రియలకు కర్తగానూ, ప్రాణివాచకకర్త అవసరమైన క్రియలతో కర్మగానూ ప్రవర్తిస్తుంది. ముఖ్యంగా వ్యాపారాదిని, అంతాన్ని సూచించే క్రియలతో ఈ నామం ప్రయుక్తమవుతుంది.

(158) a. వాన కురవటం మొదలయింది.

b వంట చెయ్యటం పూర్తి అయింది.

c. తెలుగులో కావ్యాలు రాయటం పదకొండో శతాబ్దంలో ప్రారంభమయింది.

d వరి నాటటం పూర్తి అయింది.

పై వాక్యాలలో వానకురవటం లాంటివి కర్తృ నిరపేక్షకమైన వ్యాపారాలు. మిగతా వ్యాపారాలు కర్త్రపేక్షకాలు. అయినా ఇక్కడ కర్తృపదానికి ప్రాధాన్యం లేదు. క్రియానిష్పన్న నామాలేకాక సిద్ధనామాలు కూడా వ్యాపారబోధకాలు ఉన్నై. *పెండ్లి జరిగింది, పరిశోధన చేస్తున్నారు, ఎన్నికలు పూర్తి అయినై, నాటకం మధ్యలో ఆగిపోయింది, యుద్ధం భీకరంగా జరుగుతున్నది;* వంటి వాక్యాల్లో నామాలు వ్యాపారార్థక నామాలు. ప్రధాన క్రియకు వ్యాపార నిర్వాహకకర్త అవసరమైతే ఆ కర్త భావార్థకనామంగా మారిన ఉపవాక్యంలో కర్తతో అభిన్నమై ఉండాలి.

(159) a సుజాత వంటచెయ్యటం పూర్తి చేసింది.

b సుజాత అలంకరించుకోటం ప్రారంభించింది.

పై వాక్యాలలో వ్యక్తమయిన రెండు వ్యాపారాలకు కర్తృ పదం ఒకటే ఉండాలి. వీటి గుప్తనిర్మాణం సమబోధక, సమరూపకమైన నామాలను కర్తృ పదాలని ప్రతిపాదించి, అందులో ఒకదాన్ని సూత్రంచేత లోపింపచెయ్యాలి. ఎందుకంటే ఏకాశ్రయంగా భావించినా భిన్ననామాలుగాని, ఏకరూపాలుగా ఉన్న నామ ద్వయంగాని ఈ వాక్యాల్లో కర్తలుగా ఉండటానికి వీల్లేదు. నియమోల్లంఘన జరగటంవల్ల ఈ కింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

* (160) a సుజాత వంటచెయ్యటం సుమిత్ర పూర్తి చేసింది.

b. సుజాత అలంకరించుకోటం సుజాత మొదలు పెట్టింది.

ప్రాణి వాచక కర్తృపదాల్ని అపేక్షించే సకర్మక క్రియలు ప్రధాన వాక్యంలో ఉన్నప్పుడు వాటికి కర్మస్థానంలో వచ్చే ఉపవాక్యాల్లో క్రియలుకూడా అట్లాంటివే అయి ఉండాలనీ, వాక్యాలు ఏకకర్తృకాలయి ఉండాలని పై వాక్యాలను బట్టి తెలుస్తుంది.

**2.722 :** స్థితిబోధక క్రియలనుగాని, సంఘటనాత్మక క్రియలనుగాని నామ్నీకరించి వ్యాపారాద్యంతాలను సూచించే క్రియలతో వాడలేం.

* (161) a. ఆమె అందంగా ఉండటం మొదలు పెట్టింది.
b. ఆమె పొట్టిగా ఉండటం పూర్తి చేసింది.
c. ఆమె నల్లగా ఉండటం పూర్తి అయింది.
d. వాడికి కాలు విరగటం ప్రారంభమయింది.
e. వాడు బావిలో పడటం పూర్తి అయింది.

చివరి రెండు సంఘటనబోధకాలు (events) కావటంవల్ల ఈ వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

భావార్థకాలు సంఘటనాత్మక నామాలుగా ప్రవర్తించినప్పుడు 'జరుగు' అనే క్రియతో వ్యాకరణ సమ్మతాలవుతై.

(162) a. వాడికి కాలు విరగటం జరిగింది.
b వాడు బావిలో పడటం జరిగింది.

'జరుగు' అనే క్రియతో సంఘటన, వ్యాపారార్థక నామాలు కర్తృ పదాలుగా రాగలవు.

**2.723 :** భావార్థక నామాలు ప్రధాన వాక్యంలో వ్యాపారబోధక నామంగానే గాక జ్ఞానార్థక క్రియలతో అభ్యసనార్థక నామంగా రాగలదు.

(163) a. నాకు వచన పద్యాలు రాయటం వచ్చు.
b. మా ఆవిడ మిషను కుట్టటం నేర్చుకుంటున్నది.

ఈ పై వాక్యాలలో *మిషనుకుట్టటం వచనపద్యాలు రాయటం* అనే నామాలను ఉపవాక్యాలుగా, అంటేవాక్యంనుంచి నిష్పన్నమైనట్టుగా భావించ నక్కర్లేదు. అభ్యసనార్థంగా భావించిన ఏ వ్యాపారాన్నైనా, క్రియ అయితే నామ్నీకరించి ఇక్కడ వాడవచ్చు. అయితే ప్రాణి నిర్వహించే వ్యాపారబోధక క్రియలయితేనే ఇట్లా నామ్నీకరించటం సాధ్యం. అందువల్ల వీటిని గుప్త నిర్మాణంలో ప్రాణివాచకకర్త ఉన్న వాక్యాలుగా భావిస్తే వ్యాకరణ ప్రక్రియ తేలిక అవుతుంది.

**2.724 :** ప్రధానవాక్యంలో గ్రహణేంద్రియ వ్యాపారబోధక (Perception verbs) క్రియలున్నప్పుడుకూడా భావార్థకనామంగా ఉపవాక్యం కర్మపదంగా వస్తుంది. అప్పుడు ప్రధాన ఉపవాక్యాలు భిన్నకర్తృకంగా ఉండాలి. *చూచు, విను* వంటివి ఇంద్రియ వ్యాపారబోధక క్రియలు. *చూచు* అనే క్రియకు దృశ్యమాన పదార్థబోధకమూ, *విను* అనే క్రియకు శ్రవ్యమాన పదార్థబోధక (ధ్వనియుక్త) నామం కర్మ పదాలుగా ఉండాలి.

(164) a. రవీంద్రభారతిలో సుజాత నాట్యం చెయ్యటం చూశాను.
b. దొంగ అటువేపుగా పరిగెత్తటం చూశాను.
c. రేడియోలో సుమిత్ర పాడటం విన్నాను.
d. మా ఆవిడ వంటింట్లో గిన్నెలు పగలకొట్టటం చూశాను, (విన్నాను.)
* e. సుజాత ఆలోచించటం విన్నాను.
* f. సుజాతకు ఆకలి వెయ్యడం చూశాను.

పై వాక్యాల్లో *ఆలోచించు* అనే వ్యాపారం శ్రవ్యమానం, *ఆకలివేయు* అనే వ్యాపారం దృశ్యమానం కాకపోవటంవల్ల e, f లు వ్యాకరణ విరుద్ధాలయినై. *పగలగొట్టు* అనే వ్యాపారం దృశ్యమానమూ, శ్రవ్యమానమూ కావటంవల్ల (d) లో *చూచు, విను* అనే రెండు క్రియలూ సాధ్యమయినై. పై వాక్యాల్లో (c)కి రెండర్థాలున్నై. (1) రేడియోలో సుమిత్ర పాట విన్నాను. (2) రేడియోలో సుమిత్ర పాడిందని విన్నాను. *చూచు* క్రియతో ఇట్లాంటి భిన్నార్థాలుండవు. ప్రత్యక్ష వ్యాపారమే దృశ్యమానమవుతుంది. శ్రవణేంద్రియంతో వ్యాపారాన్ని ప్రత్యక్షంగానే కాక పరోక్షంగాకూడా గ్రహించవచ్చు. *విను* అనే క్రియకు శ్రవణేంద్రియంద్వారా చప్పుడును గ్రహించటం అనే అర్థమేకాక ఒక విషయాన్ని భాషద్వారా ఇంకొకరు చెప్పగా గ్రహించటం అనే అర్థంకూడా ఉంది.

పై వాక్యాల్లో భావార్థకనామాలను క్రియాజన్య విశేషణాలుగామార్చి ఆ క్రియలనుబట్టి దృశ్యం, ధ్వని, విషయం అనే నామాలకు విధేయాలుగాచేసినా అర్థంలో మార్పురాదు. ఉదాహరణకు (d) లో పగలగొట్టినదృశ్యం, పగలగొట్టిన ధ్వని, పగలగొట్టిన విషయం అని మూడర్థాల్లోనూ ప్రయోగించవచ్చు.

(164) లో ఉదాహరించిన వాక్యాలు భిన్న కర్తృకాలు కావాలని చెప్పబడింది. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో అవి ఏకకర్తృకాలు కావచ్చు. ఒక సినిమా

హీరో తను నటించిన సినిమాను తనే చూసినప్పుడు 'నేను హీరోయిన్‌తో నాట్యం చెయ్యటంచూశాను, నేను హీరోయిన్‌తో డ్యూయట్ పాడటం విన్నాను అని అనవచ్చు. అట్లాగే కలలో జరిగిన ఘట్టాలను చెప్పేటప్పుడుకూడా ఈ రకపు వాక్యాలు వాడవచ్చును.

భావార్థకనామంలో కాలబోధకతలేదు. ప్రధానవాక్యంలో క్రియబోధించేకాలాన్నే భావార్థకనామానికి అన్వయించుకోవాలి. *నువ్వురావటం ఎప్పుడు ?* అనే ప్రశ్నకు *నువ్వు వచ్చింది ఎప్పుడు ? నువ్వు వచ్చేది ఎప్పుడు ?* అని రెండు రకాలుగా అర్థాలు చెప్పుకోవచ్చు.

**2.7251** : కొన్ని వాక్యాల్లో నామాలు ఆఖ్యాతాలుగా ప్రవర్తిస్తై.

(165) a. నాకు కాఫీ అలవాటు.
b. నాకు నిద్ర ఇష్టం.
c. నాకు లెక్కలు కష్టం.

ఈ పై వాక్యాలలో కాఫీ, *నిద్ర*, *లెక్కలు* అనే నామాలు వ్యాపారార్థకంగా ప్రయుక్తమయినై. వాటికి *కాఫీతాగటం*, *నిద్రపోవటం*, *లెక్కలు చెయ్యటం* అని అర్థాలు చెప్పుకోవాలి.

**2.7252** : ఇట్లాంటి వాక్యాల్లో ఆఖ్యాతాలను రెండు రకాలుగా విభజించాలి. కొన్నిట్లో ప్రధాన వాక్యంలో అనుభోక్త, భావార్థక నామానికి కర్త ఒకటిగా ఉండాలి. కొన్నిటికి అక్కర్లేదు. ప్రధాన ఉపవాక్యాల్లో అనుభోక్త-కర్తలు ఒకటిగా లేని ఈ వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

*(166) a. నాకు నువ్వు సినిమాలు చూడటం అలవాటు.
b. నాకు నువ్వు అబద్ధా లాడటం మామూలు.
c. నాకు నువ్వు లెక్కలు చెయ్యటం తేలిక.
d. నాకు నువ్వు ఈ మెట్లు ఎక్కటం కష్టం.

ప్రధాన-ఉపవాక్యాలుగా అనుభోక్త-కర్తలు ఒకటిగా లేకపోయినా ఈ క్రింది వాక్యాలు వ్యాకరణ సమ్మతాలు.

(167) a. నువ్వు నాదగ్గర పుస్తకం తీసికెళ్ళటం (నాకు) గుర్తు.
b. నాకు పిల్లలు అల్లరి చెయ్యటం ఇష్టం.

ప్రధాన వాక్యంలో అనుభోక్తతో సమంగా ఉపవాక్యంలో కర్త ఉంటే (166)లో వాక్యాలు వ్యాకరణ సమ్మతమవుతై. ఇట్లాంటి వాక్యాల్లో భావార్థక నామాన్ని తొలగించినా అర్థభంగం కలగదు. (165) లో వాక్యాలు అట్లా ఏర్పడినవే. కాని (167)a లో భావార్ధక నామాన్ని లోపింపజెయ్యటానికి వీల్లేదు. *గుర్తు* క్రియా రహితంగా ప్రయోగించినప్పుడు విద్యమాన ప్రాగ్వ్యాపారమే విషయం కాగలదు. మిగతా ఆఖ్యాతాలకు ప్రత్యేక కాలనియమం లేని వ్యాపారాలే విషయాలుగా వస్తై. అట్లాంటి చోటనే భావార్థక నామాలను లోపింపజేసినా అర్థ భంగం రాదు.

**2.7261 :** ఏక వాక్యంలో కూడా క్రియ కొన్నిచోట్ల భావార్థక నామంగా మారుతుంది. ఆ ప్రక్రియ కింది వాక్యాల్లో చూడవచ్చు.

(168) a మీరు ఎప్పుడు వస్తారు ? ⟶ మీరు రావటం ఎప్పుడు ?
b. మీరు ఎక్కడికి వెళ్తారు ? ⟶ మీరు వెళ్లటం ఎక్కడికి ?
c. మీరు ఎందుకు వస్తారు ? ⟶ మీరు రావటం ఎందుకు ?

బాణం గుర్తుకు ఎడం పక్కన ఉన్న వాక్యాలకు కుడి పక్కన ఉన్న వాక్యాలకు అర్థభేదం లేదు. కాని ఎడం పక్క వాక్యాలలో భూతకాలక్రియ ఉంటే ఈ రకం నామ్నీకరణం సాధ్యమయినట్టు కనపడదు. పై నామ్నీకృత వాక్యాల్లో *ఎప్పుడు వచ్చారు ? ఎక్కడికి వెళ్లారు ? ఎందుకు వచ్చారు ?* అనే అర్థాలు రావటం లేదు. కాలబోధను సూచించే పదసాహాయ్యం లేనప్పుడు భావార్థక నామం భూతేతర కాలబోధక మవుతుందని చెప్పుకోవాలి. ప్రశ్నార్థక శబ్దానికి ప్రాధాన్య వివక్ష ఈ నామ్నీకరణ సార్థక్యం.

**2.7262 :** ఈ రకపు నామ్నీకరణ ప్రశ్నార్థక శబ్దాలన్నిటికి సాధ్యమవుతున్నట్టు లేదు.

* (169) a. మీరు ఏం తెస్తారు ? ⟶ మీ తేవటం ఏమిటి ?
b. మీ ఇంటికి ఎవరు వస్తారు ? ⟶ మీ ఇంటికి రావటం ఎవరు ?

ప్రశ్నార్థక శబ్దం నామాన్ని సూచించేట్టయితే ఈ నామ్నీకరణ సాధ్యం కాదని పై వాక్యాల్నిబట్టి గ్రహించవచ్చు.

**2.7263 :** ప్రశ్నాభావంలో కూడా ఈ నామ్నీకరణం జరుగుతుంది. కాని భావార్థక నామం తరవాత వచ్చిన పదబంధానికి ఏదైనా ప్రాధాన్యసూచకమైన శబ్దాన్ని అనుబంధించినప్పుడే అది వ్యాకరణ సమ్మత మవుతుంది.

(170) a నేను హైదరాబాదులో ఉంటున్నాను
→ నేను ఉండటం హైదరాబాద్‌లోనే.

b. మేం మద్రాసుకు వెళ్తున్నాం
→ మేం వెళ్లటం మద్రాసుకే.

c. వాళ్లు రేపు వెళ్తారు
→ వాళ్ళు వెళ్లటం రేపే.

ఇంతకు పూర్వం సామాన్య వాక్యాల్లో చర్చించిన (చూ. 1.12, 1 26) ప్రాధాన్య వివక్షామూలక నామ్నీకరణంలో భాగమే ఇది. కాకపోతే ప్రాధాన్యాన్ని వివక్షించటానికి పదక్రమ వ్యత్యయమే కాక ప్రాధాన్యాన్ని సూచించే శబ్దాలు (ఆ, ఏ, అటు, కాదు – ఇత్యాదులు) ఇక్కడ పదక్రమ వ్యత్యయం తరవాత కూడా అవసరమే కావటం విశేషం. కర్తృ, కర్మ పదాలను సూచించే నామాలను ఇట్లా వ్యత్యయం చెయ్యటానికి వీల్లేకపోవటం అధికనియమం. (168) వాక్యాల్లో ఇట్లాంటి శబ్దం విడిగా లేకపోయినా కిమర్థక శబ్దం ఇట్లాంటి పాత్రను నిర్వహిస్తున్నది. భావార్థక నామంతో ఇట్లాంటి వ్యత్యయం భూతకాలపు అర్థాన్ని ఇయ్యలేకపోవటం ఇక్కడ గమనించాల్సిన ఇంకో విశేషం.

**2.727 :** మిగతా నామ్నీకరణాలకన్నా భావార్థక నామ్నీకరణం ఇంకో విధంగా కూడా విశిష్టమైనది. మామూలు సిద్ధనామాల్లాగే భావార్థక నామానికి వివిధార్థాల్లో నామవిభక్తులు చేరతై. మిగతా మకారాంత నామాల్లాగే కు, ను విభక్తులు పరమైనప్పుడు మకార లోపమూ, పూర్వస్వర దీర్ఘమూ, జరిగి, ని ఆగమంగా వస్తుంది. ఈ ఆగమం తర్వాత నామం ఇకారాంతం కావటంవల్ల కు, ను లు కి, ని లు అవుతై. భావార్థకనామం అమూర్తనామం. అందువల్ల అమూర్తనామంతో సాధ్యమయ్యే అర్థాలే విభక్తిపరమైనప్పుడు వస్తై.

**2 72711** : ప్రధాన వాక్యంలో సమాపక క్రియ భౌతిక వ్యాపార బోధకమైనప్పుడు లక్ష్యార్థంలో అటమంతనామానికి *కి* విభక్తి చేరుతుంది. ఈ అర్థం ప్రధాన, ఉపవాక్యాలు ఏకకర్తృకాలైనప్పుడే వస్తుంది.

(171) a మా ఆవిడ పక్కింటామెతో హస్కు కొట్టటానికి వెళ్లింది.

b సుబ్బారావు డబ్బులడుక్కోవటానికి వచ్చాడు.

c. అతను బతకటానికి చిన్న కొట్టు పెట్టుకున్నాడు.

d. సుజాత మధ్యాహ్నం తినటానికి రొట్టెలు తెచ్చుకుంటుంది.

ఈ పై వాక్యాల్లో *కి* విభక్తి కి బదులు ఇదే అర్థంలో *కోసం* అనే శబ్దం ప్రయోగించవచ్చు.

**2.72712** : *కి* విభక్తి చేరిన అటమంత నామం మనోవ్యాపార బోధకమైన ప్రధాన క్రియకు *కారణం* అవుతుంది.

(172) a. నలుగుర్లోకి రావటానికి ఆమె సిగ్గుపడుతుంది.

b. ఇంగ్లీషులో మాట్లాట్టానికి అతను భయపడతాడు.

c. వానలో బయటికి వెళ్లటానికి సందేహిస్తున్నాను.

d. పరీక్షఫీజు కట్టటానికి తటపటాయిస్తున్నాడు

ఈ రకమైన ఈ అర్థభేదం ఈ కింది వాక్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రధాన క్రియను భౌతిక వ్యాపారంగానూ, మనోవ్యాపారంగానూ వ్యాఖ్యానించవచ్చు

e. అతను విదేశాలు వెళ్లటానికి కష్టపడుతున్నాడు.

ఈ పై వాక్యంలో *కష్టపడు* భౌతికవ్యాపార మైనప్పుడు *వెళ్ళటానికి* అనేది లక్ష్యమవుతుంది. మనోవ్యాపారమైనప్పుడు (ఉదాహరణకు తనవాళ్లందరినీ వదిలి వెళ్ళాల్సి వచ్చినందుకు) కారణమవుతుంది.

లక్ష్యార్థంలో ఉపవాక్యంలో వ్యక్తమైన వ్యాపారం కర్తకు ఇచ్ఛాపూర్వకం. కాని మనోవ్యాపార క్రియలు ప్రధాన వాక్యంలో ఉన్నప్పుడు ఉపవాక్యంలో వ్యక్తమైన వ్యాపారం ఇచ్ఛాపూర్వకం కావచ్చు, కాకపోవచ్చు.

**2.72713 :** ప్రధాని వ్యాపారం స్థితిబోధకమైనప్పుడు కి విభక్తి పరమైన భావార్థకనామం పై రెండు అర్థాలకన్నా భిన్నమైన అర్థంలో కనిపిస్తుంది. ఈ అర్థంలో వాక్యం మొత్తాన్ని అస్త్యర్థక క్రియకు కర్తగా భావించవచ్చు.

(173) a. అతనికి మనుష్యులతో మాట్లాడటానికి (time) టైం లేదు.

b. నాకు రాసుకోటానికి తీరిక ఉండటం లేదు.

c. కాలేజిలో చదువుకోటానికి వీలుండదు.

పై వాక్యాలన్నిటిలో ప్రధానవాక్యంలో కర్తతోగాని, అనుభోక్తతోగాని, ఉపవాక్యంలో కర్త అభిన్నమయి ఉండాలి.

**2.7272** · అధికరణార్థకమైన లో, మీద అనే విభక్తులతో భావార్థక నామం ప్రయోగించినప్పుడు కూడా ఈ నియమం వర్తిస్తుంది.

(174) a నిద్రపోవటంలోనే అతను రోజంతా గడుపుతాడు.

b. కష్టపడటంలోనే సౌఖ్యముంది.

c. భావకవులకు ఏడవటంలోనే సుఖముంది.

**2.7273 :** భావార్థకం తరవాత తో వస్తే పూర్వ వ్యాపార సమాప్తిని, పరవ్యాపారారంభాన్ని తెలియజేస్తుంది. కేవలస్థితి బోధక ఆఖ్యాతాలనించి, నిష్పన్న మైన అటమంత రూపాలు ఈ అర్థంలో ప్రయోగ యోగ్యాలు కావు. ఈ అర్థంలో **తో తోటి** అనే రూపంలో రావచ్చు. సాధారణంగా ఈ రూపంమీద ఏ వార్థకమైన ఏ శబ్దం వస్తుంది. ఈ వాక్యాల్లో ఏకకర్తృక నియమం లేదు.

(175) a. ఆమె అన్నం తినటంతోటే నిద్రపోతుంది.

b. నన్ను చూడటం తోటే వాడి మొహం తెల్లబడ్డది.

c. పిల్లలు క్లాసుకి రావటం తోటే టీచరు పాఠం మొదలుపెడుతుంది.

* d. ఆమె అందంగా ఉండటంతోటే అతను పెళ్ళికొప్పుకున్నాడు.

* e. ఆమకు తలనొప్పిగా ఉండటంతోటే నేను వెళ్ళాను.

పై వాక్యాలు (d, e) లు వ్యాకరణ విరుద్ధం కావటానికి నామ్నీకృతాఖ్యాతం స్థితిబోధకం కావటమే. మనోవ్యాపార బోధక క్రియలతో నామ్నీకరించినప్పుడు

ఈ అర్థంలో వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు కాకపోయినా, అంత సహజంగా కనపడటం లేదు

f ఆమె సిగ్గుపడటంతోటే నేను బయటికి వెళ్ళాను.

g అతను సందేహించటంతోనే నేను చెప్పటం మానేశాను.

h సుజాత విచారించటంతోటే భర్త ఓదార్చాడు.

భావార్థకనామం + తోనే, తోటే అని ప్రయోగించిన వాక్యాలు అన్నంత క్రియ + గానే అనే అసమాపక క్రియ ఉన్న వాక్యాలతో సమానార్థకాలవుతై.

(176) a ఆమె అన్నం తినటంతోనే నిద్రపోతుంది.

b. ఆమె అన్నం తినగానే నిద్రపోతుంది.

భావార్థక నామంతో కేవలం తో అనే శబ్దం మాత్రమే ప్రయోగించినప్పుడు ప్రధానక్రియిలో వ్యాపారానికి హేతువు (? దోహదకారి) అవుతుంది.

(177) a. జ్వరం రావటంతో ఆమె మూలబడ్డది.

b ఎవరూ గదమాయించే వాళ్ళు లేకపోవటంతో పిల్లల అల్లరి ఎక్కువయింది.

c కార్మికులు సమ్మె చెయ్యటంతో ఫ్యాక్టరీ మూతబడింది.

**2.728 :** కొన్ని ప్రాంతాల్లో కొన్ని అర్థాల్లో అటమంత రూపాలకు బదులు తచ్ఛబ్ద (అది > ది) నామ్నీకరణ రూపాలు వాడతారు. ప్రత్యేక కాలబోధ లేని క్రియాజన్య విశేషణంమీద *అది* అనే శబ్దంలో మొదటి అచ్చులోపించగా మిగిలిన *ది* రూపం చేర్చటంవల్ల ఈ నామం ఏర్పడుతుంది.

a. మీరు వచ్చేది ఎప్పుడు ?

b. నలుగుర్లోకి వచ్చేదానికి ఆమె సిగ్గుపడుతుంది.

c. ఆమె హస్కు కొట్టేదానికి పక్కింటి కెళ్ళింది.

d. వాడికి తినేదానికి టైం లేదు.

**2.73 :** తచ్ఛబ్దనామ్నీకరణం : క్రియాజన్య విశేషణం నామ్నీకరణంలో ఉపయోగించే పద్ధతిని కొంత విభక్త్యర్థక నామ్నీకరణంలో చూశాం. అక్కడ ఒక వాక్యంలో ఏదైనా నామాన్ని ఉద్దేశ్యంగా చేయదల్చుకున్నప్పుడు ఆ నామానికి

మొత్తం వాక్యం విశేషణంగా ప్రవర్తించటం గమనించాం. మొత్తం వాక్యాన్ని వాక్యాంతర్భాగమైన నామానికి విశేషణం చేసినప్పుడు వాక్యంలో కాలబోధననుసరించి క్రియ విశేషణ రూపాన్ని గ్రహిస్తుంది. వాక్యంలో క్రియ ప్రధానం కాబట్టి క్రియ విశేషణంగా మారిందంటే వాక్యమే విశేషణంగా మారినట్టు.

**2.731 :** అట్లాకాకుండా మొత్తం వాక్యాన్నే ఒక నామబంధంగా ప్రయోగించినప్పుడుకూడా క్రియాజన్య విశేషణం ప్రయుక్త మవుతుంది. అప్పుడు క్రియాజన్య విశేషణం ఏ నామానికీ విశేషణం కాక *అది* అనే శబ్దాన్ని గ్రహించి నామంగా మారుతుబది. ఏ విశేషణం తరవాతైనా *అది* అనే శబ్దంలో ప్రథమ స్వరలోపం జరిగిం *ది* అనే రూపంతో ఉంటుంది. *మంచి + అది > మంచిది, వచ్చే + అది > వచ్చేది.* తెలుగులో *అది* అనే శబ్దానికి బహుళార్థాలూ, వివిధ ప్రయోజనాలో ఉన్నై. ఈ నామ్నీకరణంలో *అది* అంటే వాక్యంలో చెప్పిన విషయ సర్వస్వం అని అర్థం. ఈ కింది వాక్యాల్లో తచ్ఛబ్ద ప్రయోగాన్ని చూస్తే ఈ విషయం గ్రహించవచ్చు.

(178) a సుబ్బారావు మీతో పోట్లాడింది నాకు తెలుసు.
b. సుజాత రోజూ క్లబ్బుకి వెళ్ళేది నే నెరుగుదును.
c. సుజాతా సుబ్బారావులు మాట్లాడుకోనిది ఎవరికి తెలీదు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. సమాపక క్రియల్లో చూపించే కాలబోధకతకూ, క్రియాజన్య విశేషణ రూపాలకు ఏకైక సంబంధం (one to one correspondence) లేదు. ఉదాహరణకు వ్యతిరేకంలో ఒకే ఒక్క రూపం ఉంటుంది. ఏ కాలంలో అయినా ఆ ఒక్క రూపాన్నే అన్వయించుకోవాలి.

(179) సుజాత (నిన్న, ఇవాళ, రేపు) మీటింగుకు రానిది నాకు తెలుసు.

పై వాక్యంలో *రానిది* అనే నామ్నీకృత రూపానికి పూర్వరూపం "రాలేదు, రావటంలేదు, రాదు" అనే వాటిల్లో ఏదైనాకావచ్చు. *వచ్చేది* అనే నామ్నీకృత రూపానికి 'వస్తున్నది, వస్తుంది' అనే రూపాల్లో ఏదైనా మూలరూపంకావచ్చు.

**2.732 :** క్రియలేని వాక్యాలను ఇట్లా నామ్నీకరించాలంటే ఆ వాక్యాలకు అవు (<*అగు*) ధాతువును అనుబంధించాలి. కాలాదికబోధలోకూడా అగు ధాతువును

అను ప్రయుక్తం చెయ్యాలని పూర్వమే చెప్పబడింది. క్రియలేని వాక్యాలు 'స్థితి' బోధకాలు. కాలబోధలో *అగు* ధాతువుచేర్చినప్పుడు 'పరిణామ' బోధకాలవుతై. నామ్నీకరణం రెంటికీ సాధ్యమే. అందువల్ల నామ్నీకతమైన క్రియారహిత వాక్యాలకు స్థితిపరంగాను, పరిణామపరంగాను అర్థం చెప్పవచ్చు.

(180) a. అతను డాక్టర్ అయింది నాకు తెలుసు

ఈ పై వాక్యానికి కింది వాక్యాల్లో వ్యక్తమయ్యే రెండర్థాలూ ఉన్నై.

b. అతను డాక్టరు అయ్యాడని నాకు తెలుసు. (పరిణామం.)

c. అతను డాకరు అని నాకుతెలుసు

అయితే భూతకాల ప్రత్యయ యుక్తమయినప్పుడే ఈ భిన్నార్థబోధ ఉంటుంది. మిగతా క్రియాజన్య విశేషణాలు ప్రయోగించినప్పుడు పరిణామార్థం ఒక్కటే వస్తుంది.

d. అతను డాక్టరు అయ్యేది నాకు తెలుసు.

e. అతను డాక్టరు అవుతున్నది నాకు తెలుసు.

వ్యతిరేక క్రియా జన్యవిశేషణం ప్రయోగించినప్పుడు మళ్ళీ రెండర్థాలు సాధ్యమే.

f. అతను డాక్టరు కానిది నాకు తెలుసు.

*కానిది* అనే నామ్నీకృతరూపానికి *కాలేదు*, *కాదు* అనే రెండింట్లో ఏదైనా మూలరూపం కావచ్చు.

క్రియాజన్యవిశేషణం కేవలధాతువునుంచి కాలబోధక యుక్తమైన క్రియా రూపాలనుంచి నిష్పన్నమైనట్లుగా భావించాలి. లేకపోతే క్రియాజన్య విశేషణంలో కాలాదికాది అర్థాలకు గతి కలిగించలేం. కాని క్రియారహిత వాక్యాలకు కాలబోధ లేదు. అయినా క్రియాజన్యవిశేషణంతో నామ్నీకరణం సాధ్యమయింది. స్థితిబోధలో కూడా నామ్నీకరణం సాధ్యమయిందన్నమాట. అయితే విశేషణరూపంలో మాత్రం భూతకాలిక ప్రత్యయముంది. కేవల నామ్నీకరణ ప్రయోజనమాత్రంగానే ఈ ప్రత్యయం ఉంటుంది. అంటే వాక్యాన్ని (దానితోపాటు క్రియను) విశేషణంగా చెయ్యటమే దీని ప్రయోజనం.

**2.733 :** తెలుగులో కొన్ని క్రియలు కాలబోధకప్రత్యయం లేకుండానే ప్రయుక్తమవుతై వాటికి తచ్ఛబ్దంతో నామ్నీకరణం సాధ్యంకాదు. ఈ క్రియలు ప్రాయికంగా అనుబంధ క్రియలు.

(181) a. ఈ దేశంలో స్వేచ్ఛగా ఉపవాసం ఉండవచ్చు.

b. ఈ దేశంలో స్వేచ్ఛగా మాట్లాడకూడదు

పై వాక్యాలనుంచి * *ఉండవచ్చింది* అనే నామ్నీకృతరూపాన్ని నిష్పన్నం చెయ్యలేం. అట్లాగే * *మాట్లడగూడనిది* అనేది ఈ అర్థంలో సాధ్యమవుతున్నట్టుగా తోచదు

**2.734 :** పై వాక్యాల్లో ప్రయుక్తమైన *అది* అనే శబ్దం వాక్యవిషయాన్ని సూచిస్తుంది. కాని *అది* కి చాలా ప్రయోజనాలున్నై. అందులో ఒకటి సర్వనామంగా ప్రయోగించటం. విభక్త్యర్థ నామ్నీకరణంలో ఉద్దేశ్యంగా మారిన నామానికి *అది* ఆదేశంగా రావచ్చు. లేక మొత్తం వాక్య విషయాన్నే సూచించవచ్చు.

(182) a. నువ్వు ఢిల్లీనుంచి తెచ్చింది నాకు తెలుసు.

ఈ పైవాక్యానికి కింది వాక్యాలు రెండూ అర్థాలే.

b. నువ్వు ఢిల్లీనుంచి తెచ్చావని నాకు తెలుసు.

c. నువ్వు ఢిల్లీనుంచి ఏం తెచ్చావో నాకు తెలుసు.

ఈ రకమైన భిన్నార్థబోధక్రియ సకర్మకమైనప్పుడే సాధ్యం. ఇంకోరకంగా చెప్తే ఉద్దేశ్యనామం మనుష్యవాచకేతర కర్మపదం అయినప్పుడే ఇట్లాంటి అర్థభేదం వస్తుంది.

**2.735 :** ఈ రకమైన నామ్నీకరణం విధ్యాదులకు సాధ్యంకాదు. కేవల నిశ్చయార్థక వాక్యాలకు, వాటి వ్యతిరేకార్థాదులతో సహా ఈ నామ్నీకరణం సాధ్యమవుతుంది. కిమర్థక ప్రశ్నలతోఉన్న వాక్యాలకు ఈ రకమైన నామ్నీకరణం చెయ్యొచ్చుకాని, అది వాక్య విషయ సర్వస్వ బోధకంకాదు. ఉదాహరణకు ఈ కింది వాక్యం చూడండి.

(183) మీ యింటికి ఎవరు వచ్చిందీ తెలుసు.

ఈ పై వాక్యంలో తచ్ఛబ్దం (అది>ది) ప్రశ్నార్థక శబ్దార్థానికే పరిమితం.

వాక్యం బోధించే విషయ సర్వస్వాన్ని బోధించే నామ్నీకరణాన్ని విషయార్థక నామ్నీకరణం అంటారు. విషయార్థక నామ్నీకరణం జరిగినప్పుడు ప్రధానవాక్యంలో శ్రవణ, బుద్ధ, వచ్యర్థకాది విషయ సంగ్రహణార్థక ధాతువులే క్రియలుగావస్తై.

ఏకవాక్యంలో ప్రాధాన్య వివక్షకోసం క్రియ తచ్ఛబ్దంతో నామ్నీకృతమయ్యే పద్ధతి పూర్వమే చెప్పబడింది. (చూ. 1.27.)

**2 8 : పరోక్షప్రశ్నలు :** ఏ భాషలో నయినా ప్రశ్నార్థక వాక్యాలను రెండు రకాలుగా విభజించవచ్చు. 1. (నూతన) విషయాపేక్షక ప్రశ్నలు 2. విషయ నిర్ధారక ప్రశ్నలు. *ఎవరు, ఎక్కడ, ఎప్పుడు. ఎందుకు, ఎట్లా, ఏమిటి (ఏం)* మొదలైన ప్రశ్నార్థక శబ్దాలతో వచ్చేవి, విషయాపేక్షక ప్రశ్నలు. ఆ అనే శబ్దాంతంగా వచ్చేవి విషయ నిర్ధారక ప్రశ్నలు. మొదటి రకం ప్రశ్నలకు సమాధానంగా నూతన విషయ బోధక పదాలు, వాక్యాలు సమాధానాలుగా అపేక్షితాలు. రెండోరకం ప్రశ్నలకు సమాధానాలు తెలిస్తే అవును, కాదు అనే పదాలతో వ్యక్తం చెయ్యొచ్చు. శ్రోతకు సమాధానాలు తెలియనప్పుడు ఏ ప్రశ్నకైనా *ఏమో* అనే శబ్దం సమాధానంగా ఇయ్యవచ్చు. అంటే *ఏమో* అనే శబ్దాన్ని ఒక వ్యవహర్త సమాధానంగా వాడితే అడగబడిన ప్రశ్నకు సమాధానం తనకు తెలీదు అని చెప్పటం అతని ఉద్దేశంగా మనం గ్రహించవచ్చు.

**2.81 :** ప్రశ్నార్థక పదయుక్తమైన ప్రశ్నలను ఇంకో వాక్యంలో ఇమిడ్చి చెప్పాలంటే వాక్యాంతంలో *ఓ* శబ్దాన్ని అనుసంధించాలి. ఆ శబ్దంతో వచ్చే ప్రశ్నల్ని ఇమడ్చాలంటే *ఏమో* శబ్దాన్ని అనుసంధించాలి.

(184) a. సుజాత వూరి నుంచి ఎప్పుడొస్తుందో నీకు తెలుసా ?
b. సుజాత వూరినుంచి వచ్చిందేమో నీకు తెలుసా ?

పై వాక్యాలనిబట్టి *ఏ* - శబ్దయుక్త ప్రశ్నలకు *ఓ* శబ్దానికి, ఆ - శబ్దయుక్త ప్రశ్నలకు *ఏమో* శబ్దానికి ఉన్న సంబంధాన్ని గ్రహించవచ్చు. సంశ్లిష్ట వాక్య నిర్మాణంలో *ఏ* - శబ్దయుక్త ప్రశ్నలకు *ఓ* - శబ్దాన్ని ఆగమంగానూ, ఆ - శబ్దయుక్త ప్రశ్నలకు *ఏమో* శబ్దాన్ని (ఆ - శబ్దానికి) ఆదేశంగానూ చెప్పవచ్చు.

రెండు చోట్ల *ఏమో* (*ఏం + ఓ*) శబ్దాన్ని ప్రతిపాదించి *ఏ*-శబ్ద ప్రశ్నలతో వచ్చినప్పుడు ఏమో > ఓ అనే మార్పును సూచించవచ్చు. రెంటిమధ్య పెద్ద భేదం లేదు *ఓ*-శబ్దం వాక్యంలో కాని, పదంలోకాని *ఏ* శబ్దాన్ని అపేక్షిస్తుంది. అది లేనిచోట (ఆ-శబ్ద ప్రశ్నలు) *ఏం* అనే శబ్దాన్ని అదనంగా ప్రతిపాదించాలి.

**2.82 :** ప్రశ్నకు సమాధానం చెప్పమని శ్రోతను అడగటం పృచ్ఛకుని లక్ష్యం. అందువల్ల *సుజాత ఊరినుంచి ఎప్పుడు వస్తుంది ?* అనే ప్రశ్నకు *సుజాత ఊరినుంచి ఎప్పుడు వస్తుందో నాకుచెప్పు* అనీ, *సుజాత ఊరినుంచి వచ్చిందా ?* అనే ప్రశ్నకు *సుజాత ఊరినుంచి వచ్చిందేమో నాకు చెప్పు* అనీ అర్థాలుగా గ్రహించవచ్చు. ఈ పద్ధతిలో ఆలోచిస్తే ప్రత్యక్ష ప్రశ్నలను పరోక్ష ప్రశ్నలనుంచి లోపకార్యం ద్వారా నిష్పన్నం చెయ్యవచ్చు

పరోక్ష ప్రశ్నల్లో ప్రధాన వాక్యంలో క్రియ *కనుక్కొను, చూచు, తెలియు,* వంటి విషయసేకరణ సంబంధి కావాలి.

**2.83 :** *ఏమో* శబ్దంతో ఉన్న వాక్యాల్లో ప్రధాన వాక్యం ప్రశ్న, విధి, వ్యతిరేక, భావి బోధక వాక్యాలే రాగలవు

(185) సుజాత ఊరినుంచి వచ్చిందేమో చూడు (చూశావా, చూడలేదు.)

పై వాక్యాల్లో *చూశాను* అని ప్రయోగిస్తే ఆ వాక్యాన్ని వ్యాకరణ సమ్మతంగా గ్రహించటం కష్టం.

ఓ-శబ్దయుక్త వాక్యాలకు (ఏ-ప్రశ్నలు) ఇట్లాంటి నిబంధన ఉన్నట్టులేదు.

(186) a. సుజాత ఎక్కడుందో చూశాను.

ఈ పై వాక్యానికి ఈ కింది రెండు వాక్యాలూ సమానార్థకాలు.

b. సుజాత ఎక్కడుందో ఆచోటు చూశాను.

c. సుజాత ఉన్నచోటు చూశాను.

ఈ వాక్యాల్లో (b) యత్తదర్థకవాక్యం. (c) విభక్త్యర్థక నామ్నీకరణం ద్వారా ఏర్పడింది. అంటే (186) (a) ని (186) b నుంచి నిష్పన్నమైనట్లుగా భావించవచ్చు. (185) లాంటి వాక్యాలకు సమానార్థకమైన యత్తదర్థక వాక్యాలు కాని, విభక్త్యర్థక నామ్నీకరణ వాక్యాలుగాని లేవు.

**2.84 :** వ్యవహారంలో ఏమో, ఓ శబ్దయుక్త వాక్యాలు సామాన్యవాక్యాలుగా (అశ్లిష్ట)కూడా ప్రయోగం అవుతుండై.

(188) a. సుజాత ఎప్పుడు వస్తుందో !

b. సుజాత వచ్చిందేమో !

వ్యవహరించే విధానాన్నిబట్టి ఈ పై వాక్యాలు భిన్నార్థకాలుకావచ్చు. ఒక అర్థంలో శ్రోతనుంచి సమాధానాన్ని అపేక్షించే పరోక్షప్రశ్నలవుతై. మరో అర్థంలో వక్త తనకు తాను (సమాధానాపేక్షలేకుండా) వేసుకున్న ప్రశ్నలవుతై. రెండో అర్థంలో పై వాక్యాలను కిందివిధంగాకూడా వ్యవహరించవచ్చు.

c. సుజాత ఎప్పుడు వస్తుందో ఏమో !

d. సుజాత వచ్చిందో ఏమో !

మొదటి అర్థంలో ఈ కింది విధంగా వ్యవహరించవచ్చు.

e. సుజాత ఎప్పుడు వస్తుందో నీకు తెలుసా ?

f. సుజాత వచ్చిందేమో నీకు తెలుసా ?

ఈ సూచించిన అర్థభేదం ఉన్నట్టయితే (188) లో (a) (b) లకు క్రమంగా (c, d) లు, (e, f) లు మూలవాక్యాలుగా ప్రతిపాదించటం ద్వారా అర్థభేదాని క్కారణం చూపించవచ్చు.

ఆ ప్రశ్నలకీ ఏమో శబ్దానికి ఏ- ప్రశ్నలకీ ఓ- శబ్దానికీ సంబంధం చూపించబడింది. రెండు ఆ- ప్రశ్నలమధ్య వికల్పాన్ని చెప్పినప్పుడు పరోక్ష ప్రశ్నల్లో ఓ- శబ్దమే వస్తుంది.

(189) a. సుజాత Ph. D. చేస్తుందో, పెళ్ళి చేసుకుంటుందో తెలీదు.

b సుజాత ఎక్కడుందో, ఎప్పుడొస్తుందో తెలీదు.

**2.85 :** క్రియకు నిశ్చయ వ్యతిరేకాల మధ్య వికల్పాన్ని చెప్పినప్పుడు వ్యతిరేక క్రియకు లేదు వికల్పంగా ఆదేశం అవుతుంది. క్రియారహిత వాక్యాల్లో స్థితి బోధకాలకు కాదు శబ్దం, పరిణామ బోధకాలకు లేదు ఆదేశం అవుతుంది. కాలభేదంతో సంబంధం లేకుండానే ఈ ఆదేశం జరుగుతుంది. ఆ ప్రక్రియ ఈ కింది వాక్యాల్లో చూడవచ్చు. ఈ ఆదేశ కార్యాలు పరోక్ష ప్రశ్నల్లోనూ, ప్రత్యక్ష ప్రశ్నల్లోనూ కూడా జరుగుతై.

(190) a. సుజాత ఊరినుంచి రేపు వస్తుందో లేదో తెలీదు.
b సుబ్బారావు మంచివాడో కాదో తెలీదు,
c రెడ్డిగారు ప్రిన్సిపాలు అవుతాడో లేదో

పై వాక్యాల్లో (b) లో అవును శబ్దాన్ని వికల్పంగా మొదటి ప్రశ్నకు చేర్చుకుని అవునోకాదో అనవచ్చు.

**2.86** : *ఏం* శబ్దాన్ని నిర్దేశక వాక్యాలకిచేరిస్తే 'ఎందుకు' అనే అర్థం వస్తుంది. ఉదాహరణకు *నువ్వు మొన్న రాలేదేం ?* అంటే *ఎందుకు రాలేదు* అని అర్థం.

ప్రశ్నార్థకమైన *ఏ*, ఆ శబ్దాలు ఒకే వాక్యంలోరావు.* *ఆయన ఎప్పుడు వస్తాడా ?* అనే వాక్యం ప్రశ్నార్థకంగా తప్పు.

**2.87** : ఒక *ఏ*- ప్రశ్నకు, ఆ-ప్రశ్నకు వికల్పం చెప్పటం సాధ్యం కాదు. కాని వికల్పత్వాన్ని చెప్పిన రెండు ఆ ప్రశ్నలున్నప్పుడు *ఏ*- ప్రశ్నతో వికల్పం సాధ్యమవుతుంది.

(191) a. సుజాత ఎప్పుడు వస్తుందో, రాదో తెలీదు
b. సుజాత ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో రాదో తెలీదు

(191) (a) లో ''ఎప్పుడురాదో'' అనే అన్వయించుకుంటే వాక్యం వ్యాకరణసమ్మతమవుతుంది.

*ఓ*-శబ్దం రెండు వాక్యాల మధ్యేకాక పదాలమధ్య, పదబంధాలమధ్యగూడా వికల్పాన్ని సూచించటానికి ప్రయోగించబడుతుంది.

(192) సుజాత ఇంజనీరునో డాక్టరునో పెళ్లిచేసుకుంటుంది. ప్రశ్నార్థకమైన **ఆ-శబ్దంకూడా క్రియేతరశబ్దాల కిట్లాగే చేర్చవచ్చు.**

(193) సుజాత ఇంజనీరునా ? డాక్టరునా ? పెళ్లిచేసుకుంటుంది ?

(192), (193) వాక్యాల మధ్య కొన్ని సమానాంశాలున్నై. రెండింట్లోనూ *సుజాత పెళ్ళి చేసుకుంటుంది* అనే భాగం సమానం. రెంటిమధ్య వికల్పసంబంధం ఉంది. (193)తో పోలికఉన్న నిర్మాణంనుంచి (192) ను నిష్పన్నంచేయటం సాధ్యంకావచ్చు.

# 3. అనుకృతి

ఒకసారి ప్రయోగించబడిన భాషాంశాలు మరోసారి ప్రయోగించబడటం అనుకృతి. ఒక వక్త ఒక శ్రోతతో అన్నదాన్ని ఇంకో వక్త ఇంకో శ్రోతకు నివేదించవచ్చు. మొదటిశ్రోత, రెండోవక్త ఒకటికావచ్చు. మొదట వక్తృశ్రోతలే రెండోసారికూడా వక్తృశ్రోతలుకావచ్చు, వ్యత్యయంకూడా కావచ్చు. ఒకవక్త తాను అన్నదాన్నే తనకుతానే వక్తగాను, శ్రోతగాను వ్యవహరించి అనుకరించవచ్చు.

**3.1** : దీన్నికూడా నామ్నీకరణంగా భావించవచ్చుగాని, మామూలు నామ్నీకరణాలకన్నా అతివిస్తృతమైన పరిధిగలది కావటంవల్ల దీన్ని వేరుగా భావించాల్సివస్తున్నది. నిజానికి అనుకృతాంశానికి అవధులులేవు. అనుకృతాంశం భాషలో ఏ అంశమైనాకావచ్చు. ఒక వర్ణంకావచ్చు, శబ్దంకావచ్చు, పదంకావచ్చు, వాక్యంకావచ్చు, అనంతమైన వాక్య సమూహంకావచ్చు. అనుకృతాంశానికి భాషావధి కూడాలేదు. ఏ భాషాఅంశాన్నైనా ఇంకోభాషలో అనుకరించవచ్చు. భాషకు దేశకాల నిరవధికత్వాన్ని ఆపాదించేది ఈ అనుకరణ. భాషాంశాలనే అనుకరించాలన్న నియమంలేదు. చేతనాచేతన జన్యమైన ఏ ధ్వనైనా అనుకరణార్హమే. *కుక్క భౌ,భౌ మని అరుస్తున్నది, గజ్జెలు ఘల్లుఘల్లుమంటున్నై* — ఇత్యాది వాక్యాలు అనుకరణ వాక్యాలే. అనుకృతాంశం శబ్దమయంకూడా కానక్కరలేదు. చేష్టాదికాలనుకూడా అనుకరించి భాషతో అనుసంబంధించవచ్చు. ఇంత విస్తృతమైన పరిధిఉన్న అనుకరణవిధానం సర్వభాషా సామాన్యం కావటంలో విశేషంలేదు.

**3.2** : ఈ అనుకరణను ప్రత్యక్షపరోక్ష అనుకృతులుగా విభజించటం పరిపాటి. ఉన్నవి ఉన్నట్టుగా అనుకరించి చెపితే ప్రత్యక్షానుకృతి, అనుకృతాంశంలో విషయాన్ని మాత్రమే అనుకరించిచెప్పేది పరోక్షానుకృతి. ఇదికూడా సర్వభాషా సామాన్యలక్షణమే. అనుకృతిని శబ్దానికి మాత్రమే పరిమితంచేస్తే, ప్రత్యక్షానుకృతిని శబ్దప్రధానమని (code centred), పరోక్షానుకృతిని అర్థప్రధానమని (information centred) చెప్పుకోవచ్చు. పైనచెప్పిన దేశ, కాల, శబ్ద, భాషా నిరవధికత ప్రత్యక్షానుకృతికే వర్తిస్తుంది. పరోక్షానుకృతికి కొన్ని పరిమితులున్నై.

పరోక్షానుకృతి విధిగా భాషాంశమై ఉండాలి. అనుకృతాంశం అనుకరించే భాషలో వ్యక్తీకృతం కావాలి. అనుకృతాంశాన్ని వాక్యపరంగానే వ్యాఖ్యానించాలి. అయితే ఆ వాక్యం సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల్లో ఏదైనా కావచ్చు. (సంయుక్త వాక్యాల్లో సంశ్లిష్ట వాక్యాలు, మళ్ళీ వాటిల్లో సామాన్య వాక్యాలు ఇమిడి ఉండవచ్చు.) వాక్యదైర్ఘ్యానికి భాషలో పరిమితిలేదు గనక అనుకృతాంశం అనంతమైన ఏకవాక్యం కావచ్చు. ఏకభాషా, ఏకవాక్య పరిమితి ఉన్నది పరోక్షానుకృతి.

అనుకరణకు భాషలు భిన్న పద్ధతు లవలంబిస్తై. కొన్ని భాషలు అనుకృతాంశానికి ఏమీ చేర్చకుండానే అనుకరిస్తై. కొన్ని భాషల్లో కొన్ని అపదాలు, లేక పదాలు, పదతుల్యాలు అనుసంధించి ప్రయోగించబడతై. మరికొన్నిట్లో పరోక్ష విధిలో మాత్రమే ఏదో అనుకారకం ప్రయోగించి ప్రత్యక్ష విధిలో అట్లాంటిదేమీ లేకుండా ప్రయోగిస్తారు. తెలుగులోనూ, ఇతర భాషల్లోనూ, వచ్యర్థధాతు నిష్పన్నమైన ఒక అవ్యయాన్ని అనుకారకంగా ప్రయోగిస్తారు. తెలుగులో ప్రత్యక్ష పరోక్షానుకృతులు రెండింట్లోనూ *అని* అనే రూపం ప్రయుక్తమవుతుంది. ఇది *అను* ధాతువునుంచి నిష్పన్నమైన క్త్వార్థక క్రియతో రూపంలో సమానం. కాని ప్రయోగంలో రెండిటినీ వేరుచెయ్యొచ్చు.

(194) a మా పక్కింటావిడ ఉత్తపుణ్యానికి నానామాటలు అని పోయింది,

b. రెండు రెళ్ళు నాలుగన్నందుకు గుండాలు గంద్రాళ్ళు విసిరేదేశం అని శ్రీశ్రీ రాశాడు.

c క్రమక్రమాగత చైతన్య ధనుష్ప్రాణులు ప్రజలు నేడు అని అన్నాడు కుందుర్తి.

పై వాక్యాల్లో *a* లో *అని* అనుకరణంలో వచ్చిన శబ్దంకాదు. 'పక్కింటావిడ' అనే కర్తతో అన్వయించే క్రియ. *b* లో లిఖితరూపమైన భాషానుకృతి ఉంది. *c* లో వాగ్రూపమైన భాషానుకృతి ఉంది, *a* లో *అని* కి ***అనకుండా*** అనే వ్యతిరేక రూపం ఉంది. *b*, *c* లలో *అని* కి అట్లాంటి రూపంలేదు.

*b*, *c* లలో భాషా వ్యవహారం వ్యక్తమైన రూపభేదాన్ని బట్టి భిన్న క్రియలు ప్రయుక్తమవుతై. అయితే క్రియలు (రాయు < వ్రాయు, అను) కేవల వ్యవహారం వ్యక్తమైన అంశాన్నే తెలియజేస్తున్నై. వ్యక్తమైన తీరును తెలియజేసే క్రియలను

కూడా ప్రయోగించవచ్చు. ఆ క్రియలు అనూదిత వ్యవహారంమీద అనువక్త అభిప్రాయాన్ని తెలియజేసేట్టుగానూ ఉండవచ్చు. పై *b*, *c* వాక్యాల్లో " " అని శ్రీ శ్రీ విమర్శించాడు, " " అని కుందుర్తి ఉద్ఘాటించాడు, అని చేరిస్తే అనూది తాంశాలమీద వాఖ్యాన ప్రాయంగా ఉంటై.

పై *b*, *c* వాక్యాలు ప్రత్యక్షానుకరణాలా : పరోక్షాను కరణాలా ? అని గుర్తుపట్టటానికి పనికొచ్చే అంశాలేవీ లేవు. ఇంతకు ముందే ఆయా రచనలతో పరిచయం ఉండటం వల్లగాని, అనూదితాంశంలో ఉన్న శబ్ద సంయోజన బిగువుగా ఉండి మిగతా వాక్యభాగంకన్నా భిన్నంగా ఉండటంవల్ల కాని పై వాక్యాలను ప్రత్యక్షాను కరణాలుగా గుర్తుపట్ట గలుగుతున్నాం.

**3.31** : అనుకృతాంశంలో వక్తృ శ్రోతలను సూచించే పదాలుగాని, ఇతరాంశాలుగాని లేనప్పుడు ప్రత్యక్ష పరోక్షాను కృతుల మధ్య భేదాన్ని గుర్తించటం కష్టం. అనుకృతాంశంలో అట్లాంటి పదాలున్నప్పుడు ప్రత్యక్షాను కృతిలో ఉన్న సర్వనామాలు పరోక్షానుకృతిలో కొన్ని మార్పులు పొందుతై. కింది వాక్య సమూహాల్లో అట్లాంటి వాక్యాల్ని గమనించవచ్చు.

(195) a. (i) నేను నీతో "నేను వస్తాను" అన్నాను ⟶
నేను నీతో (నేను) వస్తానన్నాను.

(ii) నేను అతనితో "నేను వస్తాను" అన్నాను ⟶
నేను అతనితో (నేను) వస్తానన్నాను.

b. (i) నువ్వు నాతో "నువ్వు కొట్టావు" అన్నావు ⟶
నువ్వు నాతో నేను కొట్టా నన్నావు.

(ii) నువ్వు అతనితో "నువ్వు కొట్టావు" అన్నావు ⟶
నువ్వు అతనితో అతను కొట్టా దన్నావు ⟶
? నువ్వు అతనితో తను కొట్టా దన్నావు.

c (i) అతను నాతో "నేను ఉంటాను" అన్నాడు ⟶
అతను (నాతో) అతను ఉంటా నన్నాడు ⟶
అతను (నాతో) తను ఉంటానన్నాడు.

(ii) అతను "నీతో నేను ఉంటాను" అన్నాడు ⟶
అతను నీతో అతను ఉంటా నన్నాడు ⟶
అతను (నీతో) తను ఉంటా నన్నాడు.

(iii) నువ్వు అతనితో "నేను వస్తాను" అన్నావు. ⟶
నువ్వు అతనితో నువ్వు వస్తానన్నావు.

d. (i) అతను నాతో "నువ్వు అడిగావు" అన్నాడు ⟶
అతను నాతో నేనడిగా నన్నాడు.

(ii) అతను నీతో "నువ్వు అడిగావు" అన్నాడు ⟶
అతను (నీతో) నువ్వు అడిగా వన్నాడు.

అనుకృతాంశంలో ఉత్తమపురుష కర్త పరోక్షానుకృతిలో ప్రధాన వాక్యంలో కర్తృపదం ఏదైతే ఆ పదాన్ని గ్రహిస్తుంది. (copy చేస్తుంది.) (195)a వాక్యాల్లో రెండూ అభిన్నం కావటంవల్ల పరోక్షానుకృతిలో ఎటువంటి మార్పు జరగలేదు. 195c. వాక్యాలలో అటువంటి మార్పు జరిగింది. ఈ వాక్యాల్లో అదనంగా గర్భవాక్యంలో పునరుక్తమైన ప్రథమపురుషైకవచన సర్వనామానికి తను ఆదేశమయింది, (ఈ తన్వాదేశం అన్ని భాషల్లోనూ ఉండదు.) ఈ ఆదేశం ఇతరత్రా కూడా జరుగుతుంది.

అనుకృతాంశంలో మధ్యమపురుష కర్త ఉంటే అది వచ్యర్థధాతువు అముఖ్య కర్మ పదాన్ని గ్రహిస్తుంది. (copy చేస్తుంది.) ఈ ప్రక్రియ 195 b, d, వాక్యాల్లో కనిపిస్తుంది. 195d (ii) లో రెండూ అభిన్నం కావటంవల్ల మార్పులేదు. 195b (ii) లో అతనుకు-తన్వాదేశం 195c. వాక్యాలలో లాగా సమ్మతమైనట్టు కనిపించటం లేదు. అందుకే ఇట్లాంటి ఆదేశం చేసిన వాక్యం ముందు ప్రశ్న గుర్తు ఉంచబడింది.

పై వాక్యాల్లో ఈ మార్పులు జరిగినచోట ఉత్తమ, మధ్యమపురుష సర్వనామాల మధ్య వ్యత్యయం జరిగినప్పుడు ఆ వాక్యాలు (195 : b (i), d (i)) భిన్నార్థబోధకాలవుతై. పరోక్షానుకరణలోని ఆ వాక్యాలను ప్రత్యక్షానుకరణ వాక్యాలుగా కూడా వ్యాఖ్యానించే వీలుంది.

ప్రత్యక్ష పరోక్షానుకరణలకు అనుకరణ సూచకం ఒకటే ఉన్న భాషల్లో

గాని, అసలు అనుకరణాన్ని సూచించే (అని వంటి) పదమే లేని భాషల్లోగాని, పరోక్షాను కరణలో మాత్రమే వచ్చే పదం వికల్పంగా లోపించే భాషల్లోగాని (ఇంగ్లీషులో 'that' అట్లా లోపిస్తుంది.), పై రకపు భిన్నార్థకత అదే పద్ధతిలో వస్తుంది. అంటే పైన చెప్పిన సర్వనామాల మార్పులు సర్వభాషలకు సమానమేనని దీని భావం. (తన్వాదేశం అన్ని భాషల్లోనూ ఉండదు.) అంతేకాదు. దీన్నిబట్టి ప్రత్యక్ష పరోక్షానుకృతులను వేరుచెయ్యటానికి అన్నిభాషలకు వర్తించే కాలమానం సర్వనామాల మార్పు మాత్రమేనని కూడా దీన్నిబట్టి చెప్పవచ్చు.

**3.32 :** (195) c. వాక్యాలను పరిశీలిస్తే ఇంకో విషయాన్ని గమనించ వచ్చు. ప్రత్యక్షానుకృతిలో ఉత్తమపురుష సర్వనామం కర్తగా ఉంది. తదను గుణంగా క్రియలో ఉత్తమపురుషను సూచించే క్రియావిభక్తి ఉంది. పరోక్షాను కృతిలో సర్వనామం ప్రథమ, మధ్యమ పురుషలుగా మారినా ఉత్తమ పురుష క్రియావిభక్తి ను అట్లాగే నిలచిఉంది. అంటే కర్త ప్రథమ, మధ్యమ పురుషల్లో ఉండి క్రియ ఉత్తమపురుష సూచకంగా ఉంది. ఇది వ్యాకర్తకు చికాకు కలిగించే సమస్య. దీన్ని పరిష్కరించటానికి రెండుమూడు మార్గాలు కనిపిస్తున్నై.

**3.321 :** ఉత్తమ పురుషకు (నేను కు) తను శబ్దాన్ని ఆదేశంగా చెప్పటం ఒక పద్ధతి. అప్పుడు నేను > అతను > తను అనే విధంగా కాక నేను > తను అనే విధంగా చెప్పాల్సి ఉంటుంది. కాని ఇది అంత సమంజసమైన పద్ధతి కాదు. భాషలో ఇంకెక్కడా నేను కు తను ఆదేశం కాలేదు. ఈ ఒక్క చోట జరిగిందనటంలో ఔచిత్యంలేదు. అదీగాక పైన పేర్కొన్న సర్వనామాల మార్పిడి అన్ని భాషల్లోనూ ఒకే రకంగా ఉంది. అంటే అన్ని భాషల్లోనూ అనుకృత వాక్యంలోని నేను శబ్దం ప్రధాన వాక్యంలో కర్త ననుసరించి మారి ఒక్క తెలుగులో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరిగిందనటానికి సరిఅయిన ఆధారం లేదు. తెలుగు ప్రయోగాల్ని బట్టి చూసినా, ప్రపంచ భాషల పద్ధతిని బట్టి చూసినా నేను > అతను > తను అనే మార్పే సమంజస మైనది.

**3.322 :** క్రియావిభక్తిని ప్రత్యక్షానుకృతిలోనే ప్రతిపాదించి, ఆ తర్వాత నేను శబ్దం అనుకృతాంశంనుంచి ప్రధాన వాక్యంలోకి జరిగిన తరవాత సర్వ నామాల మార్పు జరిగిందనటం రెండోపద్ధతి. దీనికి బలం తక్కువే. ఎక్కడా

జరక్కుండా ఈఒక్కచోటే అనుకృతాంశంలోని కర్త పైవాక్యంలోకి జరిగిందనటం ఎట్లా? పైగా ప్రధానవాక్యంలోకి జరిగినట్టు భావిస్తున్న ఈ పదానికి ఆ వాక్యంలోని మిగతా పదాలకు ఎట్లాంటి సంబంధాన్ని కల్పించగలం? కాబట్టి ఈ పద్ధతికూడా దోషరహితంకాదు.

**3.323 :** సూత్రవర్తన క్రమంలో గతి కల్పించటం మూడో పద్ధతి. దీని ప్రకారం క్రియావిభక్తి సంధాన సూత్రం (agreement rule) మొదట వర్తింపజేసి, సర్వనామ పరివర్తక సూత్రం (pronoun change rule) తరవాత వర్తింపజేస్తే అప్పుడు క్రియ విభక్తి ఉత్తమ పురుషలోనే ఉంటానికి కారణం చూపించగలుగుతాం. అతను కు తన్వాదేశం భాషలో చాలాచోట్ల జరిగేదే కాబట్టి అక్కడ చిక్కులేదు. సూత్రాలు వాక్యంలో ఒక్కో ఉపవాక్యంలో ఒకేసారి వర్తిస్తై. క్రియా విభక్తి సంధాన సూత్రం వాక్య నిర్మాణంలో సాధారణంగా చిట్టచివర వర్తించే సూత్రం. కాని తెలుగు వాక్యాలు ఇందుకు విరుద్ధంగా కనిపిస్తున్నై. ముందటి రెండు పద్ధతుల కన్నా ఈ మూడోపద్ధతి మేలైనదే కాని ఇదికూడా నిష్కంటకం కాదు. కారణం కింద వివరించబడుతుంది.

**3.3231 :** (195) b, d లలో వాక్యాల్ని చూడండి. ప్రత్యక్షానుకరణలో అనుకృతవాక్యంలో మధ్యమపురుష సర్వనామం కర్తగాఉంది. పరోక్షానుకరణంలో అది ప్రధానవాక్యంలో అముఖ్యకర్మ ననుసరించి ప్రథమోత్తమ పురుష సర్వనామాల్లో ఒకటిగా మారింది. కాని ఈ మార్పుతోబాటు మారిన కర్తననుసరించి క్రియావిభక్తికూడా మారింది. అంటే ఇక్కడ సర్వనామ పరివర్తక సూత్రం తరవాత వర్తించింది. అంటే సూత్రాలవరస ఇక్కడ సరిగ్గా తలకిందైంది. అనుకృతాంశంలో ఉత్తమపురుష సర్వనామం ప్రధానవాక్యంలో కర్త ననుసరించి మారింది. క్రియావిభక్తి సంధానసూత్రం సర్వనామ పరివర్తకసూత్రం కంటే ముందు వర్తించింది. అనుకృతవాక్యంలో మద్యమపురుష సర్వనామంకర్తగా ఉంటే అది అముఖ్యకర్మ ననుసరించి మారింది. క్రియావిభక్తిసంధానసూత్రం ఈసారి సర్వనామ పరివర్తకసూత్రం తరవాత వర్తించింది. సర్వనామాల పరివర్తన విధానానికి సూత్రాల వర్తనక్రమానికి ఉన్న సంబంధం ఏమిటో అంతుచిక్కటం లేదు.

**3.3232 :** సర్వనామాల పరివర్తక సూత్రం ఒకటే ననుకొని పైన చర్చ

జరిగింది కాని భిన్నపద్ధతుల్లో జరిగే సర్వనామ పరివర్తనాన్ని రెండుభాగాలు చెయ్యవచ్చు. (1) ప్రధానవాక్యంలో కర్తననుసరించి జరిగే పరివర్తన. ఇక్కడే క్రియావిభక్తి మారకుండా ఉంటుంది (2) ప్రధానవాక్యంలో అముఖ్యకర్మ ననుసరించి జరిగే పరివర్తన. ఇక్కడ సర్వనామ పరివర్తనతోపాటు క్రియావిభక్తి కూడా మారుతుంది. కర్తననుసరించి మారేది ఉత్తమపురుష. అముఖ్యకర్మ ననుసరించి మారేది మధ్యమపురుష. వీటిని ఉత్తమపురుష సర్వనామ పరివర్తక సూత్రం మధ్యమపురుష సర్వనామ పరివర్తకసూత్రం అని రెండుసూత్రాలు చెయ్యొచ్చు. అప్పుడు సూత్రాలవరస ఇట్లా ఉంటుంది.

1. క్రియావిభక్తి సంధానసూత్రం.
2. మధ్యమపురుష సర్వనామ పరివర్తక సూత్రం.
3 క్రియావిభక్తి సంధానసూత్రం.
4. ఉత్తమపురుష సర్వనామ పరివర్తక సూత్రం.

**3.3233 :** ఒకే ఉపవాక్యంలో క్రియావిభక్తి సంధానసూత్రం రెండు సార్లు వర్తించటం సాధారణంగా జరగదు. కాగా, ఒకేరకపు సర్వనామ పరివర్తనకు రెండు సూత్రాలు తయారుచెయ్యటంకూడా అంతపొదుపైన పద్ధతికాదు. అందువల్ల 2,4 సూత్రాలను కలిపి ఒకే సర్వనామ పరివర్తక సూత్రాన్ని ఉంచటం వాంఛనీయం. సర్వనామ పరివర్తకసూత్రం సర్వభాషాసామాన్యం. క్రియావిభక్తి సంధాన సూత్రాన్ని చివర ఉంచటమే సమంజసం. అయితే ఈ సూత్రాన్ని (195) c. లో నిష్పన్నమైన వాక్యాలమీద వర్తించనియ్యకుండా నిరోధించగలిగితే ఈ సమస్యను పరిష్కరించినట్టే. "ప్రథమపురుష పరివర్తితసర్వనామం కర్తగాఉన్న వాక్యాల్లో వర్తించరాదు" అనే ఆంక్షను క్రియావిభక్తి సంధానసూత్రానికి విధించి ఆ పని సాధించవచ్చు. ఈ రకమైన ఆంక్ష సూత్రానికి అధికభారాన్ని ఆపాదించేమాట నిజమే ! అయితే ఈ ఆంక్ష ఒక్క తెలుక్కి మాత్రమే కాకమిగతాభాషలకుకూడా అవసరంకావచ్చు. సర్వభాషల్లోనూ ప్రత్యక్షానుకరణను పరోక్షానుకరణంగా పరివర్తింపజేసే విధానం ఉంది. ఆ సందర్భంలో సర్వనామ పరివర్తన భాషా సామాన్యలక్షణం. కర్తననుసరించి క్రియావిభక్తిని సంధించే పద్ధతిఉన్న భాష లన్నిట్లో ఈ సమస్య వస్తుంది కాబట్టి ఈ ఆంక్షభాషా సిద్ధాంతానికే అవసరం

కావచ్చు కాబట్టి ఈ అంశ భాషాసిద్ధాంతంలో భాగంగానే ప్రతిపాదించబడుతున్నది. ఇంతకన్నా మేలైన విధానం దొరికేవరకూ ఇదే మార్గం.

**3.4** : (195) లో ఉదాహరించిన వాక్యాల్లో ఇద్దరు శ్రోతలు, ఇద్దరు వక్తలను మాత్రమే భావించి ఉదాహరించినవి కాని ఈ వాక్యాల్లో వక్తృశ్రోతల సంఖ్యకు పరిమితిలేదు. అనుకరణాన్ని పునఃపునరనుకరించటానికి సహజంగా వీలుంది. అనుకృతాంశ దైర్ఘ్యానికి పరిమితిలేనట్టుగానే అనుకరణవిధానానికికూడా పరిమితిలేదు. ఈ కింది బొమ్మలో ఈ పద్ధతిని గ్రహించవచ్చు.




ఇట్లా బొమ్మని అనంతంగా పెంచవచ్చు. ఇట్లా అనంతంగా అనుకరించే అవసరం వ్యవహారంలో ఉండదు. అయితే భాష అందు కనుమతిస్తుంది.

(196) ఎల్లమ్మ ఎవరితోనో లేచి పోయిందని పుల్లమ్మ మల్లమ్మతో అన్నదని రంగమ్మ మంగమ్మతో చెప్పిందని ఈరమ్మ పేరమ్మతో అన్నదని అచ్చమ్మ పిచ్చమ్మతో చెప్పిందని ... ... ...

పై వాక్యాన్ని ఇట్లా అనంతంగా పొడిగించుకుంటూ పోవచ్చు.

**3.5** : అనుకృత వాక్య భేదాల్నిబట్టి పరోక్షానుకరణలో కొన్ని మార్పులు జరుగుతై.

(197) a సుజాత సుబ్బారావుతో "నువ్వు మా యింటికి రా" అన్నది.

b సుజాత(సుబ్బారావుతో) సుబ్బారావును తన ఇంటికి రమ్మన్నది.

ఇందులో జరిగిన మార్పులివి : 1. పరోక్షవిధిలో విధిక్రియకు మ కారాగమం జరిగింది. రా + మ్ > రమ్మ్ 2. అనుకృత వాక్యంలో కర్తకు ప్రధాన వాక్యంలో అముఖ్యకర్మ ఆదేశం అయింది. 3. కర్తృపదంగా గ్రహించినది ప్రథమపురుష నామం గనక మా - కు తన అనే శబ్దం ఆదేశమయింది. 4. కర్తృపదం గ్రహించిన సుబ్బారావు అనే నామానికి ద్వితీయా విభక్తి చేరింది.

**3.51** : వీటిల్లో మొదటి మూడు మార్పులూ ఇంతకు ముందు విపులంగా చర్చించినవే. కాకపోతే అక్కడ క్రియావిభక్తి సంధాన సూత్రప్రవర్తన ప్రధాన విషయం కనక సర్వనామ పరివర్తనం గురించి మాత్రమే పేర్కొనబడింది. క్రియావిభక్తులు సర్వనామాలమీదనే ఆధారపడి ఉండటం భాషా సామాన్య లక్షణం. అయితే ఈ పరివర్తనలో సర్వనామాలకు సర్వనామాలే ఆదేశం కావాలనే నియమం లేదు. కర్తృ అముఖ్యకర్మ స్థానాల్లో ఏనామం ఉంటే ఆనామమే సూత్రంలో పేర్కొన్న ప్రకారం ఆదేశమవుతుంది. అసలు చిక్కు నాలుగో మార్పుదగ్గరే. ద్వితీయా విభక్తి కర్మార్థంలో నామానికి చేరుతుంది. పై వాక్యంలో 'సుబ్బారావు'ను కర్మగా భావిస్తే 'అన్నది' అనే క్రియకే భావించాలి. అనుకృతవాక్యం (గర్భ వాక్యం=embedded sentence) లో కర్తృపదం ప్రధాన వాక్యం (గర్భివాక్యం = matrix sentence) లో కర్మపదంగా జరిగిందనాలి. దీన్ని తెలుగులో కర్త్రుద్ధరణ సూత్రానికి (subject raising) ఉదాహరణగా భద్రిరాజు కృష్ణమూర్తిగారు భావిస్తున్నారు. గర్భవాక్యంలో కర్త గర్భివాక్యంలో కర్మస్థానానికి ఎగరటం కర్త్రుద్ధరణ. ఇట్లా కర్మస్థానానికి ఎగరటం వల్లనే పై వాక్యంలో ద్వితీయావిభక్తి చేరిందని దీనిభావం. కాని ఈ ప్రతిపాదనకి తగినంత బలం లేదు. అను ధాతు నిష్పన్న క్రియకు మనుష్య వాచక నామాన్ని ముఖ్యకర్మగా వాడినప్పుడు నిందార్థమే స్ఫురిస్తుంది (చూ. వాక్యం. 194a). కాని (197) b లో ఆ అర్థం లేదు. అర్థభేదాన్ని నిర్లక్ష్యం చేసినా చిక్కు తొలగదు. ఉదాహరణకి ఈ కింది వాక్యం చూడండి.

(198) a. సుజాత సుబ్బారావుకు "నువ్వు మా యింటికి రా" అని చెప్పింది.

b సుజాత (సుబ్బారావుకు) సుబ్బారావును తన ఇంటికి రమ్మని చెప్పింది.

కర్తృద్ధరణ సూత్రపరంగా చెపితే (198) b లో *సుబ్బారావును చెప్పింది* అనే క్రియకు ముఖ్యకర్మగా భావించాలి. చెప్పు అనే క్రియ విషయార్థక నామాలనే (విషయం, సంగతి, మాట, కథ మొ॥) కర్మపదాలుగా గ్రహిస్తుంది కాని మనుష్య వాచక నామాలను ముఖ్యకర్మలు (direct objects) గా గ్రహించ గలిగినట్టు భాషలో సాక్ష్యం లేదు. అందువలన అనుకృత (పరోక్ష) విధి వాక్యాలను కర్తృద్ధ రణ సూత్రవిషయాలుగా గ్రహించటం కుదరదు.

**3.52 :** తగినంత బలం లేకపోయినా ఆలోచించదగిన ఇంకో పరిష్కార మార్గం ఉంది. విధివాక్యాల్లో *అని* విధిక్రియతో కల్సిపోయి ఏకపదంగా ఏర్పడింది. అంటే పరోక్ష విధిలో *అని* ని క్రియ నుంచి వేరుచేసి వాక్యాన్ని ప్రయోగించలేం. అందువల్ల పరోక్ష విధిలో క్రియ *అని* తో కలిసి మనుష్యవాచక శబ్దాన్ని కర్మగా గ్రహించ గలిగిన సకర్మక క్రియగా ఏర్పడిందని చెప్పవచ్చు. ఇది ఒక ఊహ మాత్రమే.

**3.53 :** విధివాక్యాలు ఆజ్ఞ, అభ్యర్థనాద్యర్థకాలు బోధిస్తై. ఈ వాక్యాల గుప్త నిర్మాణంలో పై అర్థాల్లో ఒక క్రియను ప్రతిపాదించాల్సిన అవసరాన్ని శాస్త్రజ్ఞులు ఇంతకు ముందే గుర్తించారు. ఆ ప్రతిపాదన నిలబడితే విధివాక్యాల కర్తలను అట్లాంటి క్రియకు కర్మగా ప్రతిపాదించవచ్చు. అంటే విధివాక్యాల గుప్త నిర్మాణం (deep structure) లో విధివాక్య, గర్భవాక్యాలను ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఉదాహరణకు (198) వాక్యాలకు ఈ కింది వాక్యాన్ని గుప్త నిర్మాణ సదృశంగా ప్రతిపాదించటానికి వీలుంది.

(199) సుజాత సుబ్బారావును "నువ్వు మా యింటికిరా" అని కోరింది
(అడిగింది, అభ్యర్థించింది, ఆజ్ఞాపించింది.)

ఈ ప్రతిపాదన నిలబడితే 198లో వాక్యాలను కొన్ని లోపకార్యాల ద్వారా సాధించవచ్చు. 198b లో *సుబ్బారావు* అనే పదరూపాన్ని గుప్త నిర్మాణం నుంచే సాధించే వీలుంది. అయితే ఈ రకమయిన వివరణకైనా పూర్తి వివరాలు పరిశో ధిస్తేనే కాని బలంచిక్కదు.

ప్రత్యక్షవిధులను పరోక్షవిధులనుంచి, ప్రత్యక్ష ప్రశ్నలను పరోక్షప్రశ్నల నుంచి నిష్పన్నం చెయ్యవచ్చునని ఇటీవల కొందరు శాస్త్రజ్ఞులు ప్రతిపాదించారు.

నిశ్చయార్థక వాక్యాలనుకూడా స్వతంత్ర వాక్యాలుగాకాక ఇంకోవాక్యంలో గర్భ వాక్య నిర్మాణంనుంచి నిష్పన్నంచెయ్యాలనే ప్రతిపాదనకూడా ఉంది. ఉదాహరణకు (200) b. నుంచి లోపకార్యాలద్వారా (200) a. ని నిష్పన్నంచేయవచ్చు.

(200) a. "ఈ దేశంలో ప్రజాస్వామ్యం లేదు" అని నేను నీతో అంటున్నాను.

b. "ఈ దేశంలో ప్రజాస్వామ్యం లేదు."

**3 54 :** అనుకృతికి, దీనికి ఉన్న సామ్యభేదాలను గమనించటం అవసరం. అనుకృతిలో అనుకృతాంశం పునశ్చర్వితం. ఇక్కడ మొదటిసారి అన్నట్లుగా భావించబడింది. అనుకృతిలో వక్త, అనువక్త, శ్రోత, అనుశ్రోత వుంటారు. ఈ ఇద్దరూ ఒకటే కావటానికి వీలుండొచ్చు. అది వేరే విషయం కాని అనుకృతాంశానికి భాషాపరంగా అనుకృతిలో ప్రథమేతరస్థితి ఉంటుంది. (200) లో ఒకేవక్త, ఒకే శ్రోత, భావించబడ్డారు.

**3.4** వేరాలోఇచ్చిన బొమ్మలో 'వ[1] శ్రో[1]' తో సూచించినస్థితి (200) లో సూచించిన స్థితికి సమానం. భావం భాషాస్థితిని పొంది వక్తృముఖంగా మొదటిసారి బహిర్గతమైనపుడు వక్తృశ్రోత లెవరెవరో ఇద్దరికీ తెలుసు కాబట్టి భాషలో ఆస్థితిలో (మొదటిస్థితిలో) వక్తృశ్రోతల వ్యక్తీకరణ సాధారణంగా జరగదు. వక్తృశ్రోతలు లేకుండా భాషకు స్థితిలేదు. వక్తృశ్రోతలు ఒకరే అయితే బహిరాలోచనారూపం అవుతుంది.

(200) a లో వాక్యానికి, అనుకృతికి ఉన్న సామ్యం స్పష్టమే. ఆ వాక్యంలో ప్రధానక్రియను భూతకాలికంచేస్తే ఆ వాక్యానికి పూర్వస్థితి స్ఫురణకలుగుతుంది. భవిష్యకాలికంచేస్తే ద్వితీయస్థితి సంభావ్యమవుతుంది. వర్తమానకాలేతరమైన ఏ క్రియను వాడినా అనుకృతాంశానికి నైకస్థితి ఆపాదితమవుతుంది. నైకస్థిత్యాపాదితమైన ఏ వాక్యమైనా అనుకరణ వాక్యమే.

అంటే అనుకరణ, నిరనుకరణ వాక్యాలకు భేదం ఏక, నైకస్థితుల్లోనే ఉంది. వాగ్వ్యాపారంలో పాత్రలు ద్వితీయ స్థితిలో ఒకరే అయినా కాలభేదాన్నిబట్టి భిన్నాలుగా భావిస్తే అనుకరణలో నైకవక్తృ శ్రోతృవర్గం, నిరనుకరణలో ఏక వక్తృ శ్రోతృవర్గమూ ఉంటుందని చెప్పవచ్చు.

పై చర్చను బట్టి సర్వభాషనూ అనుకరణ సన్నిహితమైన నిర్మాణం నుంచి నిష్పన్నం చెయ్యొచ్చునని చెప్పవచ్చు. ఇదే నిజమైతే (197) b. లో ద్వితీయా విభక్తి కొత్తగా వచ్చింది కాక గుప్త నిర్మాణపు సంబంధావశేషంగా భావించవచ్చు.

పరోక్షవిధిలో గమనించవలసిన ఇంకో చిన్న విశేషం ఉంది. ప్రత్యక్ష విధిలో ఏక బహువచన భేదం క్రియలో వ్యక్తమవుతుంది. ఉదాహరణ 'రా', "రాండి'. పరోక్ష విధిలో ఏకవచన బహువచనాలు రెండిట్లోనూ ఒకే క్రియారూపం ఉంటుంది. ఉదా : 'అతన్ని రమ్మని చెప్పు', 'వాళ్లని రమ్మని చెప్పు' పరోక్ష విధిక్రియలో లింగపురుష భేదంకూడా వ్యక్తం కాదు.

**3.6** : ప్రశ్నార్థకాది వాక్యాల్లో ఇంతకుముందు పేర్కొన్న కర్తృపద పరివర్తనాది మార్పులు తప్ప వెరే మార్పులు జరగవు. కాకపోతే ప్రధానక్రియ అను ధాతు నిష్పన్నంకాక *అడుగు* లేక పశ్నను సూచించే అట్లాంటి క్రియ ఏదన్నా ఉంటుంది.

(201) a. (*i*) "నువ్వు ఎక్కడికి వెళ్తున్నావు" అని అన్నాడు.
(*ii*) నేనెక్కడికి వెళ్తున్నానని అడిగాడు.
b. (*i*) "నువ్వు రేపొస్తావా" అని అన్నాడు.
(*ii*) నేను రేపు వస్తానా / రేపు వస్తానేమో } అని అడిగాడు.

ఈ పై వాక్యాల్లో ప్రత్యక్ష పరోక్షానుకరణాలు రెండిట్లోనూ *అడుగు* క్రియను ప్రయోగించవచ్చు. కాని పరోక్షాను కరణలో అను క్రియా ప్రయోగం ఉండదు. ఆ ప్రశ్నకు ఏమో ఆదేశం వికల్పంగా అవుతుంది.

**3.71** : ప్రథమ మధ్యమ పురుష సర్వనామాలున్న క్రియారహిత వాక్యాలను అనుకరించినప్పుడు కూడా ఇంతకు ముందు పేర్కొన్న విధంగానే సర్వనామాల్లో మార్పులు జరుగుతై.

(202) a. (*i*) అతను "నేను విప్లవ కవిని" అన్నాడు.
(*ii*) అతను తను విప్లవ కవిని అన్నాడు.
(*iii*) అతను తను విప్లవ కవినని చెప్పాడు.

b. (i) అతను నాతో "నువ్వు అభ్యుదయ కవివి" అన్నాడు.
(ii) అతను నాతో నేను అభ్యుదయ కవిని అన్నాడు.
(iii) అతను నన్ను అభ్యుదయ కవి అన్నాడు.

c. (i) నువ్వు అతనితో "నువ్వు జాతీయ కవివి" అన్నావు.
(ii) నువ్వు అతనితో అతను జాతీయ కవి అన్నావు.
(iii) నువ్వు అతన్ని జాతీయ కవి అన్నావు.

d. (i) నువ్వు నాతో "నేను ప్రపంచ కవిని" అన్నావు.
(ii) నువ్వు నాతో నువ్వు ప్రపంచకవి నన్నావు.
(iii) నువ్వు నాతో నువ్వు ప్రపంచకవినని చెప్పావు.

e. (i) నువ్వు నాతో "నువ్వు కవివి కాదు" అన్నావు.
(ii) నువ్వు నాతో నేను కవిని కాదన్నావు.
? (iii) నువ్వు నన్ను కవి కాదన్నావు.

(202) a, d వాక్యాలలో వక్త, అనువక్త (అనుకర్త) ఒక్కరే. ఈ సమూహంలో (a iii, d iii) వాక్యాలు (a ii, d ii) వాక్యాలకన్నా మెరుగ్గా ఉన్నై. క్రియారహిత వాక్యాలలో రెండోదళం మొదటి దళానికి విశేషణం. వక్త తన్ను గురించి వ్యాఖ్యానించుకునేటపుడు అన్నాడు అనేకన్నా చెప్పాడు అని ప్రయోగిస్తే మెరుగ్గా కనిపిస్తున్నది. ఇది ఆ వాక్యాల వ్యాకరణ వివరణకాదు. ఎందుకు మెరుగ్గా కనిపిస్తున్నయ్యో ప్రస్తుతానికి చెప్పలేకపోయినా, చెప్పాల్సిన బాధ్యత ఉంది.

(b iii), (c iii) వాక్యాల్లో నన్ను, అతన్ని అనే నామపదాలు అను అనే క్రియకు కర్మపదాలు. ఇవి క్రమంగా b (ii), c (ii) వాక్యాల్లో కర్తృపదాలు. అందువల్ల వీటిని కర్తృద్ధరణ ప్రక్రియకు ఉదాహరణగా గ్రహించే వీలులేక పోలేదు. అయితే (iii) సంఖ్య ఉన్న వాక్యాలు (ii) సంఖ్య ఉన్న వాక్యాలనుంచి నిష్పన్నం చేసినపుడే అట్లాంటి వివరణను గురించి ఆలోచించటం సాధ్యమవుతుంది. పైగా క్రియలున్న వాక్యాలతో ఇట్లాంటి వాక్యాలు సాధ్యం కావు.

(203) a. నువ్వు అతనితో "నువ్వు తిన్నావు" అన్నావు.
b. నువ్వు అతనితో అతను తిన్నా డన్నావు.
? c. నువ్వు అతన్ని తిన్నా డన్నావు.

అట్లాగే 202 b (iii), c (iii) వాక్యాల్లో అముఖ్య కర్మపదం వాడితే వాటి వ్యాకరణ బద్ధత సందేహాస్పద మవుతున్నది.

? (204) a. అతను నాతో నన్ను అభ్యుదయ కవి అన్నాడు.
b. నువ్వు అతనితో అతన్ని జాతీయకవి అన్నావు.

అనుకరణంలో సమాపక క్రియగా వచ్చే అను క్రియకూ, ఈ పై వాక్యాల్లో అను క్రియకూ భేదం కనిపిస్తున్నది. ఇక్కడ మనుష్యవాచక నామాలను ముఖ్య కర్మ పదాలుగా గ్రహించగలిగిన అను ప్రయుక్తమయింది. అందువల్లే పై వాక్యాల్లో అముఖ్య కర్మపదం సరిపడటం లేదు. అట్లా వేరు చేసినప్పటికీ ఇక్కడ కర్తృద్ధరణను ఊహించడానికి వీలుంది. కర్తృద్ధరణ జరిగిన తరవాత అముఖ్య ముఖ్య కర్మపదాలు రెండూ మనుష్య వాచకాలయినప్పుడు అముఖ్య కర్మను నిత్యంగా లోపింప జెయ్యాలి. ఇక్కడ కర్తృపదం పైకి తొలగిపోయింది కాబట్టి క్రియా విభక్తి సంధాన సూత్రం పర్తించదు.

**3.72 :** పైన మనుష్య వాచక నామం ముఖ్య కర్మపదంగా గ్రహించ గలిగిన క్రియగా అను వివరించబడింది. మనుష్యేతర వాచక శబ్దాల్లో కూడా ఇట్లా ప్రక్రియను చూపించవచ్చు.

(205) a. (i) నువ్వు "అది దొంగ కుక్క" అన్నావు.
(ii) నువ్వు దాన్ని దొంగ కుక్క అన్నావు.
b (i) నువ్వు "అది పనికి మాలిన డిగ్రీ" అన్నావు.
(ii) నువ్వు దాన్ని పనికి మాలిన డిగ్రీ అన్నావు.

దీన్నిబట్టి కర్తృద్ధరణ శబ్ద కర్మేతర ధాతువు ఉన్నపుడే జరుగుతుందని, అను శబ్ద కర్మకంగాను, శబ్దేతర కర్మకంగానూ గుర్తించాల్సి ఉంటుందని తీర్మానించుకోవచ్చు. కేవల శబ్ద కర్మధాతువులను (ii) గుర్తులున్న వాక్యాలలో ప్రయోగించలేము. అంటే నువ్వో *దాన్ని దొంగ కుక్క* అని చెప్పావు, *నువ్వో **దాన్ని పనికిమాలిన డిగ్రీ** అని చెప్పావు అనే వాక్యాలు వ్యాకరణ సమ్మతం కాదన్నమాట. అనుకృత వాక్యాలు క్రియారహిత వాక్యాలయినప్పుడే ఈ కర్తృద్ధరణ కనిపిస్తున్నది. ఈ రకపు వాక్యాల్లో రెండోదళం మొదటి దళానికి విశేషణ సమం కావటం ఇందుకు కారణం కావచ్చు.

**3.811 :** అనుకరణగా స్పష్టంగా చెప్పటానికి వీల్లేని వాక్యాల్లో కూడా *అని* ప్రయోగం కనిపిస్తున్నది. అనుకృతాంశానికి నైకస్థితి ఉన్నప్పుడే అనుకరణ అంటాం. అట్లాంటప్పుడు ప్రధాన వాక్యంలో శబ్ద కర్మధాతువులుంటై అట్లా కాకుండా ఒక విషయం ఖాషీకరించిన ప్రథమస్థితిలోనే *అని* ప్రయోగమవుతుంది. అట్లాంటిదాన్ని భాషానుకరణగా కాక విషయానుకరణగా గ్రహించాలి. దీన్నే విషయార్థక నామ్నీకరణమని పూర్వం వ్యవహరించాను ఇందులో భౌతిక ప్రపంచంలో జరిగిన విషయాలుగాని, మనః ప్రపంచంలో సంభావ్య విషయాలు గాని అనుకృతమవుతై. ఈ అనుకృతాంశాలు జ్ఞానార్థిక క్రియలతో ప్రయుక్తమవుతై.

(206) a. పెరిగిన ధరలు ఎప్పుడూ తగ్గవని నాకు తెలుసు.
b విశాఖ పట్టణంలో ఉప్పు పండుతుందని నేనెరుగుదును.
c కొద్దిరోజుల్లో ఎన్నికలు జరుగుతయ్యని విన్నాను.

(206) c లో *విను* శబ్ద కర్మధాతువుగా గ్రహిస్తే ఆ వాక్యాన్ని విన్నానని, జ్ఞానార్థక ధాతువుగా గ్రహిస్తే ఆ విషయాన్ని శ్రవణేంద్రియం ద్వారా *గ్రహించాను* అని అర్థాలు.

**3.812 :** విషయార్థంలో వచ్చే నామ్నీకరణాలు విధి, ప్రశ్నార్థక వాక్యాలకు సాధ్యంకావు. నామ్నీకృత వాక్యాలు *అనుకొను*, *ఆశించు*, *ఎరుగు*, *తెలియు*, *విను* వంటి బుద్ధి, జ్ఞానార్థక ధాతువులు క్రియలున్న వాక్యాల్లో గర్భితాలై ఉంటై. *అని* తో ఉన్న వాక్యాలేవీ సాధారణ క్రియారహిత వాక్యాలతో ప్రయుక్తం కావు. కాని ఈ కింది వాక్యాల్లో ప్రయోగాల్ని గమనించండి.

(207) a సామ్యవాదానిదే అంతిమ విజయమని నానమ్మకం.
b. ఈ దేశం బాగుపడుతుందని నా ఆశ.
c. ఎన్నికల ద్వారా సోషలిజం రాదని కొందరి అభిప్రాయం.

ఈ పై వాక్యాల్లో *నానమ్మకం*, *నాఆశ*, *కొందరి అభిప్రాయం* అనే పదబంధాలు నామబంధాలే. అయితే వాటిని నేను *నమ్ముతున్నాను*, నేను *ఆశిస్తున్నాను*, *కొందరు అభిప్రాయపడుతున్నారు*. అనే వాక్యాలనుంచి క్రమంగా నిష్పన్నం చేయాలి. సమీకరణ వాక్యాలకూ (equational sentences) (197) లో వాక్యాలకూ భేదం స్పష్టమవుతూనే ఉంది.

**3.821 :** అని తో ఉన్న విషయార్థక నామం ***ఉండు*** క్రియాయోగంలో కాంక్షార్థ మవుతుంది.

(208) నాకు ఇవాళ సినిమాకు వెళ్ళాలని ఉంది.

దీనిలో నిర్మాణాన్ని ఈ కింది విధంగా చూపించవచ్చు.

(209) a. (*i*) నాకు | ఒక కోరిక ఉంది. — గర్భివాక్యం

(*ii*) నేను ఇవాళ సినిమాకు వెళ్ళాలి గర్భవాక్యం

గర్భవాక్యంలో కాంక్షార్థకనామం స్థానంలో సంపూర్ణవాక్యం ప్రయోగించవచ్చు. ఈ వాక్యం ఆ కోరికను స్పష్టపరుస్తుంది. అట్లా ప్రయోగించినప్పుడు అని చేరుతుంది. గర్భి వాక్యంలో కు బంధంతో సమబోధకమైనప్పుడు గర్భవాక్యంలో కర్త లోపిస్తుంది. ఇట్లా సమబోధకం కానప్పుడు ఈ లోపకార్యం జరగదు. ఉదాహరణకు "[ [నాకు [మా ఆవిడ సినిమాకు వెళ్లాలని] ఉంది] ]" అన్న వాక్యంలో గర్భ వాక్యకర్త లోపించదు.

**3.822 :** పైన గర్భివాక్యంలో వెళ్ళాలి అనే క్రియకు మూలరూపం **వెళ్ల + వలయు.** అదే కొన్ని వ్యాకరణ కార్యాలవల్ల **ఆలి, ఆల** అని మారింది. ఇదే అర్థంలో ఈ కింది వాక్యాన్ని కూడా ప్రయోగించ వచ్చు.

(210) నాకు ఇవాళ సినిమాకు వెళదామని ఉంది.

ఇక్కడ ***దాం*** అనే క్రియాంత ప్రత్యయం వ్యస్తంగా ఉభయ ప్రార్థనంలో వస్తుంది ఉదా : ***మనం ఇవాళ సినిమాకు వెళదాం*** కాని (200) లో ఇది ఉభయ ప్రార్థనం కాదు. అందువల్ల గుప్త నిర్మాణంలో ఉభయ ప్రార్థన క్రియను ప్రతిపాదించే వీలులేదు. గర్భివాక్యంలో కు బంధంతో గర్భవాక్యంలో కర్త సమబోధకమైనప్పుడు వికల్పంగా ***దాం*** అనే రూపాన్ని సూత్రంద్వారా ఆదేశంగా తెచ్చుకోవటమే మార్గం. సమబోధకం కానప్పుడు ఈ ఆదేశం జరగదు. ఉదాహరణకు ఈ కింది వాక్యం వ్యాకరణ విరుద్ధం.

* (211) నాకు మా ఆవిడ సినిమాకు వెళ్దాం అని ఉంది.

అని ప్రయోగించిన వాక్యాలన్నిటినీ విశేషణాలుగా చేసి వాక్యవిషయాన్ని సూచించే నామాలముందు ప్రయోగించవచ్చు. అను ధాతునిష్పన్నమైన అన్న, అనే అనే విశేషణ రూపాలు అనుబంధాలుగా చేరి వాక్యాన్ని విశేషణాలుగా మారుస్తై. వాక్య విషయాన్ని సూచించే మాటలు : *విషయం*, *సంగతి*, *మాట*, *ప్రశ్న*, *సందేహం*, విశేష్యాలుగా ప్రయుక్త మవుతై.

**3.83 :** *అని* తో ఉన్న వాక్యాలను *అంటే* చేర్చి చేదర్థకంగానూ, *అన్నా* చేర్చి అప్యర్థకంగానూ, *అని* చేర్చి క్త్వార్థ కంగానూ, *అంటూ* చేర్చి శత్రర్థకంగానూ ప్రయోగించవచ్చు. వాక్యానికి *అని* అనే అవ్యయాన్ని చేరిస్తే నామం అవుతుందని స్థూలంగా చెప్పుకోవచ్చు. ఇట్లా *అను* అనే ధాతువు చేరుతుందనటంవల్ల సాధారణంగా ధాతువు నుంచి నిష్పన్నమయ్యే వివిధ అసమాపక క్రియా రూపాలను సాధించటం ప్రయోజనం.

(212) a. వాడు వచ్చాడంటే బుర్ర రామకీర్తన పాడిస్తాడు.
b. వాడు వస్తున్నాడంటే అందరికీ హడలు.
c. చుట్టాలు వస్తారంటే ఐస్త్రీవాళ్లు భయపడతారు.
d. తన్నానంటే మూతిపళ్లు రాలతై.
e. నేనీపని చేస్తున్నానంటే నా సొంతంకోసం కాదు.
f నేను పాఠం చెప్పుతానంటే పిల్లలు పారిపోతారు.

పై c, f వాక్యాల్లో *అంటే* అనుకరణలో వచ్చిన అను ధాతు నిష్పన్నమో? ప్రధాన క్రియగా వచ్చిన అనుధాతు నిష్పన్నమో చెప్పటం కష్టం. a, b, d, e లలో ప్రయోగించిన *అంటే* ని అనుకరణలో వచ్చిన *అంటే* గా గుర్తించవచ్చు. c, f లలో *అనిఅంటే* అనే రూపాన్ని ప్రయోగించవచ్చు. మిగతా వాక్యాలలో అట్లా ప్రయోగించలేము. అనుకరణలో నుంచి c, f లను మినహాయించాలా? అనేది వెంటనే సమాధానం చెప్పటానికి వీలులేని ప్రశ్న. వీటిల్లోను మళ్ళీ a, d లలో అనుకృత వాక్యంలోని ప్రధానక్రియనే చేదర్థకంగా మార్చి వస్తే, *తంతే* అని వాడినా అర్థంభేదం కనిపించటంలేదు.

కాంక్షార్థంలో *అంటే* ప్రయోగించి చేదర్థకం చెయ్యవచ్చు.

g. సినిమాకు వెళ్దామంటే పైసల్లేవు.

h. సినిమాకు వెళ్ళాలంటే పైసల్లేవు.

అప్యర్థక రూపాలు కూడా ఈ కాంక్షార్థంలోనే సాధ్యమవుతున్నై.

i. ఉద్యోగస్థులకు నెలాఖర్లో కావాలన్నా 10 రూ. దొరకవు.

j. కాఫీ తాగుదామన్నా నాదగ్గర పావలా లేదు.

k. టీచరు వచ్చాడన్నా పిల్లలు క్లాసుకి రారు.

పై (k) వాక్యంలో అన్నా అనే రూపం అనుకరణలో వచ్చే అను నుంచి నిష్పన్నమయిందని చెప్పలేం. ఈ వాక్యంలో *అని అన్నా* అనే రూపం వాడవచ్చు. మిగతా వాక్యాలలో అట్లా వాడితే అర్థభేదం వస్తుంది. (g), (h) వాక్యాల్లో అట్లా వాడటానికికూడా వీల్లేదు

l. నేనురోజూ త్వరగా ఇంటికి రానని వగా ఆవిడ విసుక్కుంటుంది.

m. నీ పాదాలముందు వాలిపోతానంటూ సుజాత సుబ్బారావుకు ఉత్తరం రాసింది.

(m) లో అనుకృత వాక్యంలో కర్త, ప్రధాన వాక్యంలో కర్త ఒకటే. అట్లా లేకపోతే వాక్యం వ్యాకరణ విరుద్ధమవుతుంది. (l) లో అట్లాంటి నిబంధన లేదు. కాని (m) లో *అంటూ* అనుకృతమైన *అను* ధాతునిష్పన్నమై క్రియ అని చెప్పలేం. ఇక్కడకూడా *అని అంటూ* అనే సంయుక్తరూపాన్ని ప్రయోగించవచ్చు.

(212) లో ప్రయోగించిన వాక్యాలు వ్యాకరణ వివరణాపేక్షకాలు, కాని వీటి విశేషాలు ఇంకా పరిశోధన కందలేదు. అందువల్ల ఇంతకన్నా చెప్పగలిగింది లేదు. వీటిల్లో (l) వాక్యంవంటి వాక్యాలను గురించి కొంతవరకు చెప్పటానికి వీలుంది.

**3.84 :** అందుకు ముందుగా ఈ కింది వాక్యాలను పరిశీలించండి.

(213) a. మంచి కూరల్లేవని భోజనం మానేశాను.

* b. జీడిపప్పు లేదని ఉప్మా రుచిగాలేదు.

c. యజమాని వచ్చాడని కుక్క తోకాడిస్తున్నది.

? d. నువ్వు తొందరగా వచ్చావని రైలు లేటుగా వచ్చింది.

* e. ఈ సంవత్సరం అదునుకు వర్షాలు కురిసినయ్యని పంటలు బాగా పండినై.

**3.841 :** ఈపైక్యాలను పరిశీలిస్తే అని ఇక్కడ హేత్వర్థంలో ప్రయోగించబడిందని సులభంగా గ్రహించవచ్చు. అనికి పూర్వమున్న వాక్యాన్ని కారణ వాక్యమని, పరంలోఉన్న వాక్యాన్ని కార్యవాక్యమనీ స్థూలంగా అనుకుందాం. ఈ పై వాక్యాల్లో కొన్ని వ్యాకరణ సమ్మతం కాలేకపోతున్నై. 213 a, b లను పోల్చిచూస్తే కార్యవాక్యంలో మనుష్య వాచకశబ్దం కర్తగా ఉన్నప్పుడే వ్యాకరణ సమ్మత మవుతుందని చెప్పవచ్చు. కార్యవాక్యంలో మనుష్యేతరప్రాణి వాచకశబ్దం ఉన్నా 213 c. వ్యాకరణ సమ్మతంగా కనిపిస్తున్నది. (e) లో ప్రాణి వాచకశబ్దం కార్యవాక్యానికి కర్తగాఉన్నా వ్యాకరణ సమ్మతమయింది. అందువల్ల ఈ మూడింటిని పోల్చిచూస్తే కార్యవాక్యంలో జంగమప్రాణి వాచకశబ్దం కర్తగా ఉండాలని ప్రతిపాదించవచ్చు. (d) లో వాక్యం ఆమోదయోగ్యంగా కనిపించినా వ్యాకరణ సమ్మతంకాదు. రైలుబండికి ప్రాణి వాచకత్వం ఆరోపించటంవల్ల ఈ వాక్యం తయారయింది.

**3.842 :** ఈ కింది వాక్యాల్లో ప్రాణి వాచక శబ్దాలు కర్తలుగా లేకపోయినప్పటికీ వ్యాకరణసమ్మతాలే, హేత్వర్థబోధకాలే.

(214) a. నేను ఆలస్యంగా ఇంటికి వస్తానని మా ఆవిడకి కోపం.
b ఇంట్లో పని ఎక్కువయిందని మా ఆవిడకి విసుగు.
c. పిల్లలు సరిగ్గా చదువుకోవటం లేదని మా ఆవిడకి దిగులు.

పై వాక్యాల్లో ప్రధాన వాక్యాల ఆఖ్యాంతాలు (Predicates) క్రియలుకావు. కాని వాటిని *పడు* అనే అనుబంధ క్రియనుచేర్చి క్రియలుగా మార్చవచ్చు ఇట్లా మార్చినప్పుడు కు-బంధంతో ఉన్ననామం ఆ క్రియకు కర్తగా మారుతుంది. కర్తృవిహీన వాక్యాలను కర్తృసహిత వాక్యాలనుంచి నిష్పన్నంచేస్తే ఇంతకుముందు చేసిన సూత్రీకరణ సరిపోతుంది. లేకపోతే గుప్తనిర్మాణంలో కర్తృనుభోక్తృ సంబంధాలున్నప్పుడు ఈ రకమైన హేత్వర్థబోధ జరుగుతుందని చెప్పాలి. ఈ వాక్యాల్లో ఆఖ్యాతాలు మనస్థితిబోధకాలు. వాటిని క్రియలుగా మార్చినపుడు మనః పరిణామ బోధ కాలవుతై.

**3.843 :** మనస్థితి బోధకాఖ్యాతాలున్నపుడల్లా ఇట్లా హేత్వర్థం వస్తుందని చెప్పలేం.

(215) a. లాటరీలో డబ్బు వస్తుందని సుబ్బారావుకు ఆశ
b. విప్లవం వస్తుందని విరసం కవులకు నమ్మకం

పై వాక్యాల్లో హేత్వర్థంలేదు. అనికి పూర్వమున్న వాక్యాలకు ఆశ నమ్మకం అనే ఆఖ్యాతాలకు దగ్గరి సంబంధం ఉంది. ఉదాహరణకు ఈ కింది వాక్యాలు. (215) వాక్యాలతో సమానార్థకాలు

(216) a సుబ్బారావుకు లాటరీలో డబ్బు వస్తుందనే ఆశ ఉంది.
b. విరసం కవులకు విప్లవం వస్తుందనే నమ్మకం ఉంది.

ఈ రెండు వాక్య సమూహాల్లోనూ సుబ్బారావుకున్న ఆశ స్వభావం, విరసం కవులకున్న నమ్మకం వ్యక్తమవుతున్నది. ఈ కింది వాక్యాలలో ఇట్లాంటి సంబంధాన్ని చూపించలేం.

* (217) a. మా ఆవిడకు నేను ఆలస్యంగా ఇంటికి వస్తాననే కోపం ఉంది.
b. మా అవిడకు ఇంట్లో పని ఎక్కువయిందనే విసుగుంది.
c. మా ఆవిడకు సరిగ్గా చదువుకోటం లేదనే దిగులుంది.

217 వాక్యాలను 214 వాక్యాలతో పోల్చిచూస్తే ఒక్క c వాక్యాలకే అట్లాంటి సంబంధాన్ని చూపించగలం. 'భయం' అనే ఆఖ్యాతాన్ని ఉపయోగించినప్పుడు కూడా ఇట్లాంటి సంబంధాన్ని చూపించగలం. దీన్నిబట్టి మనస్థితిబోధక నామాలను కొన్ని వర్గాలుగా విభజించవచ్చు. వాక్య విషయాన్ని విశేషణంగా, నిత్యంగా గ్రహించేవి, వికల్పంగా గ్రహించేవి. నిత్యంగా గ్రహించే వాటిలో ఈ హేత్వర్థబోధ ఉండదు. వికల్పంగా గ్రహించే వాటిలో హేత్వర్థబోధ ఉంటుంది.

**3.844 :** హేత్వర్థంవచ్చిన వాక్యాల్లో జంగమ ప్రాణి వాచకశబ్దం కర్తగానో అనుభోక్తగానో ఉండటం గమనించాం. అట్లా ఉన్నా ఈ అర్థంరాని మనస్థితి బోధక వాక్యాలను గమనించాం. మరికొన్ని వాక్యాల్లో ప్రాణివాచక శబ్దాలు కర్తలుగా ఉన్నా, హేత్వర్థం రాకపోగా వ్యాకరణ విరుద్ధాలు అవుతున్నై.

*(218) a. ఆధునికమైన ఆయుధాలు లేవని మన సైనికులు ఓడిపోయారు.
b. వాళ్లమ్మ కోడిగుడ్లు పెట్టలేదని కిష్టప్ప చిక్కిపోయాడు.
c. మందు తాగాడని మా వాడికి జ్వరం తగ్గింది.
d. డాక్టరు పెన్సిలిన్ ఇంజక్షన్ ఇచ్చాడని రోగి చనిపోయాడు.

ఈ పై వాక్యాల్లో మనుష్యవాచకశబ్దం కర్తగాకాని-అనుభోక్తగా కాని ఉంది. అయినా వ్యాకరణ విరుద్ధాలయినై. ఈవాక్యాల్లో *ఓడిపోవు*, *చిక్కిపోవు*, *జ్వరంతగ్గు*, *చనిపోవు* అనే వ్యాపారాలు ఆ వాక్యాల కర్త్రనుభోక్తల స్వాధీనంలోలేవు. ఆఖ్యాతాలకు స్వాధీనత, నిరధీనత అనే అంశాలను ప్రతిపాదించాలని ఈ వాక్యాలు నిరూపిస్తున్నై. ఈ స్వాధీనతా నిరధీనతాంశాలు అన్ని క్రియలకు స్థిరంకాదు.

(219) a గెరిల్లాలు గెలవాలని ప్రభుత్వ సైనికులు ఓడిపోయారు.

ఈ వాక్యంలో *ఓడిపోవటం* ఇచ్ఛాపూర్వకంగా జరిగింది. ఇచ్ఛాపూర్వకంగా చేసిన వ్యాపారాలన్నీ కర్తృస్వాధీనంలో ఉంటై. కాబట్టి పై వాక్యం వ్యాకరణ సమ్మతమైంది.

**3.845 :** దీన్నిబట్టి *అని* తో ఉన్న వాక్యం హేత్వర్థం కావాలంటే పర వాక్యంలో జంగమప్రాణి వాచకశబ్దం కర్త్రనుభోక్తల స్థానంలో ఉంది, ఆఖ్యాతంలో వ్యాపారం ఆ ప్రాణికి స్వాధీనంలో ఉండాలని సూత్రించుకోవచ్చు. కాని ఈ కింది వాక్యం ఇందుకు విరుద్ధంగా కనిపిస్తున్నది.

(220) a. ఉపన్యాసకులు రాలేదని సభ వాయిదా పడింది.

ఈ పై వాక్యంలో *సభ* ప్రాణివాచక శబ్దంకాదు. అయినా పై వాక్యం ప్రయోగయోగ్యం, వ్యాకరణ సమ్మతం. అయితే 'సభ' దానంతటది వాయిదా వడదు, కర్త ఒకరుండి ఉండాలి. అంటే పై వాక్యాన్ని కర్తృసహిత వాక్యంనుంచి నిష్పన్నం చెయ్యాలి. దాని నిర్మాణం కింది వాక్యంలోలాగా ఉంటుంది.

(220) b. ఉపన్యాసకులు రాలేదని నిర్వాహకులు సభను వాయిదా వేశారు.

3.846: హేత్వర్థబోధలో ఇంతవరకు కార్య వాక్యంలో నియమాలను గురించి మాత్రమే గమనించాం. కారణ వాక్యంలో నియమాలనుగూడా కొన్ని గమనించాలి. అందుకు ఈ కింది వాక్యాలను పరిశీలించండి.

? (221) a. మా అబ్బాయి ఇడ్డెన్లు {తిన్నానని / తిన్నాడని} భోజనం మానేశాడు.

b. నువ్వు జీతం కట్టావని పరీక్ష రాశావు.

c. మా పక్కావిడ మమ్మల్ని తిట్టానని మా ఇంటికి రావడంలేదు.

ప్రవేశ సంఖ్య

ఈ పై వాక్యాలు కారణ కార్య వాక్యభాగాలు రెండూ ఏకకర్తృకాలు. వీటిని సంపూర్ణంగా వ్యాకరణ విరుద్ధాలని చెప్పలేంగాని పైవాక్యాన్ని పూర్వపు వాక్యాలతో పోలిస్తే ఇవి అంత సమ్మతంగా కనిపించటం లేదు.

~~3.846~~ : పై వాక్యాల్లో ఒకేకర్త రెండు వ్యాపారాలను ఒకదాని తరవాత ఒకటి నిర్వహించినట్టు చెప్పబడింది. ఏకకర్తృక నిర్వాహిత వ్యాపారాల్లో *అని* ప్రయోగం సమ్మతంకాదని (221) లో వాక్యాలు నిరూపిస్తున్నై. *అని* కి పూర్వమున్న వాక్య భాగంలో భవిష్యద్బోధక క్రియ ఉంటే ఏక కర్తృకత సమ్మతమవుతుంది. కాని నిశ్చయార్థక క్రియారూపాలు వాడటానికి వీలులేదు. కాంక్ష్యార్థంలోవచ్చే *దాం*, *అని* అనే ప్రత్యయాలతో ఉన్న క్రియారూపాలు మాత్రమే ప్రయుక్తమవుతై.

(222) a. సోషలిజం త్వరగా తీసుకు రావాలని ప్రభుత్వంవారు పన్నులు పెంచారు.

b. పుస్తకాలు కొనుక్కుందామని బజారుకు వెళ్ళాను.

ఈ పై వాక్యాల్లో *అని* కి పూర్వమున్న వాక్యభాగం పూర్తిఅయిన వ్యాపారాన్ని కాని, నిశ్చితమైన భవిష్యద్వ్యాపారాన్నికాక పరవాక్యంలో భాగానికి లక్ష్యాన్ని సూచిస్తున్నది. అందువల్ల ఇది వ్యాకరణ సమ్మతమయింది.

**3.847** : *అని* తో అనుకృతమైన వాక్యంలో ఏ క్రియఉన్నా అది మొత్తం వాక్యార్థంలో నిశ్చయార్థకంకాదు. రెండు భాగాల్లో ఒకేకర్తఉంటే, కర్త తను నిర్వహించినట్టుగా చెప్పే వాక్యంలో అనిశ్చితత్వాన్ని వ్యక్తం చెయ్యటం కుదరదు. అదే లక్ష్యార్థమయితే నిర్వాహిత వ్యాపారంకాదు గనుక కుదురుతుంది. దీన్నిబట్టి ఇంకో సంగతి చెప్పవచ్చు. *అని* కి పూర్వమున్న వాక్య భాగార్థం పరవాక్యంలో కర్త్రనుభోక్తలచేత భావ్యమవుతుంది. నిశ్చయార్థకం సత్యమనీ, భావ్యమైనది సత్యం కానక్కరలేదని వ్యవహర్త అనుకుంటున్నట్టుగా చెప్పవచ్చు. అందువల్ల ఒకే కర్త తను నిర్వహించిన పూర్వవ్యాపారాన్ని గురించి అనిశ్చితంగా ఉండటం సాధ్యంకాదు. *అని* తో అనుకృతమైన వాక్యాలలో అనిశ్చితాంశం ఉందనటానికి ఈ కింది వాక్యాలను గమనించండి.

(223) a. వాళ్ళన్నయ్య వచ్చాడని మా ఆవిడ గారెలు వండింది. కాని నిజానికి రాలేదు.

* b వాళ్ళన్నయ్య వచ్చాడు కాబట్టి మా ఆవిడ గారెలు వండింది. కాని నిజానికి రాలేదు.

(223) a లో అని కి పూర్వమున్న వాక్యభాగం విషయం యదార్థమవునా? కాదా? అనేదానితో ఆ వాక్య వ్యవహర్తకు సంబంధంలేదు కాని 223 (b) ని ఉపయోగించిన వ్యవహర్త అందుకు బాధ్యత వహించాలి. అందువల్ల ఒకచోట వచ్చాడనిచెప్పి, అదే వాక్యాలలో మళ్ళీ రాలేదని చెపితే అది స్వయంవైరుధ్యం (Self - contradiction) అవుతుంది.

**3.91 :** సంజ్ఞానామాల (Propernames) వర్గనిరూపణకోసంకూడా అని ప్రయోగం జరుగుతుంది.

(224) a ఆ వూళ్ళో వెంకయ్య అని ఒక రైతు ఉన్నాడు.
b ఆదేశంలో మిసిసిపి అని ఒక నది ఉంది.

ఈ పై వాటినుంచి "వెంకయ్య అనేరైతు" "మిసిసిపి అనేనది" అనే నామబంధాలను నిష్పన్నం చెయ్యవచ్చు.

**3.92 :** అర్థ వివరణలో *అంటే* శబ్దం ప్రయుక్తమవుతుంది. ఈ అర్థ వివరణ ఒక శబ్దానికిగాని, వాక్యానికిగాని, ఒక విషయానికిగాని, సంఘటనకుగాని జరగవచ్చు. శబ్దానుకృతి జరిగినప్పుడు అది ఏ భాషాశబ్దమైనాకావచ్చు.

(225) a. ఏరాలు అంటే తోటికోడలు.
b. అంభస్ అంటే నీళ్ళు.
c. ఎన్నికలు వస్తున్నయ్యంటే నల్లధనానికి పని కలిగిందన్నమాట

(***224, 225***) లో వాక్యాలూ, పదబంధాలు ప్రత్యేకంగా ఒకరులేక కొందరు వ్యవహర్తలు అనుకరించినవికావు. భాషలో పదాలనుగాని, జీవితంలో సంఘటనలనుగాని అనుకృతంచేసి వ్యాఖ్యానం చెయ్యటం ఇక్కడ కనిపిస్తున్నది. పై వాక్యాల్లో *అనిఅర్థం అనిభావం* అన్నమాట (215 c లో లాగా) వాడవచ్చు.

ఈ **అన్నమాట** అనేది తెలుగులో ఇతర నిశ్చయార్థక వాక్యాల తరవాత కూడా ప్రయుక్తమవుతుంది. ఒక వాక్యం వక్తచేస్తున్న వ్యాఖ్యానం అని సూచించటానికి వాడతారు. *అట, కదా* అనే శబ్దాలుకూడా వ్యక్తమైన భాషాంశంమీద వక్తృద్దేశాన్ని సూచించేవే.

**3.93**: కొన్ని ప్రశ్నార్థక శబ్దాలకుకూడా అని, అంటే లు ప్రయుక్త మవుతై

(226) a ఎందుకని రాలేదు ?
b ఎక్కడని వెతికేది ?
c. ఏమని చెప్పాడు.
d. ఎందు కంటే......

ఇట్లాంటి విశేష ప్రయోగాలున్నై, వీటిని కూడా అనుకరణ సంబంధులుగానే ఊహించవచ్చు.

**3.94**: ఇవిగాక గణగణమని, పకపకమని మొదలైన ధ్వన్యనుకరణ ప్రయోగాలు కూడా తెలుగులో ఉన్నై. భాషేతర శబ్దాలను అనుకరించవచ్చునని ఈ శబ్దాలు నిరూపిస్తున్నై. అంతేగాక ధగధగమని, తళతళమని వంటి ప్రయోగాలు చూస్తే స్పర్శయోగ్యమైనవాటిని, గుప్పుమని (వాసన వచ్చింది) వంటి వాటిని చూస్తే ఘ్రాణయోగ్యమైన వాటినికూడా అనుకరించవచ్చునని తెలుస్తుంది. ఇంద్రియ గ్రహణ యోగ్యమైన ప్రతిదీ అనుకరణ యోగ్యమేనని చెప్పవచ్చు. వీటిల్లో మ కారాగమం విశేషం. ఇదిగాక పరోక్ష విధిలో మాత్రమే ఇట్లాంటి మ కారాగమం వస్తుంది.

తెలుగులో అనుకరణానికి చాలా విస్తృతమైన ప్రణాళిక ఉంది. తెలుగులో అనుకరణం మీద చేసే పరిశోధనవల్ల అసలు భాషల్లో అనుకరణ తత్వాన్ని పరిశీలించటానికి ఉపయోగిస్తుంది. భాషను గురించి భాషలో చెప్పటానికి అనుమతించే సాధనం అనుకరణ. ఈ అనుకరణను గురించి ఇతర భాషల్లో ఏమంత పరిశోధన జరిగినట్టు కనపడదు. తెలుగులో జరిగిన ఈ మాత్రం పరిశీలనైనా అందుకు పనికివస్తుంది. విశాల విశ్వాన్నే గర్భీకృతం చేసుకొనే శక్తి అనుకరణకుంది. కాబట్టి భాషను అర్థం చేసుకోటానికి అట్లాంటి పరిశీలన అవసరం.

★

# 4. సంయుక్త వాక్యాలు

కొన్ని సమాన ప్రతిపత్తి గల వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే సంయుక్త వాక్యమవుతుంది. వాక్య సంయోగాన్ని సూచించటానికి ఇంగ్లీషులో *and*, *or*, *but* వంటి శబ్దాలను హిందీలో *ఔర్*, *యా*, *మగర్* వంటి శబ్దాలనూ ప్రయోగిస్తారు. ఈ శబ్దాలు వాక్య సంయోగాన్నేకాక పద, పదబంధ సంయోగాన్ని కూడా సూచిస్తై. పై శబ్దాలు వాక్యాల మధ్య భిన్న సంబంధాల్ని వ్యక్తం చేస్తై. *and* అనే శబ్దం సంకలన సంబంధాన్ని, *or* శబ్దం వికల్ప సంబంధాన్ని, *but* వైరుధ్యాన్ని సూచిస్తై. తెలుగులో అన్నిచోట్లా ఇట్లాంటి శబ్ద ప్రయోగం లేదు.

**4.11** : తెలుగులో రెండు వాక్యాలను ఒకదాని తరవాత ఒకటి ప్రయోగించి వాటి మధ్య సంబంధాలు అర్థాన్నిబట్టే గ్రహిస్తాం. సంకలన సంబంధంలో ప్రత్యేకమైన శబ్దంలేదు. వాక్యం చివరలో స్వరోచ్చారణ ద్వారా ఈ సంబంధం వ్యక్త మవుతుంది.

(227) a. సుబ్బారావు తెలివైనవాడు, సుజాత అందమైనది.
b సుజాత తెలివైనదీ, అందమైనదీ.

(227) a లో కలిపిన రెండు వాక్యాల్లో సమానాంశ లేదు. ఆ రెంటినీ ఒక వాక్యంగా భావించినా, రెండు వాక్యాలుగా భావించినా భేదం లేదు. అట్లాంటి భేదాన్ని సూచించే శబ్దాలు కూడా లేవు. (227) b. ని ఒక వాక్యంగా భావించటానికి వీలుంది. రెండిటిలోనూ కర్త (ఉద్దేశ్యం) ఒకటే అయినప్పుడు సనామబంధలోపం జరిగింది. ఈ రెండూ కలిపి ఒకే వాక్యం అనటానికి ఇంకో ఆధారం ఉంది.

c. సుజాత తెలివైనది. సుజాత అందమైనది.
d. సుజాత తెలివైనది. ఆమె అందమైనది (కూడా),
* e. సుజాత తెలివైనదీ, ఆమె అందమైనదీ-

(227) b, c లను పోల్చి చూస్తే ఈ భేదం తెలుస్తుంది. b లో సనామబంధ

లోపం జరిగింది. అది వ్యాకరణ సమ్మతం. (e) లో సర్వనామీకరణం జరిగింది. ఏకకర్తృకమైన వాక్యాలను కలిపి ఒకే వాక్యంగా చేసినప్పుడు సనామ బంధలోపం జరిగి తీరాల్సిందేకాని సర్వనామీకరణం జరగటానికి వీల్లేదు. సమాన ప్రతిపత్తిగల వాక్యాలను కలిపినప్పుడు ఆఖ్యాతాలు ఏ వరసలో వచ్చినా అర్థం మారదు.

(228) a. సుజాతకు డబ్బుంది, తెలివి ఉంది.
b సుజాతకు తెలివి ఉంది, డబ్బు ఉంది.
c. సుజాత పొడగరి, రూపసి.
d సుజాత రూపసి, పొడగరి.

**4.12 :** స్థితిబోధకమైన ఆఖ్యాతాలున్నప్పుడే ఇట్లాంటి పరివర్తన అర్థభేదాన్ని కలిగించదు. వ్యాపార, పరిణామ బోధకమైన వాక్యాలు కలిపినప్పుడు పూర్వాపూర్వ క్రియలు పూర్వాపూర్వ వ్యాపారబోధకాలవుతై. అంటే వాక్యంలో పూర్వవ్యాపారం, కాలంలో కూడా పూర్వవ్యాపారాన్నే బోధిస్తుంది. వాక్యాలను విడివిడిగా ఉంచినా కలిపినా అర్థవ్యత్యయం ఇట్లాగే ఉంటుంది.

(229) a సుజాత ఇంటికి వచ్చింది, చీరమార్చుకుంది, పొయ్యిమీద కాఫీకి నీళ్ళు పెట్టింది.
b. సుజాత ఇంటికివచ్చి, చీర మార్చుకుని, పొయ్యిమీద కాఫీకి నీళ్ళు పెట్టింది.
c. సుజాత ఇంటికి వచ్చింది. ఆ తరవాత చీరమార్చుకుంది. ఆ తరవాత పొయ్యిమీద కాఫీకి నీళ్ళు పెట్టింది.

(229) a, b వాక్యాలను c వాక్యపు గుప్త నిర్మాణం నుంచి నిష్పన్నం చెయ్యవచ్చు. అంటే a, b ల అర్థం c అర్థంతో సమానం. అందువల్ల ఈ వాక్యాల్లో ఆఖ్యాతాలు క్రమ వ్యత్యయాన్ని సహించవు. (229) b వంటి వాక్యాలు ఇంతకు ముందు పేజీల్లో సంశ్లిష్ట వాక్యాలుగా వ్యవహరించబడ్డై. ఇక్కడ సంయుక్తవాక్యా తుల్యాలుగా పరిగణించబడుతున్నై. గుప్త నిర్మాణ సంయుక్త వాక్యాలనుంచి నిష్పన్నమైన వ్యక్త నిర్మాణపు సంశ్లిష్ట వాక్యాలుగా వీటిని పరిగణించవచ్చు. (229) a, b లు రెండిట్లోనూ సనామబంధం లోపం జరుగుతుంది కాని, సర్వనామీకరణం జరగదు.

**4.13 :** క్రమ వ్యత్యయాన్ని సహించే వాక్యాలు *తరవాత* శబ్దప్రయోగాన్ని సహించవు. "*సుజాత తెలివైనది, ఆతరవాత అందమైనది*'' అనేవాక్యం సాధ్యమైనా సుజాత గుణాల్ని వర్ణించే వక్త ఆ గుణాల్లో తాను దేన్ని ప్రధానంగా పరిగణిస్తున్నాడో చెప్పుతుంది కాని, ఆ గుణాల కాల భేదాల్ని సూచించదు

**4 14** సంయుక్త పదబంధాలను కూడా సంయుక్త వాక్యాలనుంచి నిష్పన్నం చెయ్యవచ్చు. సమరూపకాలైన పదబంధాల్లో ఒకదానికి లోపం చెయ్యటంద్వారా ఇది జరుగుతుంది. ఆ ప్రక్రియ కింది వాక్యాల్లో చూడవచ్చు.

(230) a సుజాత సినిమాకు వెళ్లింది, సుశీల సినిమాకు వెళ్ళింది.

b. సుజాత, సుశీల——సినిమాకు వెళ్ళింది, సినిమాకు వెళ్ళింది.

c. సుజాత, సుశీల సినిమాకు వెళ్ళారు.

d. సుశీల, సుజాత సినిమాకు వెళ్ళారు.

**4 15 :** (230) లో c, d వాక్యాల్లో నామ బంధాలు క్రమవ్యత్యయం జరిగినా అర్థభేదం రాలేదు. కాని ఈ వాక్యాలు విడిగా భిన్నార్థ బోధకాలు. ఆ భిన్నార్థాలు కింది వాక్యాల్లో వ్యక్తమవుతున్నై.

(231) a. సుజాత, సుశీల కలిసి సినిమాకు వెళ్ళారు.

b. సుజాత, సుశీల విడివిడిగా సినిమాకు వెళ్ళారు.

ఒకే సినిమాకు వెళ్ళారా, వేరు వేరు సినిమాలకు వెళ్ళారా అనేది వదిలేసినా వాళ్లు కలిసి వెళ్ళారా ? విడివిడిగా వెళ్ళారా అనేది (230) లో వ్యక్తం కాలేదు. భిన్న కర్తృకాలైన ఏకవ్యాపార మున్నప్పుడల్లా ఇల్లాంటి అస్పష్టత వాక్యంలో ఉంటుంది.

ఒకే వాక్యం బహు కర్తృకమూ, బహు కర్మకమూ అయినప్పుడు కర్తృ సంఖ్యను, కర్మ సంఖ్యనూ బట్టి ఈ అస్పష్టత పెరుగుతుంది. ఉదాహరణకు ఈ కింది వాక్యాలు చూడండి.

(232) a. సుజాత సుశీల బజారు నుంచి పండ్లూ కూరగాయలు తెచ్చారు

b. సుజాత బజారు నుంచి పండ్లు తెచ్చింది.

సుశీల బజారునుంచి కూరగాయలు తెచ్చింది.

c. సుశీల బజారు నుంచి పండ్లూ, కూరగాయలు తెచ్చింది.

d. సుజాత బజారు నుంచి పండ్లూ కూరగాయలు తెచ్చింది.

(232) లో a కి b, c లలో ఏదైనా మూలవాక్యం కావచ్చు. భిన్న మూలకం కావటం వల్లనే భిన్నార్థాలు వస్తున్నై.

**4 16 :** పారస్పర్యాన్ని బోధించే క్రియలున్నప్పుడు అట్లాంటి వాక్యాల్నుంచే సంయుక్త పదబంధాల్ని సాధించాల్సి ఉంటుంది.

(233) a. సుజాత, సుశీల తిట్టుకున్నారు.

b. సుజాత సుశీలను తిట్టింది, సుశీల సుజాతను తిట్టింది.

(233) a కి b ని మూలవాక్యంగా ప్రతిపాదించాల్సి ఉంటుంది.

**4.17 :** భిన్న ప్రశ్నార్థక శబ్దాలున్న వాక్యాలను కలిపేటప్పుడు సమ క్రియల లోపం జరగదు

(234) a సుజాత ఎప్పుడొస్తుంది ? సుజాత ఎందుకొస్తుంది ?

b. సుజాత ఎప్పుడొస్తుంది ? ఎందుకొస్తుంది ?

? c. సుజాత ఎప్పుడు, ఎందుకొస్తుంది ?

సమ ప్రశ్నార్థక శబ్దాలు, సమక్రియలూ ఉన్నప్పుడు అట్లాంటి లోపం జరుగుతుంది.

(235) a. సుజాత ఎప్పుడొస్తుంది ? సుశీల ఎప్పుడొస్తుంది ?

b, సుజాత, సుశీల ఎప్పుడొస్తారు ?

ఏ- ప్రశ్నల్లాగే ఆ- ప్రశ్నలు కూడా ఒకచోట చేర్చటం వల్లనే సంయుక్త ప్రశ్నలు ఏర్పడతై. వాక్య సంయోగాన్ని సూచించే పదమేమీ ఉండదు.

(236) a. ప్రతిమనిషికి, తిండి గుడ్డ నీడైనా ఉండాలా ?
కాని మిగలాలా ? మరీ బ్రతకాలా ?

b. చెప్పేదంతా చేస్తున్నారా ? చేసిందంతా చెప్తున్నారా ?

**4.21** వికల్పార్థాన్ని సూచించటానికి వాక్యాల మధ్య లేక, లేకపోతే అనే శబ్దాలు ప్రయుక్తమవుతై. వాక్య వికల్పం పదబంధ వికల్పంగా పరివర్తన చెందినప్పుడు వికల్పాన్ని చెప్పిన పదబంధాలన్నిటికీ ఓ శబ్దం చేరుతుంది.

(237) a. (i) సుబ్బారావు రేపువస్తాడు, లేక ఎల్లుండి వస్తాడు,
లేక నాలుగు రోజుల తరవాత వస్తాడు.

(ii) సుబ్బారావు రేపో, ఎల్లుండో, నాలుగు రోజుల తర్వాతనో
వస్తాడు.

b. (i) రేపు సుజాత ఊరికి వెళ్తుంది, లేక సుశీల ఊరికి వెళ్తుంది,
లేక సుమిత్ర ఊరికి వెళ్తుంది.

(ii) రేపు సుజాతో, సుశీలో, సుమిత్రో ఊరికి వెళ్తారు.
( ! వెళ్తుంది.)

**4.22 :** పై వాక్యాల్లో ఆఖ్యాతేతర పదాలమధ్య వికల్పం చెప్పబడింది. ఆఖ్యాతాలమధ్య వికల్పం రెండురకాలుగా ఉంటుంది నిశ్చయార్థక, వ్యతిరేకార్థక ఆఖ్యాతాలమధ్య ఉండొచ్చు. లేక భిన్నఆఖ్యాతాలమధ్య ఉండొచ్చు. (226) వాక్యాల్లో a (i) కి a (ii) ని (b) (i) కి (b) (ii) మూలవాక్యాలుగా చూపించ బడినై. ఆఖ్యాతాలమధ్య వికల్పత్వాన్ని చెప్పేటప్పుడు ఇట్లా కుదరదు.

(238) a. అతను వ్యాపారస్తుడో, భూస్వామో, పైరవికారో కాంగ్రెసు
నాయకుడో ?

b. సుజాత వంట చేస్తున్నదో, అలంకరించు కుంటున్నదో, చదువు
కుంటున్నదో.

**4.23 :** ఈ పై వాక్యాలు పైనఇచ్చిన విధంగా ప్రయోగార్హాలుగా కనిపించటంలేదు. ఆ వాక్యాల తరవాత *నాకుతెలియదు*, *ఎవరికితెలుసు*, *నీకెందుకు*, *ఎవరికెక్కువాలి*, *మనకెందుకు* ? వంటి వాక్యభాగాలను చేరిస్తే ప్రయోగార్హాలవుతై. వికల్పంగా క్రియారహిత వాక్యాలకు *కాదు* శబ్దాగమం, క్రియాసహిత వాక్యాలకు **లేదు** శబ్దాదేశం జరుగుతై.

(239) a. (i) అతను కాంగ్రెసు నాయకుడు అవునో, కాదో.

(ii) అతను కాంగ్రెసు నాయకుడో, కాదో.

b. (i) అతను రేపు వస్తాడో, రాడో.

(ii) అతను రేపు వస్తాడో, లేదో.

(239) వాక్యాలకు యథాతథంగా ప్రయోగించవచ్చు. (238) వాక్యాల సందర్భంలో ఉదాహరించిన *నాకు తెలీదు* వంటి వాక్యాలను చేర్చినా చేర్చవచ్చు.

(238) వాక్యాల్లో వికల్పాఖ్యాతాలమధ్య **లేక** శబ్దాన్ని ఉపయోగిస్తే ప్రయోగ యోగ్యాలవుతై. **లేక** శబ్ద యుక్త వాక్యాలనుంచి వికల్ప వాక్యాలను నిష్పన్నంచేస్తూ **లేక** శబ్దాన్ని (237), (239) వాక్యాల్లో లోపింపజేసి, భిన్నాఖ్యాతాలమధ్య లోపంచెయ్యకుండా ఉండటం (238) వాక్యాలను సాధించటంలో ఒక పద్ధతి. ఈ పద్ధతి సరిపోతుందో లేదో చెప్పటం కష్టం. ఆ-ప్రశ్నలమధ్య వికల్పం చెప్పినప్పుడు వాటిమధ్య **లేక** శబ్దం లేకుండానే వికల్పబోధ జరుగుతుంది.

(240) a. అతను భైరవి కారా? (లేక) కాంగ్రెసు నాయకుడా?
b. సుజాత వంట చేస్తున్నాదా? (లేక) అలంకరించుకుంటున్నదో

**4.24 :** *ఏ*-శబ్దయుక్త ప్రశ్నలమధ్య వికల్పబోధ ఉండదు. ఏ-శబ్దం క్రియేతర శబ్దాలనుంచి ప్రశ్నార్థక శబ్దాలను నిష్పన్నం చేస్తుంది. ఒక్కొ-శబ్దం ఒక్కో-రకపు వర్గానికిగుర్తు. ఉదాహరణకు *ఎప్పుడు* : కాలవాచిక్రియా విశేషణం; *ఎక్కడ* : స్థలవాచి క్రియావిశేషణం; *ఎందుకు?* హేతు సూచకక్రియా విశేషణం; *ఎట్లా* : రీతిబోధక క్రియావిశేషణం; *ఎవరు?* : నామవాచకం. భిన్న ప్రవర్తన కలిగిన శబ్దాలమధ్య వికల్పబోధ ఉండదు.

**4.31 :** రెండు వాక్యాలమధ్య వైరుధ్య సూచనకు *కాని* శబ్దం ఉపయోగిస్తారు.

(241) a. అతను లక్షలు సంపాయిస్తాడు. కాని పైసా ఖర్చు పెట్టడు.
b. ఆమె బాగా పాడుతుంది. కాని అందంగా ఉండదు.
c. అతను డాక్టరు, కాని ఇంజక్షను చెయ్యటం రాదు.

వక్త ఉద్దేశానికి భిన్నమైన విషయప్రతిపాదన జరిగినప్పుడు *కాని* శబ్దం ఆ వైరుధ్యాన్ని వ్యక్తంచేస్తుంది. ఉదాహరణకు (241) a లో "డబ్బు సంపాయించే వాళ్ళు ఖర్చుపెడతారు" అని వక్త అభిప్రాయం. దానికి విరుద్ధమైన ప్రతిపాదన రెండో వాక్యంలో జరిగింది. అట్లాగే (b) లో బాగాపాడే అమ్మాయి అందంగా ఉండాలని వక్త ఆశించాడు. (c) లో డాక్టరయిన వాడికి ఇంజక్షన్ ఇయ్యటం వచ్చి ఉండాలని అభిప్రాయపడటం సహజం.

(241) a, b, c లలో వాటిని ఒక వాక్యంగా పరిగణించినా, భిన్న వాక్యాలుగా పరిగణించినా భేదమేమీలేదు. *కాని* శబ్దం *గాని* అనే రూపంగా మారుతుంది. క్రియారహిత వాక్యాలకు *ఏ* శబ్దం అంతంలో చేరుతుంది (c లో లాగా) (230) a, b, c లలో వాక్యాలను కలపకముందు *కాని* శబ్దం బదులు ***అయితే***, ***అయినా*** అనే శబ్దాలను అర్థభేదం లేకుండావాడొచ్చు. కాని వాటిని కలిపి నప్పుడు కాని శబ్దమే ప్రయోగించాలి.

**4.32 :** *కాని* కి పూర్వపర వాకాల్యను వ్యత్యస్తంచేసినా ప్రధానార్థ బోధకి కాని, వైరుధ్యబోధకి కాని భంగంరాదు. వైరుధ్యబోధలో **ఉపయోగించే** ***కాని***, క్రియేతర శబ్దాల మధ్య వికల్పబోధకుకూడా ఉపయోగిస్తుంది.

(242) **a.** నేను రేపుగాని ఎల్లుండిగాని మీ ఇంటికి వస్తాను.

**b.** అబద్ధాలు చెప్పగలిగిన వాళ్ళుగాని, డబ్బు ఖర్చు పెట్ట గలిగిన వాళ్ళుగాని ఎన్నికల్లో గెలుస్తారు.

★

# 5. తెలుగు వాక్యం : కొన్ని ముఖ్య లక్షణాలు

**5.11** : భాషాలక్షణ పరిశీలనలో మూడు పద్ధతులను గుర్తించొచ్చు. 1. ఏకభాషా లక్షణ పరిశీలన (Characterology) 2. బహుభాషా లక్షణ పరిశీలన (Typology) 3. సర్వభాషా లక్షణ పరిశీలన (Universals) ఒక భాషకు లభ్యమాన మవుతున్న వ్యాకరణాలను బట్టిగాని, స్వయం పరిశీలనవల్లగాని గ్రహించిన విషయాలను ఏకభాషా లక్షణాలుగా పరిశీలిస్తారు. ఒక భాషలో కనిపించే లక్షణాలు కొన్ని భాషల్లో కనిపించవచ్చు, కొన్నిట్లో కనిపించకపోవచ్చు. ఉదాహరణకు తెలుగులో స్వరసమీకరణం అనే లక్షణం ఉన్నది. ఈ లక్షణం టర్కిష్, నూపే, యావల్మనీ వంటి ఇతర భాషల్లోనూ ఉంది. ఇంగ్లీషు, హిందీ భాషల్లో లేదు ఒక భాషకు ప్రత్యేక లక్షణం అవునా కాదా ? అంటే ఇతర భాషలతో పోల్చి చెప్పాల్సిందే. ఒకే లక్షణం భిన్న భాషల్లో కనిపించిందంటే అది ఏకభాషా పరిమితి నతిక్రమించిందన్నమాట అది కొన్ని భాషల్లోనే కనిపిస్తే భాషలు అనుమతించే (లేక అవలంబించే) పద్ధతుల్లో అది ఒకటి అని గ్రహించాలి. ఇట్లాంటి కొన్ని లక్షణాల్ని బట్టి భాషలను విభజించవచ్చు. ఇది బహుభాషా లక్షణ పరిశీలన. ఒక భాషలో కనిపించే లక్షణం ఆ భాషకుగాని, కొన్ని భాషలకుగాని పరిమితం కాకపోతే దాన్ని సర్వభాషా లక్షణంగా అనుమానించాల్సి ఉంటుంది. ప్రపంచంలో ఉన్న అన్ని భాషలనూ పరిశీలించిన వారెవ్వరూ లేరు. సర్వభాషా లక్షణ పరిశీలన అంటే అన్ని భాషల్లోనూ ఉండటానికి వీలున్న లక్షణాల పరిశీలన అని. ఉదాహరణకు అన్ని భాషల్లోనూ వక్తనూ శ్రోతనూ సూచించే పదాలు. ఉంటయ్యని చెప్పటానికి అన్ని భాషలనూ పరిశోధించక్కర్లేదు. బహుభాషా పరిశీలనవల్ల సజాతీయ సంబంధం (genetic relationship) గాని, ప్రాంతీయ సంబంధం (areal relationship) గాని, లేని భాషల్లో పరిశీలించినంత మట్టుకు కొన్ని లక్షణాలు పునః పునరాగత మవుతుంటే వాటిని సర్వభాషా లక్షణాలుగా ప్రతిపాదించవచ్చు. ఆ ప్రతిపాదనలు ఇతర శాస్త్రప్రతిపాదనల్లాగే తరవాత పరిశీలనకు నిలబడవచ్చు, నిలబడకపోవచ్చు. ఈ పుస్తకంలో సర్వభాషా లక్షణాలుగా అనుమానించదగిన కొన్ని లక్షణాలు ప్రస్తావించబడినై. (చూ. 2.16; 3.1; 3.2; 3.31). సర్వభాషా లక్షణాలు క్రమక్రమంగా భాషా నిర్వచనంలో భాగమయిపోతై.

**5.12 :** ఏ దృష్టితో చూసినా ఏకభాషా లక్షణ పరిశీలన అన్నిటికీ మూలం. ఇతర భాషలతో పోల్చి చూసి భాషల మధ్య భేదసామ్యాలను కనుక్కోటానికి ఈ పరిశీలన అవసరం. ఆ దృష్టితో తెలుగులో ముఖ్యమని తోచిన అంశాలు ఈ అధ్యాయంలో క్రోడీకరించబడుతున్నై. వీటిల్లో చాలావరకు ఇతర ద్రావిడ భాషల్లో కనిపించవచ్చు. మరికొన్ని ఇతరేతర భాషల్లో కూడా ఉండవచ్చు. తెలుక్కి మాత్రమే పరిమితమైనవి ఇవి అని ప్రస్తుతం నిర్ధారణ చెయ్యటం కష్టం

**5.21 :** సాధారణమైన సకర్మక వాక్యంలో పదక్రమాన్ని అనుసరించి ప్రపంచ భాషలను మూడు ప్రధానమైన వర్గాలుగా విభజించవచ్చునని పరిశీలకులు గుర్తించారు. అవి : 1. క్రియాది, 2. క్రియా మధ్యమం, 3. క్రియాంత భాషలు. క్రియాపదం ప్రథమేతరంగా వచ్చే భాషల్లో కర్త తరవాతనే కర్మ ఉంటుంది. క్రియాది భాషల్లో మాత్రం కర్మ తరవాత కర్త వచ్చేభాషలు కొన్ని ఉన్నై. ద్రావిడ భాషలన్నీ క్రియాంత భాషలు. భారతీయ భాషల్లో చాలావరకు క్రియాంత భాషలే. మేఘాలయ రాష్ట్రంలో వ్యవహరించే ''ఖాసీ'' క్రియా మధ్యమ భాష. హిందీని గుప్తనిర్మాణంలో క్రియా మధ్యమ భాషగా పరిగణించాలని ఒక ప్రతిపాదన ఉన్నది.

**5.23 :** వాక్యంలో కొన్ని విశేషాలు ఈ పదక్రమాన్ని బట్టి ఉంటై. క్రియాంత భాషలు ప్రాయికంగా పరవిహిత ప్రత్యయ భాషలు. క్రియాది భాషలు పూర్వవిహిత ప్రత్యయభాషలు. క్రియా మధ్యమభాషల్లో రెండు రకాలూ ఉన్నై క్రియాంత భాషల్లో నామవిశేషణాలు నామానికి పూర్వం, క్రియా విశేషణాలు క్రియకు పూర్వం వస్తై. కారకాల్ని సూచించే విభక్తి ప్రత్యయాలు, ప్రత్యయ తుల్యపదాలు నామపదం తరవాతనే వస్తై. టర్కిష్, జాపనీస్, జార్జియన్ భాషలు ద్రావిడ భాషల్లాగే క్రియాంత భాషలు

**5.31 :** తెలుగులో పదక్రమాన్ని గురించి ఇంకా కొన్ని విశేషాలు చెప్పవచ్చు. అముఖ్యకర్మ ముఖ్యకర్మకు పూర్వమే ఉంటుంది. ముఖ్యకర్మ ప్రశ్నార్థక శబ్దాలు వచ్చినప్పుడు తప్ప ఎప్పుడూ క్రియను అంటిపెట్టుకునే ఉంటుంది. ప్రశ్నార్థక పదాలు క్రియకు ఎప్పుడూ సన్నిహితంగా ఉంటై. ఉపవాక్యాలు ప్రధాన వాక్యానికి పూర్వమే ఉంటై. అనుకృతాంశం అనుకర్త వాక్యానికి పూర్వమే ఉంటుంది. సంఖ్యావాచక పదాలు, ఇతర పరిమాణార్థక

పదాలూ నామపదానికి పూర్వపరస్థానాలు రెండిట్లోనూ రాగలవు. ఉదా : *ఆమెకు చాలా చీరలున్నై : ఆమెకు చీరలు చాలా ఉన్నై.* క్రమ వ్యత్యయం ప్రాధాన్య వివక్షకు అవలంబించే ప్రధానమైన పద్ధతి. క్రియకు దగ్గరగా జరిగే వాటికి ప్రాధాన్యం హెచ్చు. క్రియను నామ్నీకరించి ప్రాధాన్యం చెప్పదల్చుకున్న వాటిని ఆ ఖ్యాతృ స్థానానికి జరపటంకూడా ఒక పద్ధతి. సమీకరణ వాక్యాల్లో కేవల వ్యత్యయమే ప్రాధాన్యాన్ని బోధిస్తుంది. వ్యవహృతాంశంమీద వక్త్రభిప్రాయాన్ని సూచించే అటాదిశబ్దాలు తెలుగులో ఉన్నై. ఇవిసాధారణంగా వాక్యాంతంలో వచ్చినా ప్రాధాన్యవివక్షలో వాక్యంలో ఏ పదానికైనా తగిలించవచ్చు. అప్పుడు కూడా వికల్పంగా పదక్రమ వ్యత్యయం జరుగుతుంది.

**5.32 :** తెలుగులో క్రియ చాలా ప్రధానమైన పాత్ర నిర్వహిస్తుంది. వాక్యాలను అనుసంధించే శబ్దాలు చాలావరకు క్రియలనుంచే నిష్పన్నమయినై. అనుకృతిలోవచ్చే *అని* *అను* ధాతునిష్పన్నం. *అయితే*, *అయినా*, *కాని*, *కాకపోతే* *కాదు*, *కదా* – వంటి మాటలు *అగు* ధాతు నిష్పన్నాలు. ఆత్మార్థం పారస్పరార్థం (కొను). పదార్థం (పెట్టు) పూరణార్థం (-పోవు. -వేయు) వంటి చాలా అర్థాలు ధాతువిస్తరణ ప్రక్రియ ద్వారా సాధించబడతై. క్త్వ, శతృ, అపి, చేదాదివివిధోప. వాక్యాలు క్రియల్లో మార్పుల వల్లనే ఏర్పడతై. (ఇంగ్లీషులో వీటికి క్రియేతర శబ్దాలు వాడతారు. ఇతర భాషల్లో relative clause అనే పద్ధతి తెలుగులో ప్రధానంగా క్రియాజన్య విశేషణం ద్వారా వ్యక్తమవుతుంది. తెలుగులో relative pronouns లేవు. ఈ రకమైన పద్ధతి తెలుగులో ఉన్న విధినిషేధాలతోనే బెంగాలీ భాషలో ఉంది. ఒరియాలో కూడా ఉండవచ్చు, కాని ఇతర ఆర్యభాషల్లో విరళంగా మాత్రమే ఉంది.

**5.33 :** తెలుగులో సమీకరణ వాక్యపద్ధతి (equative sentences) విశేషమైనది ఈ రకమైన వాక్యాలు అన్నిభాషల్లో ఉన్నా తెలుగులో క్రియా-రహితంగా ప్రయోగించటం విశేషం. ద్రావిడభాషల ప్రభావంవల్ల కాబోలు ఈ పద్ధతి ఒరియా, బెంగాలీబాషల్లోఉంది. కాని ఇతర ఆర్యభాషల్లో కనిపించదు. ఇదే పద్ధతి రష్యన్‌వంటి స్లావిక్‌భాషల్లోనూ కనిపిస్తుంది క్రియలేని సమీకరణ వాక్యాలగుప్త నిర్మాణంలో *అవు* వంటి క్రియ క్రియను కొందరు ప్రతిపాదిస్తారు. కాని అర్థగ్రహణకు అవసరంలేని *అవు* ను గుప్తనిర్మాణంలో ప్రతిపాదించటం అనవసరం. క్రియలేని

ఈ వాక్యాలను క్త్వాశత్రపిచేదాద్యర్థాల్లో అవు ధాతు నిష్పన్న క్రియారూపాలు అనుబద్ధమవుతై క్రియావాక్యాలు ప్రాధాన్య వివక్షలో క్రియనామీకృతమై సమీకరణ వాక్యాలుగా మారటంకూడా తెలుగులో ఈ రకపు వాక్యాల ప్రాధాన్యాన్ని సూచిస్తున్నది

**5.341** : తెలుగు వాక్యాల్లో కర్త ఉద్దేశ్యం ఒకటి కానక్కర్లేదు. తెలుగు లో కర్త కన్న ఉద్దేశ్యమే ప్రధానంగా కనిపిస్తున్నది. కొన్ని వాక్యాలకు వ్యక్త నిర్మాణంలో కర్తను గుర్తించటంకూడా కష్టమే. ఇంగ్లీషు వంటి వాక్యాల్లో వ్యక్త నిర్మాణంలో కర్తృపద ప్రాధాన్యం ఎక్కువ ఏమీలేకపోతే *it* వంటి నిరర్థక శబ్దాన్నైనా కర్తగా ఉపయోగిస్తారు కర్తృపదాన్ని లోపింప జెయ్యటానికి ఇంగ్లీషులో సాధారణంగా వీలుండదు. తెలుగులో సందర్భాన్ని బట్టి గ్రహించగలిగిన ఏ పదాన్నైనా లోపింపజెయ్యవచ్చు. తెలుగులో ''ఎవరక్కడ ?'' ''నేను'' అనే సంభాషణ సాధ్యమయితే ఇంగ్లీషులో ''Who is there ? ''It is me'' అనాలి తెలుగులో పదక్రమవ్యత్యయానికి ఉద్దేశ్య విధేయ వ్యత్యయంవల్లవచ్చే అర్థ ప్రాధాన్యముంది కాని ఇంగ్లీషులోలాగా కర్తృకర్మపదాల సంబంధ వ్యత్యయం జరగదు. ఇంగ్లీషుపదక్రమానికి ప్రత్యేక వ్యాకరణ ప్రయోజనముంది. తెలుగు పదక్రమానికి అట్లాంటి ప్రయోజనంలేదు ఇంగ్లీషుభాష పదక్రమవ్యత్యయాన్ని అంతగా సహించదు. తెలుగుభాష ప్రాధానవివక్షకోసం పదక్రమ వ్యత్యయాన్ని ఉపయోగించుకుంటుంది.

**5 342** : తెలుగుభాషలో స్వామ్య, అనుభోక్త్రాద్యర్థాల్లో నామానికి కు-విభక్తి చేరుతుంది. ఉదా:- *ఆమెకు పదిచీరలున్నై, నాకుజలుబుచేసింది, నాకు సంతోషంగా ఉంది, అతనికిలాటరీలో లక్షరూపాయలువచ్చినై, వాడికి బజార్లో పార్కర్ కలం దొరికింది, నీకు తెలుసు*—ఇట్లాంటి వాక్యాల్లో కు-బంధానికి బదులు ఇంగ్లీషులో కర్తృపదాన్ని వాడతారు. తెలుగులో ఉన్నటువంటి పద్ధతే తరతమ భేదాలతో ఇతర భారతీయభాషల్లోకూడా కనిపిస్తుంది. స్లావిక్ భాషల్లో కూడా కర్తృపద ప్రాధాన్యం తక్కువ.

**5.35** : తెలుగులో అనుకరణ విధానం అతి విస్తృతమయింది. కేవలం భాషేకాక భాషేతరాంశాలుకూడా తెలుగులో అనుకృత మవుతున్నై. ఇంద్రియ గ్రహణ యోగ్యమైన ప్రతిదీ తెలుగులో అనుకరణయోగ్యమే. ప్రత్యక్ష పరోక్షాను

కృతులు రెండింట్లోనూ అనుకరణసూచకం (అని శబ్దం) ఉంటుంది. (ఇది అనుధాతునిష్పన్న క్రియా అవ్యవహితయోగంలో వికల్పంగా లోపిస్తుంది) పరోక్షానుకృతిలో ఉత్తమపురుష ప్రధానవాక్యంలోని కర్తను కాపీ (copy) చేసి మారినప్పుడు క్రియావిభక్తి ఉత్తమపురుషనుంచి మారకుండా అట్లాగే ఉంటుంది ఇది క్రియావిభక్తి విధానం విస్తృతంగా ఉన్న భాషలన్నిట్లోనూ ఇట్లాగే ఉండొచ్చు, తెలుక్కి ప్రత్యేకమైనాకావచ్చు. తెలుగులో కర్తృద్ధరణసూత్రం అనుకృతవాక్యం సమీకరణ వాక్యమైనప్పుడే ప్రవర్తిస్తునట్టు కనిపిస్తున్నది. హేత్వర్థంలో అని శబ్ద ప్రయోగంకూడా ద్రావిడభాషల ప్రత్యేకతగానే కనిపిస్తున్నది ఆర్యభాషల్లో ఇట్లాంటి పద్ధతిలేదు దక్కనీ ఉర్దూలోమాత్రం తెలుగుప్రభావంవల్ల కాబోలు కనిపిసున్నది.

**5.36 :** ఏకకర్తృక వ్యాపార సమసామయికానుపూర్వీక సంబంధాలు తెలుగులోను, ఇతర ద్రావిడ భాషల్లోను అసమాపక క్రియల ద్వారా వ్యక్తమవుతై. క్త్వార్థక వాక్యాలు, హేత్వర్థక రీత్యర్థకాలు కూడా అవుతై వీటిలో కొన్ని ఆర్య భాషలకు కూడా పాకినై.

**5.37 ·** తెలుగులో సంయుక్త వాక్యాలకూ, అసంయుక్త వాక్యాలకూ భేదం స్వల్పం. సంకలనార్థంలో క్త్వార్థక వాక్యాలే సంయుక్త వాక్యప్రయోజనంలో ప్రవర్తిస్తై పదబంధ సంయోగంలో సంయోగ సూచకం సంయోజక పదబంధా లన్నిటికీ పరంలో ప్రత్యయంలాగా వస్తుంది. కొన్ని భాషల్లో పూర్వంలో వస్తుంది. ఇంగ్లీషులో and, or, but అనే పదాలను వాటికి పరంలో ఉన్న పదాలకు సన్నిహితమైనవిగా భావిస్తారు.

**5.4 :** ఇవిగాక ఇంకా చాలా విశేషాలను ప్రస్తావించవచ్చుగాని, ఏది విశేషం అని నిర్ణయించుకోటం కష్టం. ఈ పైన పేర్కొన్నవి సర్వభాషా సామాన్యాలు కావు. ఇవి తెలుగులోనూ, ఇతర ద్రావిడ భాషల్లోనూ మాత్రమేకాక ఎక్కడో దూర తీరాల్లో ఉన్న భాషల్లో కూడా కనిపించవచ్చు. భాషలు భిన్నత్వాన్ని నిలుపుకుంటూనే ఏకత్వాన్ని సూచిస్తై మానవత్వాన్ని పూర్తిగా ప్రతిబింబించేది భాష. మనుషుల్లోనూ, భాషల్లోనూ భేదాలున్నా మనుషులంతా ఒకటే, భాషలన్నీ ఒకటే.

# పరిభాష

అనుకరణ సూచకం - quotation marker
అనుకర్త - reporter
అనుకారకం - quotation marker
అనుభోక్త - experiencer
అనువక్త - reporter
అనుశ్రోత - hearer of the report
అప్యర్థకం - concessive
అమూర్తనామం - abstract noun
అర్థప్రధానం - information centred
ఆఖ్యాతం - predicate
ఆఖ్యాతబంధం - Predicate phrase
ఆధారదళం - conditional clause
ఆధేయదళం - conditioned clause
ఆనుపూర్విక - chronological
ఉపవాక్యం - clause
ఏకకర్తృక నియమము - like-subject constraint
ఏకవస్తుబోధకత - coreferentiality
ఏకైక సంబంధం - isomorphism, one to one correspondence
కర్తృద్ధరణ సూత్రం - subject raising rule
కాంక్షార్థకనామం - intentive nominal
కారణవాక్యం - causal clause
కార్యవాక్యం - result clause
క్రియాబంధం - verb phrase
క్రియావిభక్తి సంధానసూత్రం - agreement rule
క్త్వార్థకం - perfective participle
గతి - process
గమనార్థకక్రియలు - motion verbs
గర్భవాక్యం - embedded sentence
గర్భివాక్యం - matrix sentence
గుప్తనిర్మాణం - deep structure
చర్య - action
చేదర్థకం - conditional
తత్క్షణభవితవ్యం - inceptive
ధాతువిస్తరణ - stem extension
నామబంధం - noun phrase
నామ్నీకరణం - nominalizations
నిరధీనత - uncontrollability
నిరనుబంధ - disjunctive
నిశ్చయార్థకం - assertive
పదక్రమ వ్యత్యాసం - change of ward order
పదబంధం - phrase
పరప్రయోజనార్థకం - benefactive
పరిపూరణార్థకం - completive

పరిణామబోధక క్రియలు - change of state verbs
పరోక్షప్రశ్న - indirect question
పరోక్షవిధి - indirect imperative
పరోక్షానుకరణ - indirect speech
పారస్పర్యార్థం - reciprocative
ప్రత్యక్షానుకరణ - direct speech
ప్రధాన క్రియ - main verb
ప్రధాన వాక్యం - main clause
ప్రయోజనార్థకం - purposive
ప్రవృత్తి - function
ప్రాధాన్య వివక్ష - focus
బుద్ధ్యర్థక క్రియలు - verbs of cognition
భిన్న కర్తృక నియమం - unlike subject constraint
భాషీకరణ - codification into language
భౌతిక వ్యాపార క్రియలు - physical process verbs
మనోవ్యాపార క్రియలు - mental process verbs
యత్తదర్థక వాక్యాలు - correlative sentences
రీత్యర్థం - manner
వచ్యర్థక క్రియలు - speech verbs
వికల్ప సంయోజన - alternate coordination
విభక్తి బంధం - case phrase
విభక్త్యర్థక నామ్నీకరణం - relative nominalizations
విషయార్థక నామ్నీకరణం - factive nominalization
వ్యక్త నిర్మాణం - surface structure
శబ్ద ప్రధానం - code centred
శత్రర్థకం - durative participle
శత్రర్థ బోధ - duration
శ్రవణార్థక క్రియలు - hearing verbs
సంకలన సంయోజన - additeve coordination
సంఘటన - event
సందేహార్థకం - dubitative
సంభావన - expectation
సంభావ్యమాన - conceivable ; unreal
సంయుక్త పదబంధం - coordinate phrase
సంయుక్త వాక్యం - coordinate sentence
సంశ్లిష్టవాక్యం - complex sentence
సనామబంధ లోపం - equi-NP delition
సమబోధకత - coreferentiality
సమసామయిక - simultaneous
సమాన కర్తృక నియమం - like subject constraint
సమీకరణ వాక్యాలు - equational sentences

సర్వనామ పరివర్తక సూత్రం - pronoun change rule

సర్వనామీకరణం - pronominalization

సాధారణ పదక్రమం - unmarked word order

సాధ్యనామం - derived noun

సానుబంధ - conjunctive

సామర్థ్యార్థం - abilitative

సామాన్య వాక్యం - simple sentence

సిద్ధనామం - basic noun

స్థితిబోధక క్రియలు - stative verbs

స్థితిభేదం - change of state

స్వాధీనత - controllability

స్వామ్యార్థం - possessive